

ఆంధ్రపత్రిక
ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY



బూరెబుగ్గలు

—ఫొటో : బి. రంగనాథన్.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక
Founder : K. NAGESWARA RAO


సంపుటము 49
సంచిక 28
14-3-56

మన్మథ ఫాల్గుణ శుద్ధ ద్వితీయ బుధవారం



ఈమధ్య మద్రాసులో జరిగిన చైనీస్ కళాప్రదర్శనంలోని 'కీలుబొమ్మలు.'

విషయానుక్రమణిక



శ్రీ కృష్ణ
(ఆంధ్రపత్రిక విలేఖరి)

ఈ వారంలో ప్రజాస్వామ్యాన్ని గురించి ఒక చర్చ జరిగింది. ఈ చర్చలో ప్రసంగిస్తూ భారత ప్రధానమంత్రి ఇలాగ ఉద్బోధించారు.

"ఈ పరమాణుయుగంలో ప్రజాస్వామ్యం బాగా అభివృద్ధిపొందాలంటే నానాటికీ హెచ్చుపెరిగిపోతున్న సాంఘికార్థిక సమస్యలన్నీ జాగ్రత్తగా పరిష్కరించాలి. ఆ పరమాణుయుగానికి అనుకూలమైన ధోరణిలో ప్రజాస్వామ్యం రూపొందాలి ప్రస్తుతం భారతదేశం ఇంకా బాగా పాతయుగంలోనే ఉన్నది."

అమెరికా అధ్యక్షుడు సెనేట్ వ్యవహారాల నిజాయితీని గురించి విచారణ జరిపించవలసిందని ఆదేశించారని ఈ మధ్యనే పత్రికల్లో ప్రకటించారు. లాబీవర్గాలు, పత్రికా ప్రతినిధులు మొదలైనవారి చర్యలే ఈ విచారణకు ప్రధాన కారణమని తెలుస్తున్నది.

మన పార్లమెంటులో లాబీవర్గాలు ఇంకా అమెరికా లాబీవరాల ఉన్నతస్థాయి అందుకోలేదు. ఇవి ఇటీవలే క్రమక్రమంగా బలపడుతున్నాయి.

బ్యాంక్ ఉద్యోగుల వ్యవహారాలు దీనికి ఒక ఉదాహరణగా తీసుకోవచ్చును. ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సమ్మెలోనికి దిగవద్దని వ్యక్తిగతంగా హెచ్చరించినా లక్ష్యపెట్టకుండా బ్యాంకుఉద్యోగులు ఇటీవల రెండురోజులపాటు సమ్మెచేశారు.

కేంద్ర కార్మికశాఖకూడా ఈ సమ్మె చట్టవిరుద్ధంగా జమకట్టగలమని నిష్కర్షగా చెప్పివేశారు. సమ్మెచెయ్యడానికి వీలులేదని హెచ్చరించారు. అయినా కార్మిక నాయకులీ సమ్మె విరమించలేదు.

అప్పటినించీ ఒక త్రైపాక్షిక సమావేశం జరగాలనీ దీనిలో బ్యాంకు ఉద్యోగులు, బ్యాంకు అధికారులు, భారత ప్రభుత్వము పాల్గొనాలనీ కేకంలో వార్తాసంస్థలు కొన్ని సూచనలు ప్రచారం చెయ్యడం ప్రారంభించాయి. ఈ సమస్య బ్యాంకు ఉద్యోగులకు తృప్తికరంగా పరిష్కరించాలనికూడా వార్తాసంస్థలు ప్రచారం సాగించాయి.

భారత ప్రభుత్వాధికార వర్గాలు వెంటనే ఈ సూచనలు ఖండించారు. ఈ విధమైన త్రైపాక్షిక సమావేశం జరపవలసిన అవసరం ఏమీలేదనీ, బ్యాంకులఅవార్డ్‌ద్వారా ఈ వ్యవహారం అంతా ఇంతకు పూర్వమే పరిష్కారమై పోయిందనీ, ఇదే చట్టంగా తయారైనదనీ భారత కార్మిక మంత్రి ఖండూభాయ్ దేశాయి ఈ సందర్భంలో ప్రత్యేకంగా ఒక ప్రకటనకూడా చేశారు.

నిజానికి ఈ సమస్య చాలా చిన్నది. భారత ప్రభుత్వం వైఖరి ఎలా ఉండాలో

"చిరకాలపు రుచిరస్వప్నం"

విశాలాంధ్ర

ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలను ఏకీకరించాలని భారత ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రధానమంత్రి నెహ్రూ ఈనెల 5-వ తేదీన నిజామాబాద్‌లో ఒక బహిరంగసభలో ప్రకటించారు.

అన్నిపక్షాల ఆమోదంతో భారతప్రభుత్వం ఈ నిర్ణయం చేసినట్లు శ్రీ నెహ్రూ వెల్లడించారు.

తెలంగాణావారికి తగిన రక్షణలు కల్పిస్తామని ఆయన చెప్పారు. ఆంధ్ర, తెలంగాణాల ప్రయోజనాలకు భంగము కలుగకుండా చూచే నిమిత్తం రెండు ప్రాంతీయమండలులను ఏర్పాటు చేస్తారు. విద్యాసౌకర్యాలలోనూ, ప్రభుత్వోద్యోగాలలోనూ ప్రాంతీయాభివృద్ధిని సాధించడం ఈ మండలుల కర్తవ్యం.

"ఏకీకరణ నిర్ణయాన్ని వీలైనంత సామరస్యంతో అమలు జరిపేందుకు అందరూ కృషి చేస్తున్నారు. ఇది చాల సంతోషదాయకమైన విషయం. ఇకనుండి తెలంగాణా ఆంధ్రతో కలసి మెలసి అభివృద్ధిపథాన సాగిపోవాలి. భారతప్రభుత్వ నిర్ణయాన్ని సంతోషంతో ఆమోదించి, ఉభయ ప్రాంతాల ఐక్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు నా విజ్ఞప్తి" అని శ్రీ నెహ్రూ ఉద్బోధ చేశారు.

★ న్యూఢిల్లీ లేఖ ★

వివరించ గలిగినవా రెవరు? కేంద్ర కార్మిక శాఖవారా? బ్యాంకు ఉద్యోగులా? భారత కార్మిక శాఖ అయితే కార్మిక మంత్రి ఖండూభాయ్‌దేశాయ్ ఈ వ్యవహారం అంతా కుండ బద్దలు కొట్టినట్టు స్పష్టంగా తేల్చివేశారు.

అయితే న్యూఢిల్లీలో ఉండే పత్రికలు, వార్తా సంస్థలు ఈ వ్యవహారంలో భారత ప్రభుత్వ వైఖరిలో మార్పేమైనా వచ్చిందేమో గమనించాయా? వార్తా సంస్థల ప్రధాన కార్యాలయాలు, పత్రికల కార్యాలయాలు చాలా వరకు న్యూఢిల్లీలోనే ఉన్నాయి. ఇందుచేత భారత ప్రభుత్వ వైఖరి తెలుసుకోవడం ఏమీ అంత కష్టం కాదు. అదీగాక సరియైన వార్తలు సరఫరా చెయ్యడానికి భారత ప్రభుత్వపు సమాచార శాఖ కూడా ఉన్నది.

అయినా కొందరు బ్యాంకు ఉద్యోగులేదో ఒక చిన్న ప్రకటన చేసేసరికి ఈ విషయంలో కొన్ని చిత్ర విచిత్రమైన వార్తలు ప్రచారం చెయ్యడం ప్రారంభించారు. వీటివల్ల అనేకమైన అపోహలు కలుగుతున్నాయి. బ్యాంకుఉద్యోగులను తక్కువారిలో కలుగుతున్న నాయకమ్మన్యుల నాయకత్వానికి చెమ్మటిగా పుసాలులు వస్తున్నాయి.

అంచనాలసంఘం ఇటీవల తన నివేదిక పార్లమెంటుకు సమర్పించింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఈ నివేదిక కొక నూతన ప్రకరణం ప్రారంభిస్తున్నది. అంచనాలసంఘ అధ్యక్షుడు శ్రీ బల్వంతరాయ్ గోపాల్జీ మెహతాకు, ప్రణాళికాసంఘ ఉపాధ్యక్షునికీ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలే ఈ నివేదికకు నిండా ఉన్నాయి. ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో రైల్వేలకు ఇంకా ఎక్కువ ధనం కేటాయించాలని శ్రీ మెహతా కోరారు.

“భారత రైల్వేలు త్వరలో యధాస్థితికి రావాలంటే తీవ్రమైన కృషి జరుగవలసి ఉన్నది. భారీయెత్తున పథకం వేసుకుంటే తప్ప రైల్వేసామగ్రి, పరికరాలు అభివృద్ధి అయ్యే అవకాశం లేదు. ద్వితీయ పంచవర్ష ప్రణాళికను ఆమోదించేలోగా యీ విషయమై శ్రద్ధ వహించవలసి ఉంది. చిత్తగించవలెను” అని శ్రీ మెహతా వ్రాశారు. ఈ ఉత్తరంపై “ప్రియమైన కృష్ణమాచారి గారికి” అని సంబోధన ఉన్నది.

కేంద్రమంత్రివర్గంలోకల్లా ఒక్క ప్రధాన మంత్రిమాత్రమే అధికారికమైనమర్యాదలకూ వ్యక్తిగతమైన స్నేహాలకూ సరిహద్దు రేఖ గీసి వ్యవహరిస్తారు. రాష్ట్రపతికి అధికారికలేఖ వ్రాయవలసివస్తే “ప్రియమైన రాష్ట్రపతికి” అని వ్రాస్తారుగాని, “ప్రియమైన రాజెన్ బాబుకు” అని వ్రాయరు. అదలా వుంచి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అంచనాల సంఘం విధులేమిటనే విషయంలో ఒక సమస్య ఉదయిస్తున్నది.

అంచనాలసంఘం అనేది, పార్లమెంటుకు సమర్పించబడిన అంచనాలను పరిశీలించడానికి, అంచనాలను ఏ రూపంలో సమర్పించాలో సూచించడానికి, అంచనాల ఆశయానికి భంగంరాకుండా ఖర్చును ఎలా తగ్గించవచ్చునో సూచించడానికి ఏర్పడుతుంది.

అంటే ప్రభుత్వంచేసే ఖర్చులను తన తరఫున పరిశీలించడానికి పార్లమెంటు అంచనాలసంఘాన్ని నియమిస్తుందని అర్థం. కాని, న్యూఢిల్లీలో ఆ సంఘం అధ్యక్షుడు ప్లానింగ్ సంఘంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం, రైల్వేలకు బాగా ధనం కేటాయించాలని సూచించడం చూస్తే అంచనాల సంఘం కూడా ప్రభుత్వంలాగ వ్యవహరించ చూస్తున్నట్లు అనిపిస్తున్నది. అది ప్రభుత్వముపై ఒత్తిడి చేయడానికి పూనుకున్నది. ఇదే పార్లమెంటరీ ప్రజాస్వామ్యమైతే ఆ మాటలకు అసలు అర్థం పోయిందనుకోవలసి వస్తుంది.


* * *


ఢిల్లీ, జుమా మసీద్ మరమ్మతులనుగూర్చి లోక్‌సభలో పండిట్ భద్రీదత్ పాండే ఒక ప్రశ్న వేశారు. మౌలానా ఆజాద్ తరఫున శ్రీ దాస్ సమాధానం చెబుతూ, పురావస్తు పరిశోధన శాఖ మరమ్మతులను కొనసాగిస్తుందని, ఒక లక్ష ఖర్చవుతుందనీ చెప్పారు. మతసంబంధమైన ఆకట్టడానికి డబ్బు ఎందుకు ఖర్చు చేస్తున్నారు, ఇతర మతాలకు సంబంధించిన కట్టడాలకు అలా ఖర్చుచేస్తారా అని పండిట్ పాండే అడిగారు. ప్రధానమంత్రి సమాధానమిస్తూ, “చేస్తాము. ఆ కట్టడానికి చారిత్రకంగాగాని కళావిషయకంగా గాని ప్రాముఖ్యం ఉంటే అలాగే చేస్తాము” అన్నారు. ఇక్కడ వచ్చిన రాజ్యాంగ సమస్య ఏమిటంటే అరక్షిత క్షేత్రాలన్నిటినీ కాపాడే బాధ్యత పురావస్తు శాఖ తీసుకుంటుందా అని.

ఈ శాఖను కర్జన్ ప్రభువు ఏర్పాటు చేశారు. “రక్షిత క్షేత్రాలను” జాగ్రత్తగా ఉంచేందుకు గాను ఈ శాఖకు ఏటా కొంత ధనం గ్రాంటు చేస్తారు.

జుమా మసీదు చారిత్రక ప్రాముఖ్యాన్ని ఎవరూ శంకించరు. అలాగే ఉదాహరణకి

(56 పేజీ చూడండి)





కొత్త సంవత్సరంలో ఆయవ్యయ అంచనాలు

ఆర్థికమంత్రి శ్రీ చింతామణి దేశ్‌ముఖ్, కొత్త సంవత్సరానికి ఆయవ్యయ అంచనాలను ఫిబ్రవరి 29 వ తేదీన పార్లమెంటులో ప్రతిపాదించారు. ఈ అంచనాల ప్రకారం 1956-57 లో పన్నుల ద్వారా రాబడి రు. 493 కోట్ల 60 లక్షలు కాగా, ఖర్చు రు. 545 కోట్ల 48 లక్షలు ఉంటుందని తేలింది. అంటే రెవెన్యూ పద్దుక్రింద రు. 51 కోట్ల 88 లక్షలు లోటు తేలిందన్నమాట. కొత్త పన్నులద్వారా వసూలు కాగల మొత్తం రు. 34 కోట్ల 15 లక్షలదాకా ఉంటుంది. ఇది ఎలాఉన్నా, తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలదృష్ట్యా మొత్తం మీద రు. 890 కోట్లు లోటు ఉంటుంది. ప్రభుత్వ ఖజానా పత్రాలను పెంచడంద్వారా దీనిని భర్తీచేస్తారు. పెట్టుబడి పద్దుక్రింద కాగల ఖర్చు దాదాపు రు. 700 కోట్లలో రు. 316 కోట్లవరకూ కేంద్రప్రభుత్వం అమలుజరిపే ప్రణాళికలకు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వాలు అమలుజరిపే ప్రాజెక్టులకై, ఆయా రాష్ట్రాలకు రు. 386 కోట్లవరకూ అప్పులు ఇవ్వడానికి ప్రత్యేకించారు. ఈ ఖర్చుకి తలపెట్టిన రాబడిమార్గాలలో, విదేశీ సహాయంద్వారా రు. 85 కోట్లవరకూ లభిస్తుందనుకుంటున్నారు.

కొత్తసంవత్సరంలో విధించే పన్నులలో ముఖ్యమైనవి: నూలువస్త్రాలపై (చీరలు, ధోవతులు మినహా) చదరపు గజానికి 6 పైసలు ఎక్సైజు సుంకం పెంచారు. దీనిద్వారా రాబడి రు. 14 కోట్ల 50 లక్షలు. విద్యుచ్ఛక్తితో పనిచేసే యంత్రాలు ఉత్పత్తిచేసే దుంపనూలుపై పౌనుకు 6 పైసలు. సబ్బు పైనా, మాయపట్టుపైనా పౌనుకు 6 పైసలు. డీసెల్ నూనె మొదలైనవాటిపై విధించే దిగుమతిసుంకం 6 పైసలు రద్దుచేసి ఆ స్థానే, హెచ్చరకం డీసెల్ నూనెపై గాలన్‌కు 4 అణాలు విధిస్తారు. రు. 150 లక్షలకు పైబడ్డ ఆదాయాలపై సూపర్ టాక్సును 88.6%నుండి 91.9%కు పెంచుతారు. తపాలా రిజిష్ట్రేషన్ రుసుము 6 అణాలనుండి 8 అణాలకు, మామూలు టెలిగ్రాముల కనీసరుసుము 12 అణాల నుండి 18 అణాలకు, ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాములకు రూపాయిన్నరనుండి రూపాయి పదణాలకూ పెంచుతారు.

[illegible] రు. 3-4-0 నుండి రు. 4 వరకూ అమ్మే కేయూరు పైమాత్రం పన్ను 8 అణాల నుండి 6 అణాలకు తగ్గించారు.

రాబడిమార్గాలు ఇలా ఉండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో దుబారా నివారించి ఖర్చులు పొదుపుచేయడంకోసం ప్రత్యేకం ఒక సంఘాన్ని నెలకొల్పుతున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు.

ఆంధ్రలో రు 324 లక్షలు లోటు

1956-57 లో ఆంధ్రరాష్ట్రానికి రాబడి రు 28 కోట్ల 70 లక్షలుకాగా ఖర్చు రు 26 కోట్ల 95 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. లోటు రు 324 లక్షలు తేలింది. 1955-56 లోనే ఆమోదించబడ్డ కొత్త పన్నులద్వారా ఈ సంవత్సరంలో రు 216 లక్షలవరకు రాబడి అంచనా వేశారు. వీటిలో ఇళాంభూములపై రైత్వారీ శిస్తుద్వారా 46 లక్షలు, కొన్ని రకాల మిల్లుగుడ్డలపై సుంకంద్వారా రు 50 లక్షలు, పొగాకుపై కొనుగోలుపన్నువల్ల రు 60 లక్షలు, భూమిశిస్తుపై అదనపుసుంకం రు 45 లక్షలు, కోర్టురుసుముల సవరింపుద్వారా రు 15 లక్షలు వస్తుంది. కాగా, భూమి అభివృద్ధిపన్ను, కొత్తభూములపై నీటితీరువ విధించడానికి చేసిన చట్టాలవల్ల 1957-58 నుండి కాని డబ్బురాదు.

పెట్టుబడి పద్దుక్రింద వివిధ పథకాలు అమలు జరుపడానికై ప్రజలవద్ద రు. 6 కోట్లు కేంద్రప్రభుత్వంవద్ద రు 15 కోట్ల 91 లక్షలు అప్పు తీసుకోవ దలచినట్లు ఆర్థిక మంత్రి శ్రీ గోపాలరెడ్డి ప్రకటించారు. కాకే, ఏప్రిల్‌లో అమ్మకంపన్ను విధింపు విచారణసంఘం నివేదిక వెలువడవచ్చునట, రాష్ట్ర ఆదాయాభివృద్ధికి కొత్తమార్గాలు ఆలోచించి ఏర్పాట్లు చేస్తామన్నారు. చెరకుమీద టన్నుకు నాలుగురూపాయల పన్నువిధించి, తద్వారా రు 12 లక్షలతో నిధి నెలకొల్పి చెరకు వ్యవసాయాభివృద్ధికి తోడ్పడం చేస్తామనికూడా చెప్పారు.

ఈసారి బడ్జెట్ ఆయన తెలుగులోనే చదివారు. ఇది తాము ప్రవేశపెట్టే రెండవ బడ్జెట్ అని విశాలాంధ్ర అవతరిస్తే 'ఆంధ్రరాష్ట్రానికి' ఇదే ఆఖరి బడ్జెట్ కాగలదనీ ఆయన అన్నారు. ఆయన ఈ మాటలుఅన్న [illegible] 'మహారాష్ట్ర' [illegible] ప్రకటించారు.

* * *

హైదరాబాద్‌లో ఆఖరి బడ్జెట్

హైదరాబాద్ రాష్ట్రంలో ఆఖరి బడ్జెటు లో రు. 490 లక్షల లోటు చూపింది. పన్నులద్వారా రాబడి రు 26 కోట్ల 8 లక్షల 98 వేలు కాగా, ఖర్చు రు. 30 కోట్ల 87 లక్షల 72 వేలు ఉంటుందని అంచనా వేశారు. పెట్టుబడిపద్దుక్రింద అభివృద్ధి కార్యక్రమాలకు 14 కోట్ల 24 లక్షల 77 వేలు అంచనా వేశారు. అందువల్ల మొత్తం మీద రెవెన్యూ పెట్టుబడి పద్దులక్రిందం 18 కోట్ల 55 లక్షలు లోటు తేలింది. అయినా రూపేనా కేంద్రంవద్ద మొత్తం 9 కోట్లు, ప్రజలవద్ద దాదాపు రెండున్నర కోట్లు, నిధులను రొక్కంగా బదలాయించి రెండుకోట్లు సమకూర్చుకుంటే, నికరంగా తేలేలోటు రు 4 కోట్ల 92 లక్షల వరకూ ఉంటుంది. ఈ లోటులో రు 70 లక్షలవరకూ కొత్తపన్నులద్వారా వసూలు చేయదలచారు. మద్యాలు, సిగరెట్లు, పెట్రోలు, కిరసనాయిలు, పంచదార, బెల్లం మొదలైనవాటిపై అమ్మకంపన్నులు పెంచడంద్వారా 54 లక్షలు, స్టాంపులపై సుంకంపెంచి 5 లక్షలు, వ్యావసాయ కార్యాలపై పన్నులు పెంచడంద్వారా 11 లక్షలూ ఈ మొత్తం రాబట్టుతారు. మిగతా లోటు భర్తీకి ఋణాలు చేయాలి.

రాష్ట్ర ఆర్థికమంత్రి శ్రీ వినాయకరావ్ కోర్టాట్కర్ మొట్టమొదటిసారిగా బడ్జెటును హిందీలో ప్రతిపాదించారు. గతసంవత్సరం ఆయవ్యయాలను సమీక్షిస్తూ 1954-55 కన్న 55-56 లో రాష్ట్ర ఆర్థిక స్థితి కొంత తేసికట్టుగా ఉన్నదనీ, వ్యవసాయ వస్తూత్పత్తి తగ్గిందనీ, మద్యం వినియోగం తగ్గినందువల్ల సంవత్సరారంభంలో అంచనాలు వేసుకున్న రాబడి కొంత తగ్గిందనీకూడా ఆయన చెప్పారు. ★

ఒక మద్రాసీ పెద్దమనిషి:
"మా ఇల్లు ఒక చిన్న భాషా రాష్ట్రం లాంటిది. మా యింటి యజమాని గుజరాతీ. మా దాసీ కన్నడం మనిషి. మా ఆవిడ మహారాష్ట్రం మాట్లాడుతుంది. సరే నేను అరవవాణ్ణికొండి."

దేవదాసి

ప్రాచీన గాథాలహరి

పి. గణపతి శాస్త్రి

(గతసంచిక తరవాయి)

౮

మహామాత్యుడు వెంటనే జయంతదేవుని భవనానికి వెళ్ళి తనకు జయాపీడునికీ మధ్య జరిగిన సంధి రాయబార వ్యవహారా లన్నీ సవిస్తరంగా నివేదించాడు. జయంత దేవుడు ఆ వృత్తాంతం అంతా విని చాలా సంతోషించాడు. జయాపీడదేవుని సైన్యాలు వెంటనే పౌండ్రవర్ధననగరంలో ప్రవేశించ డానికి కాశ్మీర చక్రవర్తికి సామంతమాత్రంగా కప్పం కటడానికి అంగీకరించాడు. కల్యాణ దేవిని జయాపీడునికిచ్చి వివాహం చెయ్య డానికి కూడా అభ్యంతరమేమీ చెప్పలేదు. కాని ఆమెకు పట్టమహిషీగౌరవం లేక పోవడం అతనికి సుతరామూ నచ్చలేదు. ఇన్ని విధాలుగా తాము సామరస్య మార్గం అవలంబించి సంధికి ఒడంబడినా జయాపీడ చక్రవర్తి ఆమె పట్టమహిషీగౌరవాని కంగీకరించకపోవడం అతనికి ఎంతో అవమానకరంగా తోచింది. అందుచేత ఏమైనా ఈ విషయానికిమాత్రం తా నెంతమాత్రము అంగీకరించేది లేదని ఖచ్చితంగా చెప్పివేశాడు. వృద్ధమంత్రి ఈ చిన్న విషయాని కింతగా పట్టుపట్టడంవల్ల సంధి వ్యవహారం పూర్తిగా చెడిసిపోవచ్చునని జయంతదేవునికి విస్పష్టంగా చెప్పివేశాడు.

అయినా అతడా విషయాని కంగీకరించలేదు. వృద్ధమంత్రి తిరిగీ జయాపీడుని సన్నిధికి వచ్చి అతనితో ఆ విషయం ప్రస్తావించాడు. జయాపీడు డామెను వివాహమాడడానికే అంగీకరిస్తున్నాననీ ఇక పట్టమహిషీ గౌరవవ్యవహారం తనతో ప్రస్తావించవద్దనీ నిష్కర్షగా చెప్పివేశాడు. చక్రవర్తి కది మొట్టమొదటి వివాహమనీ అందువల్ల ఆ గౌరవం కళ్యాణదేవికే చెందడం ధర్మసమ్మతమనీ అలాగ కాని పక్షంలో అది అనూచానమైన ధర్మసంప్రదాయానికే వ్యతిరేకమనీ మంత్రి తిరిగీ అనేక విధాలుగా జయాపీడ చక్రవర్తికి విన్నవించాడు. కాని ఏమీ ప్రయోజనం కలగలేదు! మంత్రికి వ్యవహారం అంతా మొదటికి వచ్చిందనీ ఇక యుద్ధం తప్ప వేరే గత్యంతరమేమీ లేదనీ భయం వేసింది. అయినా పైపైకేమీ తొణకకుండా జయాపీడునిదగ్గర సెలవు తీసుకుని తన భవనానికి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి రాత్రి అంతా ఈ వ్యవహారంలో తల బద్దలు కొట్టుకోగా తెల్లవారుఝామున అతని కొక ఆలోచన స్ఫురించింది.

ఆ మరునాడు వెంటనే ఒక కర్ణీరథంలో ఒక పరిచారికను వకుళమాలికభవంతికి పంపించి, అతి రహస్యంగా ఆమెను తన ప్రాసాదానికితోడ్కొనిరావలసిందని చెప్పి అలాగే ఆమె రాకకోసం నిరీక్షిస్తూ నిలుచున్నాడు.

పౌండ్రవర్ధన నగరం కార్తికమాస సూర్యోదయ కాంతులలో అప్పుడప్పుడే మేలుకొంటున్నది. మంత్రిభవంతి చుట్టూ కలకలలాడే ఉద్యానవనంలో రంగురంగుల సీతాకోకచిలకలు ప్రాతఃకాల స్వర్ణకాంతులలో ఎగురుతూ చిత్రవిచిత్రంగా మెరిసిపోతున్నాయి. ఆ ఉద్యానవనం అంతా సూర్యోదయ కాంతి ప్రవాహంలో తల మునకలై ఓలలాడుతున్నట్లు స్ఫురించింది.

కొంతసేపటికి వకుళమాలిక కర్ణీరథం దిగి మెల్లగా మంత్రి గృహంలో ప్రవేశించింది. మంత్రి ఆమె లోపలికి రాగానే ఎంతో ఆప్యాయంగా గౌరవించాడు. ఆ అపూర్వ గౌరవం ఆమెకెంతో అపురూపంగా కనిపించింది. ఇక అక్కడ వృద్ధమంత్రి వకుళమాలిక తప్ప ఎవరులేరు. అతడు లోలోపల ఏదో ఆలోచిస్తూ క్షణకాలం ఆమె ముఖవైఖరి పరిశీలించాడు. ఈ వేళ ఆమె సౌందర్యం ద్విగుణీకృతమైపోయినట్లు మెరిసిపోతున్నది.

మంత్రి, చెప్పవలసినంతవరకు ఆమెకు జయాపీడుని వృత్తాంతం తెలియజేశాడు. అదంతా చాలావరకామెకు తెలిసిందే. ఆమె తనకు తెలిసిన వృత్తాంతంకూడా కొంతవరకు అతనికి తెలియజేసింది. అంతేగాని తన అనురాగవృత్తాంతమేమీ అతనికి తెలియనీయకుండా గుంభనగా దాచివేసింది. జయాపీడుని వైణిక విద్వత్తు విని వీణావాద్యంలో విశేషాలు గ్రహించడానికే తన భవంతికి ఆహ్వానించాననీ — మొట్టమొదట అతడు కాశ్మీర చక్రవర్తి అన్న రహస్యం తనకేమీ తెలియదనీ అన్నది.

వృద్ధమంత్రి ఈ కథ అంతగా నమ్మలేదు. కాని అది పూర్తిగా నమ్మినట్లే నటించాడు. జయాపీడుడు కల్యాణదేవిని పట్టమహిషిగా స్వీకరించక పోవడానికి కారణం కనుక్కోవాలనీ, ఆ విషయంలో ఆమె సహాయపడగలదనీ అతడాశించాడు. కాని ప్రయోజన మేమీ కలగలేదు!

"ఏమైనా ఈ వ్యవహారంలో నీ చాకచక్యము, సాహాయ్యము చాలా అవసరం!" అన్నాడు మంత్రి నిశ్చలంగా ఆమెకేసి చూసి.

"నేను కేవలం అబలను. నేనేమి చెయ్యగలను!"

"గౌడరాజ్యం అంతా చాలా విషమ సంధిలో పడిపోయింది! ఈ సమయంలో మమ్మల్ని ఉద్ధరించ గలిగిన దానవిక నీవొక్కతెవే!"

"మన మహారాజు విషయంలో అంత పట్టు పట్టవలసిన అవసరమేమి కలిగింది? జయాపీడులు కల్యాణదేవిని వివాహమాడడానికి అంగీకరించారు కదా!"

"అది నిజమే! కాని పట్టమహిషిగా

అంగీకరించడం లేదు! అది మన రాజవంశానికెంతటి అగౌరవం! ఇలాంటి విడ్డూర మెన్నడైనా ఎక్కడైనా జరిగిందా?"

"నిజమే! మరి జయాపీడు లామెను పట్టమహిషిగా అంగీకరించేది లేదని భీష్మించుకొని కూర్చున్నప్పుడు ఇక గత్యంతర మేమిటి?"

"గత్యంతరం లేకేమి?—నీ వొకసారి ఆయనతో నొక్కి చెప్పాలి."

"నేనా?"

"అవును నీవే!"

"నా కాయనదగ్గర అంతటి చనువు లేక!"

మంత్రి ఆమె తనతో అన్ని విషయాలు మనసు విడిచి ప్రసంగించడం లేదనీ కాని ఆమెకు జయాపీడునితో కొంత సన్నిహిత పరిచయం ఏర్పడి ఉండవచ్చుననీ గ్రహించి వేశాడు. అంతేగాని అంతకంటె లోతుగా అతని ఆలోచన పోలేదు. అయినా అది పైకి తేలకుండా నెమ్మదిగా ఇలాగన్నాడు:

"వకుళా! ఇటు చూడు! నావంటి వృద్ధుల నే నీ సౌందర్యం ఉక్కిరి బిక్కిరి చేస్తోందే! ఇక తరుణుల మాట వేరే చెప్పాలా!"

ఈ ధ్వనితో వకుళమాలిక చెక్కిళ్లెర్ర బడ్డాయి. ఆమె వెంటనే తలవంచుకొన్నది!

"ఇవి కేవలం నామీద అప్యాయం కొద్దీ అన్న మాటలు! ఇంతకీ మీరి మాట లెందుకన్నారో నాకు తెలియకపోలేదులెండి! ఏమైనా వారంతటి సులభులు మాత్రం కారు!"

"పోనీ నీవు యథాశక్తిగా ప్రయత్నిస్తానని మాట ఇస్తే - నాకదే పదివేలు!"

"ఎంతమాట! తప్పక ప్రయతిస్తాను! కాని నా కంతగా ఆశలేదు!"

"నా కింకా ఆశపోలేదే! పౌండ్రవర్ధన పౌరుల యోగక్షేమాల కిక నీవే దిక్కు! మరి ఈ ప్రయత్నం నెరవేరలేదనే మాట వినబడగూడదు! తెలిసిందా?"

"సరే! తమ రిన్నిసారులు చెప్పాలా? ప్రయత్నించి చూస్తానన్నాను కదా!"

"తరతరాలనించీ పౌండ్రవర్ధన మహారాజులు మీకు దేవమాన్యాలిచ్చి గౌరవించారు! కార్తికేయస్వామి గౌడ రాజ వంశీయుల కులదైవం! ఇవ్వన్నీ ఒకసారి బాగా జ్ఞప్తికి తెచ్చుకోవాలీ వేళ!"

"నేనంతటికి కృతఘ్నురాలను కాను! కాని వారు నా మాట గౌరవించవలెను గదా!"

అని చెప్పి వకుళమాలిక తిరిగి వెళ్లిపోతూ అతని దగ్గర సెలవు తీసుకుని పది అడుగులు ముందుకు సాగింది.

అంతలో వృద్ధమంత్రికి మళ్ళీ ఏదో స్ఫురించింది. వెంటనే ఆమెను తిరిగీ ఇంకొకసారి లోపలికి పిలిచాడు. ఆమె ఎంతో ఆశ్చర్యపడింది. మళ్లీ అతని కెదురుగా వచ్చి నిలబడింది.

"వకుళా! ఈ వ్యవహారంలో నీవు కొంచెం స్వార్థం విడిచి వ్యవహరించాలి!" అన్నాడామె మాటలలో లోతులు గ్రహించి. వకుళమాలిక కొక్కసారిగా చెక్కిళ్ళలో కుంకుమధూళి చెలరేగింది. అయినా ఆమె అతి గుంభనగా ఆభావం పైకి కనబడనీయక అతని ప్రశ్నకు కేవలం ధ్వన్యుక్తిగానే ఇలాగ సమాధానం ఇచ్చింది.

"మాకు కావలసినది పరార్థమేగాని స్వార్థం కానేకాదే! అన్నీ తెలిసిన మీరే ఇలాగంటే ఇక నేనేమి చెప్పను!"

అని ఆమె కొంటెగా ఒక నవ్వు నవ్వింది.

మంత్రి ఈ ధ్వన్యుక్తి అంతరార్థం గ్రహించుకొని ఉద్వేగంగా ఒక నవ్వు నవ్వి-

"ఇంతటి ఔదార్యవంతురాలవు గనకనే ఇంతగా నిన్నీ విషయం అర్థిస్తున్నాను!" అన్నాడు.

మహామాత్యుడంతటి వ్యక్తి అదివంగా అర్థించేసరికి ఆమె కొంచెం మెత్తబడి—

"మీ రంతటిమాట అనకూడదు! నా యావచ్ఛక్తి వినియోగించి తప్పక ప్రయత్నిస్తాను." అన్నది.

మంత్రి ఆమె ముఖ్యభంగి గమనించి లోలోపల చాలా సంతోషించాడు. తిరిగీ ఆమె అతని దగ్గర సెలవు తీసుకొని తన భవనానికి మరలిపోయింది.

౬

వకుళమాలిక తన భవంతికి వచ్చివేసిన తరవాత చాలా సేపటివరకు ఏదో పరధ్యానంగా ఉన్నట్లే కనబడింది. మధ్యాహ్నం కొంచెంసేపు విశ్రమించిన తరవాత కమలను తన శయ్యాగృహంలోనికి పిలిచి మహామాత్యునికీ తనకు మధ్యన నడిచిన వ్యవహారం అంతా పూసగుచ్చినట్టు చెప్పివేసింది. కమల ఈ వ్యవహారం అంతా విని కొంతసేపటిదాకా అలాగే ఆశ్చర్యపోయింది. తరవాత వకుళమాలికతో గట్టిగా ఇలాగన్నది: "ఏది ఏమైనాసరే! నీవే పట్టపురాణివి కావాలి! నీవు కూడా నేనే పట్టపురాణిని కావాలని భీష్మించుకుని కూర్చో! వ్యవహారం అంతా దానంతట అదే సర్దుకుపోతుంది!"

"ఏమీ సర్దుకుపోదు! చివరి కిదంతా చిలికి చిలికి గాలివానగా మారుతుంది. అంతే!"

"ఏమీ భయంలేదు! నామాట నమ్ము! జయాపీడచక్రవర్తి గట్టిగా పట్టుపట్టితే మన మహారాజా లొంగిపోక తప్పదు!"

"ఆయన అలాగ లొంగిపోయేటట్టు కనబడడంలేదే! చివరి కిదంతా యుద్ధందాకా వచ్చి మన ప్రాణాలకు కూడా మోసం వచ్చేటట్టుందే!"

"పోనీ! అంతవరకు వస్తే అప్పటిమాట చూసుకుందాంలే! ప్రస్తుతానికి నీ పట్టు మాత్రం విడిచిపెట్టకు!"

"నేనేమీ పట్టుపట్టడమే లేదు! కళ్యాణదేవి విషయంలో నా శాయశక్తులా ప్రయత్నం చేస్తానని మహామాత్యులకు మాట ఇచ్చి వచ్చేశాను."

"మంచిపనే చేశావులే! గాని ఇక ఈ పైన ఏమీ ఎరగనట్టు మాట్లాడకూడదు! మళ్ళీ మహామాత్యులుగాని పిలిపిస్తే జయాపీడ చక్రవర్తి నామాట ఏమీ చెవిన పెట్ట లేదని చెప్పు! తెలిసిందా?"

"కాని కమలా! ఇంతా చేస్తే దీనివల్లకలిగే ప్రయోజనం?"


"సరిపోయింది! మళ్లీ మొదటికి వచ్చావా! నీవు కాశ్మీరచక్రవర్తికి పట్టపురాణి వవుతావు!"

వకుళమాలిక కొంచెంసే పాలోచించింది.

"సరేగాని—ఎందుచేతనో నాకీ పట్టమహిషీపదవి అంటే లోలోపల కొంచెం భయంగానే ఉందే కమలా!"

కమల నిర్ఘాంతపోయి వకుళమాలికతో ఇలాగన్నది.

"అయ్యో! వెర్రిదానా! ప్రభువులు బహువల్లభులు! ఈవేళ ఏర్పడిన అప్యాయత, అనురాగము రేపుండవు! నే నెన్నిమారులు చెప్పినా నామాటలక్ష్యపెట్టకుండా ఉన్నావు. తరవాత చేతులుకాలితే మరి పశ్చాత్తాపపడినా ప్రయోజనమేమీ ఉండదు! జాగ్రత్తగా ఆలోచించుకో!"



బుద్ధ జయంతికి ప్రత్యేక తపాలా బిళ్ల. ఈ చిత్రాన్ని శ్రీ ఆర్. డిసిల్వా (థానాజిల్లా) రచించారు. పోటీకి వచ్చిన 250 చిత్రాల్లో రెండింటిని ప్రభుత్వం స్వీకరించింది. ఇందులో బోధివృక్షం, ఛత్రం లోపలి భాగం, రావిరెమ్మ ఉన్నాయి.

★ దేవదాసి ★

ఆపైన నీయిష్టం!" అని కమల అక్కడినించి వెళ్ళిపోయింది!

వకుళమాలిక కొంచెంసేపు తటపటాయించి, ఒక్క నిట్టూర్పువిడిచి ఇలాగంది:

"కమలా! అంతటి అనురాగమే అదృష్టమైపోతే ఇక ఈ భోగభాగ్యాలు, పట్టుపీతాం గౌరవాలు నన్ను రక్షిస్తాయా! పోనీలే!"

"సరే! నీ ఇష్టం! విధివిధానం ఎవరు తప్పించగలరు! కాగా ఆలోచించుకో!"

"సరే! నేనిలా కొంతవరకు తప్పటడుగు వెయ్యనులే!"

తరవాత కమల [illegible] గా అక్కడినించి వెళ్ళిపోయింది.

వకుళమాలిక అక్కడే కూర్చుండిపోయి అనేకవిధాలుగా ఆ విషయాన్ని గురించి మథనపడింది. ఆమెకు కమల చెప్పినదే సరియైన మార్గమేమో అనిపించింది. కాని దానిమూలంగా జయాపీడ జయంతదేవుల మధ్య యుద్ధమే సంభవిస్తే! చిట్టచివరికి దాని పర్యవసానం ఏమౌతుందో! జయాపీడుడా యుద్ధంలో ఒకవేళ అంతరిస్తే? ఈ విషమైన ఆలోచనలు ఎటు తేలక చివరికి అలిసిపోయి ఆమె అక్కడే కొంచెంసేపు కన్ను మూసింది. ఆ [illegible] మైన కల ఆమె కళ్ళలో హరివిల్లులా మెరిసినట్లయింది! వెంటనే చిరునవ్వుతో కళ్ళు తెరిచింది. ఆ కల ఆమెకళ్ళల్లో అలాగే మెరిసింది.

లేచి ఎదురుగా సువర్ణదర్పణంలో అలంకారాలు, ముంగురులు చక్కగా సరిదిద్దుకొని మెల్లిగా జయాపీడుని వసతిగృహంలోనికి వెళ్ళిపోయింది. అతడక్కడ ప్రశాంతంగా కూర్చుని ఎదురుగా ఉన్న వీణా తంత్రులపై వేళ్ళనదిలిస్తూ శ్రుతులు సరిచేసుకొంటున్నాడు. సాయంకాల సంధ్యారాగం అతని అంగుళులతోబాటూ వీణాతంత్రులపై నృత్యం చేస్తున్నది. ఆమె మెల్లిగా అతని ఎదురుగా కూర్చున్నది. ఒక నిమిషంవరకు అతడామెరాక గమనించనేలేదు. తరవాత ఆశ్చర్యంగా ఆమెవైపు చూస్తూ—

"ఇంతలోనే పునర్దర్శనం లభిస్తుందని అనుకోలేదు! ఏదో విశేషం ఉండాలి! ఏమిటి కథ!" అన్నాడు.

ఆమె అతని మాటల కెంతో [illegible]

"అవును! మీ [illegible] కొంచెం [illegible] కొనకిన వచ్చింది!" అన్నది.

"[illegible]" అని [illegible]

"అవును! మీ మాట సహాయం!"

అతడు ప్రశ్నార్థకంగా కనుబొమలు ముడిచాడు.

"నామాట చెల్లిస్తానని ముందుగా మాట ఇస్తే చెబుతాను!"

అని వకుళమాలిక ఒక చిరునవ్వు నవ్వింది. జయాపీడుని కామె లోలోపలి అభిప్రాయమేమో బోధపడలేదు:

"నీవు ఆజ్ఞాపించడము, నేను తిరస్కరించడమూనా? ఎంత మాట!"

ఈ మాటతో వకుళమాలిక వల్లమాలిన సిగ్గుతో కుంగిపోయింది:

"అయితే అడగనా?"

"ఎందు కంతటి సందేహం! అదేదో అడగకూడదా?"

"మరి మాట తిరిగిపోకూడదు!"

"ముమ్మాటికీ మాట తప్పను! సరేనా!"

వకుళమాలిక రెప్పవాల్చకుండా విస్ఫారితనేత్రాలతో అతనికేసి చూసి, చిరునవ్వు నవ్వుతూ ఇలాగన్నది:

"మీరు కళ్యాణశీలిని పట్టమహిషిగా అంగీకరించాలి! ఇదే నాకోరిక!"

"ఆఁ" అని జయాపీడు డొక్కసారిగా స్తంభించిపోయాడు! ఆమె ఈవిధంగా కోరగలదని అతడు స్వప్నంలో కూడా భావించ [illegible] కూడా ఆమె

ఆవిధంగా కోరడానికి కారణమేమో బోధపడలేదు. కొంత సేపటివరకు జయాపీడునికి నోట మాట రాలేదు. చిట్టచివరికి బొమముడి విరిచి—

"నీ విలాగ కోరడానికి కారణం?" అని ప్రశ్నించాడు.

"అది పిమ్మట మనవి చేసుకుంటాను కాని ముందు నా కోరిక మన్నించినట్టు వాగ్దానం చెయ్యాలి!"

"కారణ మేమో తెలిస్తేనే గాని ముందు వాగ్దానం చెయ్యలేను!"

"మొదట చేశారు గదా! అంతలోనే మరుపా?"

"మరిచిపోలేదు. కాని నేనన్నమాట చెల్లించదలుచుకోలేదు."

"ఇది మీకు ధర్మమేనా?"

"ధర్మమే అనిపించింది!"

అతడు అంతటి దృఢనిశ్చయంతో సమాధానం చెప్పడం ఆమె కెంతో ఆశ్చర్యమే కలిగించింది. అయితే ఆ దృఢనిశ్చయాని కామె లోలోపల ఎంతైనా సంతోషించింది. అయినా అది పైకి వెల్లడికానీయక నెమ్మదిగా ఇలా అన్నది.

"కానీ నేను చెప్పే కారణాలు కొంచెం సావధానంగా చిత్తగించాలి!"

"సరే కానీ! అలాగే!" అన్నాడు జయాపీడుడు.

వకుళమాలిక కొంచెం సందేహిస్తూ—

"నేను పణ్యస్త్రీని." అన్నది.

"జయాపీడ చక్రవర్తి ఉవ్వెత్తుగా ఒక నవ్వునవ్వి—

"నిజమే! కాని నీవేమో పణ్యస్త్రీ కోరతలో ప్రసంగించడమే లేదు! కాని జయంతదేవులు కళ్యాణదేవి కేవలం గణిక అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు! ఏమి చిత్రం!" అన్నాడు. వకుళమాలిక ఈ మాటతో నిర్ఘాంతపోలేదు! ఒక్క చిరునవ్వునవ్వి ముక్కుమీద వేలుంచి—

"ఎంతమాట? ధర్మ సంరక్షకులని బిరుదు వహించిన మీ రిలాగనడం ఏమి భావ్యంగా లేదు! మీ రెంత కాదన్నా కులవృత్తిని బట్టి నేను కేవలం గణిక నేగదా!"

అని తలవంచుకొన్నది.

జయాపీడ చక్రవర్తి ఏమీ చలించలేదు:


"అవును! నాకు తెలియక పోలేదు! అయితే?"

"పట్టమహిషీపదవికి తగను!"

"ఆ అర్హతానర్హతలు నిర్ణయించవలసినదానవు నీవు కావు!" అన్నాడు జయాపీడుడు ముక్తసరిగా.

అయినా వకుళమాలిక తనపట్టు వదలలేదు:

"అదీగాక మీ పట్టుదలలతో కాశ్మీర గౌడరాజ్యాల మధ్య యుద్ధంకూడా వచ్చే



బుద్ధ జయంతికి వేసే ప్రత్యేక తపాలా బిళ్లలకోసం స్వీకరించిన మరొక చిత్రం - శ్రీ సి. ఆర్. ప్రకాశ్ (ఢిల్లీ) రచించినది. ఈ చిత్రానికి "వన్నెలలో బోధి వృక్షం" అనేది ముకుటం.

ట్టుంది! నా జన్మదేశానికి చిచ్చుపెట్టానచే ఈ అపవాదం నాకేల?"

దీనితో జయాపీడు డొక్క నిమిషం ఊరుకుని గంభీరంగా ఇలాగన్నాడు:

"నీకోరికకు హేతువేమో నా కిప్పుడు ఆమూలాగ్రంగా తెలిసిపోయిందిలే! పాండ్రవర్ధన మహామాత్యులే నీచేత ఈ మాట లనిపిస్తున్నారు! సందేహమేమీ లేదు! ఏది ఏమైనా సరే! ఇక నీవే నా పట్టపు రాణివి!"

జయాపీడు డీవిధంగా ఒక్కక్షణంలో జరిగినదంతా ఊహించి వేసినందు కామె లోలోపల చాలా ఆశ్చర్యపడింది. అయినా ఏమీ చలించకుండా ఒక్క చిరునవ్వునవ్వి నెమ్మదిగా ఇలాగన్నది.

"మీ ప్రాథవాదకారాలతో ఎదిరించి వివాహమాడడానికి నేనేమి కల్యాణదేవిని గాను! ఇంతవరకు నేను సర్వ స్వతంత్రురాలనే! ఇకముందు అంతే! నా సమ్మతి లేనిదే నన్నెలా పట్టపురాణిని చేస్తారో నేను చూస్తానుగా!"

అని ఆమె బింకంగా మూతి బిగించింది. ఈ సమాధానంతో జయాపీడునికి నోటమాట పెగలలేదు! ఆమె ఈ విధంగా తనపై అధికారం చెలాయించ గలదనికూడా అత డనుకోలేదు. అందుచేత బాగా తగ్గిపోయి సానునయంగా ఇలాగన్నాడు:

"సరే! గాని వకుళా! ఎందుకు నీకింత పట్టుదల! నీచేత నేనేమి చేదుమింగించడం లేదుగదా!"

ఆ మాటపై వకుళమాలిక ఒక్క చిరునవ్వు నవ్వింది:

"నిజమే! మీ ఔదార్యం ఎంతటి అగాధమైనదో తెలియనంతటి మూర్ఖురాలను కాను! కాని చిన్నప్పటినుంచీ నాకు భోగభాగ్యాలకేమీ కొదవలేదు!

(55-వ పేజీ చూడండి)

వైతరణిలో బంగారు ఇసుక

మర్త్యుల్లో మార్కండేయస్వామి ఎలా లొంగలేదో యముడికి, అలా లొంగలేదు ఆ దంపతులు ఇద్దరూ పురపాలక సంఘంవారికి. ఎక్కడెక్కడున్న పూరి గుడిసెల్ని, పుట్ట గొడుగుల్ని ఎక్కడీసి కనుక్కుని ఊడలాగి, పట్నంలో మఱి ఛండాలము లేకుండా చేయాలని ఆ పురపాలక సంఘం వారి సంకల్పము. అయితే ప్రజలలో వ్యుత్పన్నమయ్యే దురాక్రమణ బుద్ధి నెవరు మాన్పగలరు? అంతే కాకుండా ఇంద్ర ధనుస్సును మోసేవి "శిలీంధ్రామ్" పుట్టగొడుగులేనట! మఱి చెప్పన్న ఓర్పు పూరి గుడిసెల్లో పుట్టి పెరిగే వాళ్ళదని ప్రతీతి! అలాంటప్పుడు ఆ రెంటినీ ఊడ పీకడం బ్రహ్మతరంగాదు. ఒకటి పీకనుబట్టి ఎదిగినా, మఱొకటి పెంట కుప్పను బలిసినా! ఇక్కడ గుడిసె పీకేస్తే మఱొకచోట కనిపెంచుతారు ఆ దంపతులు ఖాళీగావున్న చోటు ఆక్రమించుకుంటూ!

కాస్తంత ఊపిరి చలగా పీల్చుకోవచ్చు అని పౌరులు తలపోసేసరికి అక్కడే ప్రత్యక్షము వాళ్లిద్దరూ ఒకచేట, ఒక కుండ పెంకు, ఒక పాత చీపురూ పుచ్చుకు. "ఎక్కణ్నుంచి అర్రా! వచ్చేరు" అనే సరికి "ఆ మురుగుకాల్వ ఊడ్చి తెచ్చాము ఈ మురుగుకాల్వ ఊడ్చి తెచ్చాము బాడిబంద, దాన్ని అంతా కడిగి బంగారం చేయాతియింకామేం! ఇది మా వృత్తి!" అని చతికిలబడేవారు ఏకాడో ఓకాడ! వాళ్లను మఱి కదపడానికి పెనుభూతమైనా రావాలి పెద్దపులైనా రావాలి. మనిషి అయినవాడు కదపలేడు.

అయినా లోకంలో వృత్తులెన్నైనా వుంటాయి కాని అలాంటి వృత్తి నేను చూడలేదు. ఇంతకూ వాళ్ళకో తార్కికం లేకపోలేదు. "చేట పిల్లకితలా వుండగా పుడతాము. చేట మన బూడిదమీద బోర్లింపబడుతుంది. ఈ జగత్తు అంతా చేటలోనే వుంది. పోది చెప్పినా చేటతోనే, చెరిగినా చేటతోనే, శివా అంటూ ఎగరపోసినా చేటతోనే—అటువంటి చేటను మేం నమ్మాం!" అని వాళ్ల వాదం. నిజమే కోటి విద్యలు కూటి కొఱకే! చేట కొకళ్లు నమ్మేరు, కోట కొకళ్లు నమ్మేరు.

"హరిహరీ నారాయణాది నారాయణా!
కరుణించి మమ్మేలు కమలలోచనుడా!"

వెన్నెల పుచ్చ పువ్వుల్లా కాస్తూ వుంది కార్తీకమాస శుక్లపక్ష త్రయోదశో చతుర్దశో అనుకుంటాను ఆ రాత్రి ఒక అవిశె చెట్టు అరు బయట రోడ్డు కవల ఊళ్ళొయిళ్లమధ్య ఖాళీలో ఎత్తెత్తుగా తెల్ల తెల్లగా కొన్ని రేకు లిల్లాగ కొన్ని రేకు లల్లాగ వెడుతూంటే గాలి ఊగుతూ, పువ్వు లెట్టుకు జొట్టు సరుదుకుంటూ వున్న మత్తకాశినిలా వుంది దానికి అనతి దూరంలో మఱ్ఱిచెట్టు ఒకటి ఎఱ్ఱటి పళ్లు కలిగి ముదురాకు పచ్చితో మిలమిలమంటూ వుంది. ప్రకృతి ఎంతో రంజకంగా వుంది పక్షికి కూడా ఆ గడియప్పుడు నిద్రే! నిద్ర తప్పిస్తే కల!

నేను పైన వివరించానే, ఆ దంపతులు నివసించడానికి ఇల్లు లేదు వాకిలి లేదు ఊరికే బాటసారుల్లా ఈ పై నుంచి నిరంతరము నడుస్తూ ఉండవలసిందే. ఎక్కడైనా ఆగితే దురాక్రమణ చేస్తున్నారని అక్కడే వారిని పట్టుకునేరు.

అక్కడకు చాలాసేపు వాళ్లు అలాగే తిరిగేరు చేత చేట చీపురు పుచ్చుకొని పెళ్ళాం, పగిలిపోయిన కుండపెంకు పుచ్చుకొని మగడు ఆ మురుగు కాలవమీద వంగొంటూ, ఈ మురుగు కాలవవద్ద వంగొంటూ, ఏదో కడిగినట్టు, వడపోసినట్టు పాటుపడ్డారు. కాని ఎంతసేపు అని పాటు పడగలరు? వాళ్ళు ఒక ఘడియ పాటైనా నిదురించాలి ఎక్కడో ఒక చోట. "ఇల్లిల్లే! పాలమిల్లే!" అరవం ఇంత అప్రయత్నంగా వ్రాశాను అంటే ఆ దంపతులు అరవలని వేరే చెప్పక్కరలేదు అంతేకాకుండా భారత్ యూనియన్ అంతా ఒకే జాతి! అందువల్ల వాళ్ళను వెంటాడించ బుద్ధి అయింది నాకు. కాని నేను మాత్రం ఎంత దూరమని వాళ్ళను వెంటాడించగలను? నేను వాళ్లను అలంత దూరంలో వదిలాను. వాళ్లు మరి ఏమైనారో నాకు కనబడలే!

కవికొండల వేంకటరావు

అయితే కథకు కనబడతారు. కథకు కన్నూ వస్తాయి! కాళ్లూ వస్తాయి! ఒక్కొక్కప్పుడు!


వాళ్ళున్నారే ఆ దంపతులిద్దరూ అలా అలా పూర్ణోక్తపు మహా వెన్నెల్లో ఆ అవిసెచెట్టును చేరుకోగలిగారు ఆ రాత్రి. అవిసెచెట్టు మాను అట్టే స్థలము ఆక్రమించదు దానిదో దురాక్రమణ కాబోదు. దాని క్రింద పడేశారు రాత్రి రెండో ఝాం వేళ తమ కుండ పెంకు, పాత చీపురు, చేట. అంతేగా వారి సామాను? వాళ్లిదరిసు తల వెంద్రుకలు తప్పిస్తే విశేషించి చెప్పదగ్గదేమీ లేదు! తల వెంద్రుకలు దరిసు అనుకుంటే, కావు సహజమైనవే అని లోకం అంగీకరిస్తే తగువే లేదు వాళ్లకు దాచుకో దగ్గదేమీ లేదనే చెప్పవచ్చు.

మగవాడొక గోచి పెట్టుకొన్నాడు. ఆడది ఒక ఏబ్రాసి ఏకండీచీర కప్పుకుంది. ఇద్దఱూ కళ్ళు మూతలడిపోతున్నాయేమో పడుకున్న పాళంగా నిద్దరట్టిపోయింది. ఎక్కడ ఏ సామాను పడేసికున్నది వాళ్లి మతి కానలే! ఒకసారి తలగడకోసం వెముకినట్టు కాబోలు వాడు చెయ్యి విసిరేడు. అది వత్తిగిలి గుత్తి అందించింది.

అదే సమయమప్పుడు ఆ అవిశెచెట్టుమీద రెండు రామచిలకలు వాలాయి. తెల తెల వాఱిపోతూ వుంది. ఎఱ్ఱ ఎఱ్ఱ అరుణోదయం అవుతూవుంది తూర్పెంపు తిన్నగా చిలకలకు కనిపించాయి పాలవల్లిని వేలాడుతూ వున్నట్టు అవిసెపూగుతులు చెట్టున వేలాడుతూ. ఆ చిలకలు రెండూ ఆ పువ్వుల్ని క్రిందకు రాలేటట్టు ముక్కుల్తో పొడిచాయి వృంతాల్లోకి పువ్వులు రాలి క్రిందకు పడియూ నిద్రపోతూన్న ఇద్దర్నీ, ఈ మనుష్య దంపతుల్ని కప్పివేసినాయి. పై చిలుకలు కూడా చూడలేక పోయినాయి అనుకొంటాను ఆ నగ్న స్వరూపాన్ని.

మనుష్య రూపాలు నఖశిఖపర్యంతము పూర్తిగా కప్పడిపోయినాక, పడ్డ పువ్వులు ఆ మనుష్యులయొక్క చేటను, చీపురును, ముంతిగను కప్పి పారేశాయి! ఇంతలో దండిగ తెల్లారింది పదిమంది పోగు బడ్డారు. 'పాపం! వీళ్ళు ఉండడానికి వీడు లేక చల్లో పడి చనిపోయినారులాగుంది!" అని ఒకళ్లు అంటే, ఒకళ్లు "ఇన్నాళ్ళూ అక్రమంగా

(55-వ పేజీ చూడండి)


నైలాను
ఫేషన్ అను జ్వాలను రగులబెట్టునట్టి...
అసమానమైన, సొగసైన 'పారగాన్' నైలాన్ చీరలు. నేత మరియు ఫినిష్‌యందు శ్రేష్ఠమైన పరదేశపు గుడ్డలకు సరితూగును. 'పారగాన్' నైలాన్ చీరల దీర్ఘ కాలము మన్నునట్టి గుణము మీకు ఆశ్చర్య గొలుపును అవి మలినముగా ప్రతి దినము ఉతుకవచ్చు మరియు అవి ముడుచుకొనిపోవు.
నైలాన్ చీరలు
కొనునపుడు
పారగాన్‌నే
కోరండి.
6 గజ॥ తయారు చీరలు.
పెట్టెలందు దొరకును.
మీ ఇష్టమైన స్టోరులో అడగండి.
పారగాన్ టెక్స్టైల్ మిల్స్
వర్లి, బొంబాయి 13
PTM
సిల్కు రేయాన్ క్రేప్, అర్గండి మరియు ప్రింటెడ్
వస్త్రములు కూడా తయారుచేయుదురు.



ఇందిరమ్మ చాటిపోయి దాదాపు అయిదారేళ్లయింది. మాఘమాసం చివరి రోజులు. చలి ఉధృతం ఇంకా తగ్గలేదు. అటూ ఇటూ పొదలు-మయంగా ఉన్న ఇరుకు దారి వెంట నిశ్చిందిపురం గ్రామస్థులు కొందరు - సరస్వతీపూజనాటి సందర్భో-ఊరిబయట మైదానంలో జరిగే 'నీలకంఠ పాఖీ' ఉత్సవం చూడటానికని గుంపుగా బయలుదేరి వెడుతున్నారు.

"ఏమయ్యా హరీ! భూవన్ గోయాల్ కోసమని అరటితోటకౌలు - ఈ యేటికి కూడా మళ్లీ మీరే ఉంచుకున్నారటగా!" అని అడిగారు ఆగుంపులోంచి ఒకరు.

ఈ ప్రశ్న ఎవర్ని ఉద్దేశించి వచ్చిందో- అతణ్ణిచూస్తే ఆ పదేళ్ల నాటి హరిహరరాయే ఇతడని అనిపించదు. శిస్తువసూళ్లకని ఊరూరూ తిరుగుతూ, తండ్రితరంనాటి శిష్యు లెక్కడెక్కడున్నదీ వెతుక్కుంటూ పోయి, గురువుగా చలాయిస్తూ, సంతలోనూ-పుంతలోనూ తారసపడే ఇళ్ల బేరగాళ్లతో పళ్ల బేరగాళ్లతో ఇచ్చకపు బేరాలాడుతూ,-పిల్లలతండ్రి అయి, నడివయస్సులో ఉన్న, ఈ హరిహరునికీ-వెనుక చిత్తంవచ్చినట్లు విచ్చలవిడిగా దారం తెగిన గాలిపటంలా తిరగటాని కలవాటుపడిన ఆ హరి హరునికీ ఎక్కడా సామ్యమే లేదు. రానురాను హరిహరునికి వయసు మళ్లుతోంది. అప్పుడు-'చునార్' దుర్గం గోడల మీదికెక్కి, దూరంగా కొండల వెనుక క్రుంకి పోతున్న సూర్యునికేసి చూస్తూకూచోటం, కేదార్ నాథ్ కి వెళ్లే త్రోవలో అడవిలో నే ఆ రాత్రింతా ఆగిపోవటం, కాసిం సులేమాన్ మసీదు తోటలో జొరబడి కమలాఫలాలు కోసుకొచ్చుకుని తినటం, కరిగి పారుతున్న వెండికొండలా తళతళలాడుతూ, చల్లగా, స్వచ్ఛంగా ఉండే ఆ అలకనందా నదీ, దశాశ్వమేధఘట్టంలో నీటి అంచున నిర్మితమై ఉన్న ఆ రాణీలభవనాలు-అవన్నీ ఏనాడో కలల్లో చూసినవాటిలా కళ్లకు కడుతూ ఉంటాయి ఇప్పుడతడికి.

హరిహరుడా అడిగినదానికి ఏదో చెప్ప బోయి వెనక్కి తిరిగి - 'అరె! వీడెటుపోయాడు మళ్ళీ ఇంతలో!' అనుకుంటూ "ఒరే! ఇలా రారా, రా ఇలా!" అని పిలిచాడు కొడుకుని.

దారిమలుపు చాటునుంచి-కోలమొహం తెల్లగా మొగలిపొట్టలా ముద్దొచ్చేట్లున్న ఆరేడేళ్ల కుర్రవాడొకడు పరుగెత్తుకుంటూ వచ్చి జట్టులో కలిశాడు.


"ఇంతల్లోనే మళ్లీ వెనకపడ్డావా? నడు, ముందు నడు గబగబా" అన్నాడు హరిహరుడు.

"ఆ చెట్లమువ్వకి పరుగెత్తిందే-అది ఏమిటి

జరిగినకథ:—

నిశ్చిందిపురం బెంగాల్ లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. ఇందిరమ్మ అతనికి వరసకి అక్కగారు. ఆ వృద్ధురాలు అతని ఇంట్లోనే బ్రతుకు వెళ్లబుచ్చుతోంది. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంత కాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరం పెట్టాడు. దుర్గ పుట్టిన చాల ఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇందిరమ్మకి ఈ ఇద్దరు పిల్లలంటే తగని ఆపేక్ష - కాని సర్వజయకి ఇందిరమ్మ అంటే వల్లమాలిన చీకాకు. నిత్యమూ ఆమెతో ఘర్షణే. ఇందిరమ్మ కోపంవచ్చి ఇంట్లోంచి వెళ్లిపోయి ఎక్కడో ఓ రెణ్ణాల్లుండి తిరిగి ఇక్కడికే రావడం పరిపాటి. బ్రతికినన్నాళ్లూ ఆమె సుఖపడినదీ లేదు, ఇతరులను సుఖపెట్టినదీ లేదు. ఎక్కడా ఆదరించే వారులేక, తలదాచుకోడానికి ఆశ్రయంలేక, తిండికి, గుడ్డకూ మొహంవాచి ఆఖరికి దిక్కులేని చావుచచ్చింది. శిథిలమైపోతున్న సనాతన సంఘ వ్యవస్థకు ఆమె విషాద జీవితం ఒక చిహ్నంలాంటిది.

అనువాదం:
మద్దిపట్ల సూరి



"పథేర్ పాంచాలీ" చిత్రంలో అపూ.

నాన్నా? పెద్ద పెద్ద చెవులున్నాయి-" అని అడిగాడు పిల్లవాడు.

హరిహరుడు-పిల్లవాడడిగినదాన్ని పట్టించుకోకుండా - నవీన్‌పాలిత్‌ని 'చేపలవేట' లోని మెళుకువలడిగి తెలుసుకోవటంలో మునిగి ఉన్నాడు.

పిల్లవాడు మళ్లీ ఎంతో ఆత్రంగా "ఆ చెట్లలోకి పరుగెత్తిందది ఏమిటి నాన్నా? పెద్దపెద్ద చెవులున్నాయి-" అని అడిగాడు. "ఏమోరా, నువ్వడిగేవాటి కన్నిటికీ నేను చెప్పలేను సమాధానాలు! కాలుకదిపిన దగ్గిర్నుంచీ అదేమిటి, ఇదేమిటి?అంటూ ఒకటే సొద మొదలెట్టావ్! ఆ అడవిలోకి పరుగెత్తిందేదో నేనేమయినా చూశానా పెట్టానా? పద...నడవ్వేం ముందుకి?" అన్నాడు హరిహరుడు. తండ్రి అదిలింపుతో ముందుకు సాగాడు కుర్రవాడు.

"నువ్వొక పనిచెయ్యి హరీ: మంచి చేపల్ని పట్టాలని ఉంటే ఓరోజు సెలవైనా పెద్ద చెరువుకి వెడదాం పద. మణుగు మణుగున్నర బరువుగల చేపలు దొరుకుతాయట అక్కడ. వీసెకి తక్కువ తూగే చేపే లేదట అసలు..." అంటూ ప్రారంభించాడు నవీన్ పాలిత్.

అందరూ ముందుకు తోసుకువచ్చి, నవీన్ పాలిత్ చెప్పేమాటల్ని నోరు తెరుచుకు వినటం మొదలెట్టారు.

మంచి రసకందాయంలో ఉంది అతడి ధోరణి. హరిహరుని కొడుకు హఠాత్తుగా ఎంతో ఉత్సాహంతో ప్రక్కనున్న ముళ్లపొదకేసి వేలితో చూపుతూ- "అదుగో, పోతోంది నాన్నా:" చూడు నాన్నా! అదుగో పరుగెత్తుతోంది. పెద్ద పెద్ద చెవులూ అదీ -" అని అరుస్తూ అటువైపుకి పరుగెత్తసాగాడు.

అతడి తండ్రి వెనుకనుంచి - "వెళ్ళకురా వెళ్లకు, ముళ్లు, ముళ్లు -" అని కేకేస్తూ గబగబా వచ్చి, చటుక్కున కుర్రవాడి చెయ్యి పట్టుకుని—

"అబ్బ! ఏం విసిగించేస్తున్నావురా! ఎన్ని సార్లు వద్దంటున్నా నువ్వు నామాటేం వినిపించుకోకుండా ఉన్నావు! ఇందుకనే అసలు నిన్ను నేను తీసుకురానన్నది -" అన్నాడు.

ఉత్సాహోసక్తులు ఉట్టిపడుతున్న ముఖం పైకెత్తి, తండ్రి ముఖంకేసి చూస్తూ "ఏమిటి నాన్నా అది?" అని అడిగాడు కుర్రవాడు.

"అదేమిటో చూశానురా నేను? ఏ పందో ఏదో అయిఉంటుంది...ఊఁ ముందుకి పద. సరీగా దారిమధ్యనుంచి నడు-" అన్నాడు హరిహరుడు.

"పంది కాదు నాన్నా! చిన్నదది-" అంటూ కుర్రవాడు వంగి అది ఎంత ఎత్తు ఉన్నదీ చేత్తో చూపించసాగాడు.

"పదపద. ఆఁ, ఆఁ, తెలిసిందిలే. ఇంక చూపించనక్కర్లా నడు ఇంక!"

"ఓ! అదా! అది కుందేలు - చెవుల పిల్లి బాబూ! ఇక్కడ దుబ్బుల్లో, పొదల్లో చెవులపిల్లులుంటాయిలే - అదీ," అన్నాడు నవీన్‌పాలిత్. కుర్రవాడు తన మొదటి వాచకం పుస్తకంలో కుందేలుబొమ్మను చూసి ఉన్నాడు. కాని అది సజీవరూపంలో ఇలా దుముకుతూ పారిపోతుందని కాని, అసలు కళ్లెదుట కనిపిస్తుందని కాని వాడి ఊహకి తోచలేదెప్పుడూ.

కుందేలు! కదిలే కుందేలు! కళ్లముందు నుంచి గంతులేస్తూపారిపోవటం. కాగితంలో కనిపించే బొమ్మకాదు, గాజుబొమ్మకూడా కాదు. చెవులు నిక్కపొడుచుకుని ఉన్న నిజమైన కుందేలు! ఈ చిల్లకంపల, రెల్లు దుబ్బుల మధ్య ఉండటం! ఈ మామూలు మట్టినేలని ఇదెలా సంభవమైందో

★ పథేర్ పాంచాలి ★

ఆ [illegible] ఆలోచించినా అంతు చిక్కలేదు.

ఆ ఇరుకైన దారి దాటి, అందరూ మైదానం మీదికి వచ్చారు. నది కరకట్ట ప్రక్కన ఉమ్మెత్తచెట్లదాటునుంచి ఓ ఇటుకకట్టడం సమాధిలాగా కన్పిస్తోంది-అది పూర్వపు నీలి యంత్రాగారంతోలాటు పడిపోయిన రాతి పొగగొట్టం. ఆ కాలంలో-నీలిమందు వర్తకపుహయాంరోజుల్లో-'బెంగాల్ ఇండిగో కన్సర్న్'కి ఈ నిశ్చిందిపురంలో కేంద్ర యంత్రాగారం ఉండేది. ఈ ప్రాంతంలోని పధ్నాలుగు చిన్న నీలిమందు యంత్రాగారాలమీద ఈ నిశ్చిందిపురం యంత్రాగారం జనరల్ మేనేజరు 'జాన్ లెర్మర్' ఏకచ్ఛత్రాధిపత్యం వెలిగించేవాడు. ఇప్పుడా యంత్రాగారపు నీటితొట్టి, పొగగొట్టం దొర కాపురమున్న బంగళా, ఆ ఆఫీసు-అన్నీ పాడుపడిపోయి, ఇటుక గుట్టల్లా తయారయినాయి. చండ ప్రచండుడైన జాన్ లెర్మర్ పేరు చెపితే ఒకప్పుడు ఈ ప్రాంతంలో పులులు-మేకలు ఒకరేవున నీళ్ళు తాగేవి! ఇప్పుడు మరీ ముసలివాళ్ళకి ఏ ఇద్దరి ముగ్గురికో తప్ప ఆ దొరగారిపేరే తెలియదెవరికీ...

ఆ మైదానమంతా కొండగోగు, రెల్లు, రేగుపొదలమయం. ఆ పొదలనిండా తీగ బచ్చలి అలుముకుపోయి ఉంది. చల్లగా, హాయిగా ఉన్న దక్కడ. దిరిసెనచెట్ల పూలు చక్కగా ఎండపొడవైపుకి విచ్చుకున్నాయి. సందెవేళ ఆ వనప్రదేశపు శ్యామలత్వము, పక్షులకిలకిలారావాలు - ప్రకృతి తన కలిమినంతనీ గుప్పిలివదలి, మహారాజ్ఞిలా చుట్టూ వెదజల్లుతోంది. సూర్యాస్తమయపు ఇంద్రజాలంలో ఆ మైదానం, నది, వనమూ మనసును వడివేసి లాగుతున్నట్టున్నాయి.

ఆ మెట్టమీద తిరుగుతూ తిరుగుతూ-ఆ ఉత్తరపువైపు నేలని కందదుంపలు పండిస్తే ఎంతలాభం తీయవచ్చునో అంచనాలు వేసి చెప్పటం మొదలెట్టాడు నవీన్‌పాలిత్. "ఈ ఫ్యాక్టరీ, బంగళా యిటుకంతా అమ్మేస్తారట! నవాబ్‌గంజ్‌లోని మతిదా పేరమాడుతున్నాడటగా!" అన్నారొకరు. మతిదా పేరు రాగానే అతడు కటికదరిద్రపు స్థితినుంచి ఇంతభాగ్యవంతు డెలాఅయాడో ఆ గాథంతా వచ్చిపడింది. అక్కడినుంచి క్రమంగా ఇహ ఇప్పు డీధరలు ఎలా మండిపోతున్నదీ, పట్నంలో మార్వాడీ టోకు అంగడి ఎలా తగలబడిపోయిందీ ఊళ్లో దీనూగంగూలీ కూతురిపెళ్ళి ఏవారం అయిందీ - మొదలైన ముఖ్యవిషయాలన్నీ వారి ముచ్చటల్లోకి వచ్చాయి.

"సెకురికంఠం పిట్ట ఏది నాన్నా?" అని అడిగాడు హరిహరుని కొడుకు.

"పొద్దుపోగాని ఉండు, ఇప్పుడే వచ్చి వాలుతుంది ఆ ఉమ్మెత్తచెట్టుమీద..." పిల్లవాడు తలయెత్తి ఎదుట ఉన్న ఉమ్మెత్తచెట్ల కొమ్మలన్నీ చూశాడు. ఎక్కడా అయితే లేదా పిట్ట. చుట్టూ చిన్న చిన్న రేగుచెట్లనిండా చేతి కందేట్టున్నాయి పళ్లు. వాడు వాటికేసి నోరు తెరచుకుని చూడసాగాడు రెండు మూడు సార్లు ఆ పళ్ళను కోసుకోబోయి, తండ్రి చీవాట్లుతో, వెనక్కి తగ్గాడు. ఇంత చిన్నచెట్లు ఎట్లా కాశాయబ్బా! తమవీధిలో ఉన్న రేగుచెట్టు చాలా ఎత్తు అవటం మూలంగా కోసుకుందా మనిపించినా కుదరలే దెప్పుడూ. రెండు గుప్పిళ్ళనిండా పళ్లు అందుకున్నా - తింటే జబ్బుచేసే పళ్లు కనుక - అన్నీ చాటుగా తినటం కూడా సాధ్యమయే పని కాదని వాడికి బాగా తెలుసు. ఈ సంగతి తెలిసి తల్లి వచ్చి ఇంటికి లాక్కెళ్ళి- "మళ్ళీ ఏం వచ్చిపడుతుందో ఏం ఖర్మమో! ఇంత చెప్పిన మాట వినని వాడి వయినా వేంరా! నిన్నకాక మొన్న అంత జ్వరం వచ్చి నయమైందో లేదో, అప్పుడే మళ్లీ ఆ రేగుచెట్ల కిందికి పోయి తచ్చాడుతున్నావా! ఒక్క అడుగు అలా వేసి మళ్ళీ వెనక్కి ఇట్టే వచ్చి చూస్తే ఇంట్లో లేవు. ఏదీ ఎన్నిపళ్లు తిన్నావ్? నోరు చూడనియ్" అంటుంది.

"ఒక్కటి కూడా తినలేదమ్మా! కింద ఒక్క పండైనా రాలితేగా! కోసుకుందా మనుకుంటే మాత్రం నా కెక్కడందుతాయి అవి?" అంటాడు తాను.

తర్వాత తన లక్కజట్టిలాంటి నోరు తెరిచి చూపుతాడు తల్లికి. తల్లి నోరంతా పరిశీలించి చూసి, నోరు వెన్నపూసలా కమ్మని వాసన వెయ్యటంతో, ముఖాన్ని మరింత దగ్గరగా తీసుకుని, గట్టిగా ముద్దెట్టుకుని, "ఎప్పుడూ తినకేం నాన్నా! నీ ఒళ్లు కాస్త నయంకానియ్. రేగుపళ్లు అంచక్కగా ఊరగాయవేసి అట్టే పెడతాను నీకోసం - ఎండాకాలం వచ్చాక వేసుకు తిందువుగాని. చాటుచాటుగా ఎప్పుడూ తినకేం! ఏం నాన్నా!" అంటుంది.

"బంగళా బంగళా అని కలవరించావుగా! అదిగో మాడు బుల్లిదొర బంగళా....కన్పిస్తోందా?" అన్నాడు హరిహరుడు.

నదిఒడ్డున చాలాభాగం అంతా అప్పటి ఆదొరల యంత్రాగారాలకు, బంగళాలకు చెందినస్థలమే. అది ఇప్పుడేదో ఆదియుగం నాటి క్రూరరాక్షసుని కంకాళాన్ని జ్ఞప్తికి తెస్తున్నట్టుంది...

ఆ బంగళా అవరణకు కొంచెందూరంలో

జాన్ లెర్మర్ కుమారుని సమాధిమీద ఈ మెత్తిలూ, జిల్లేళ్ళూ మొలిచి అది పాడుపడి పోయింది. ఏమయినా బెంగాల్ ఇండిగో కన్‌సర్న్‌కి చెందిన ఇది ఒక శేతిప్ప, చెక్కు చెదరకుండావున్న చిహ్నం ఇంకొకటిలేదు. దగ్గిరకు వెడితే, నున్నటి నల్లరాతిమీద చెక్కిన—

Here lies Edwin Lermor
The only son of John & Mr. Lermor,
Born May 13, 1858 died
April 27, 1860.

అన్న అక్షరాలు చదవొచ్చు.

అక్కడ తలిమ్మా చెట్లమధ్యనున్న అడవి గోగుచెట్లు తన నీడతో ఆసమాధిని ఆచ్ఛాదించడమేకాక, రాత్రింబగళ్ళూ గట్టిగా గాలి వీచినప్పుడల్లా తన పచ్చటిపూలను-కాలగర్భంలో కలిసిపోయిన విదేశీ శిశువు సమాధిమీద పుష్కలంగా రాలుస్తూ ఉంటుంది. అందరూ మరిచిపోయినా, అక్కడి చెట్లు ఆపసికందును ఇప్పటికీ మరిచిపోలేదు.

పిల్లవాడు ఆ పరిసరాలను అశేపనిగా చూడసాగాడు. తన ఆరేళ్ల జీవితంలో వాడిల్లువిడిచి ఇంతదూరం రావటం ఇదే మొదలు. ఇన్నాళ్ళూ తమ ఇంటిదగ్గరలో ఉన్న పాతొన్లయిల్లు, తమ ఇరుగు పొరుగుయిళ్లు, మహావడితే రాణాదీవాళ్లయిల్లు- ఇవే వాడిజగత్తుకు పరిధులు. ఎప్పుడయినా దగ్గిరగా ఏటిరేవుకి తల్లితోకూడా స్నానానికి వచ్చినప్పుడుమాత్రం ఒడ్డున నుంచుని, అక్కడికి కన్పించీకన్పించకుండా ఉండే ఫ్యాక్టరీ పొగగొట్టంకేసి చూసి చూసి, "అమ్మా అదేనా ఫ్యాక్టరీ?" అని వ్రేలితో చూపుతూ అడిగేవాడు. తనతండ్రి, తల్లి, అక్క, ఇరుగుపొరుగువాళ్లు ఎంతోమంది ఈ మైదానానికి, ఈ యంత్రాగారానికి సంబంధించిన కథలు చెప్పగా విన్నాడు చాలాసార్లు. కాని ఇక్కడికి రావటం మాత్రం ఇదే మొదటిసారి. తల్లి చెప్పే కథల్లోని రాజ్యాలు ఈ మైదానానికి కింకొ అవతల ఉండి ఉంటాయి! దేశాటనకై బయలుదేరిన రాజకుమారుడు గండభేరుండపక్షులు నివసించే చెట్టుక్రింద-ప్రక్కన ఖడ్గాన్ని పెట్టుకుని పడుకుని రాత్రంతా గడిపింది అక్కడేనేమో! ఇంక అక్కడ మనుషులెవరూ ఉండరు. ప్రపంచపు పరిహద్దు అదే అయి ఉంటుంది! చిత్రవిచిత్రలోకాలు అక్కడి నుంచే మొదలై ఉంటాయి!

ఇంటికి తిరిగి వస్తూ వస్తూ, దారిప్రక్కన కిందుగా ఉన్న పొదలోంచి కంటికి నదరుగా కన్పిస్తున్న కాయలగుత్తుల్ని కోసుకుందామని చెయ్యి చాచాడు కుర్రవాడు. "అహాహా, అహా. చెయి వెయ్యకు, చెయి వెయ్యకు. దురదగొండి - దురదగొండి-అదేం పనిరా నువ్వు? వేధించేస్తున్నావ్ నన్ను! ఇహ నిన్నెప్పుడూ ఎక్కడికి నాతో తీసుకు రాను, చెపుతున్నా. చెయ్యి అంతా దురద పుట్టి, దద్దుర్లెక్కుతాయి - దారిమయంనుంచి నడవరా అని ఎన్నిసార్లు చెప్పినా బొత్తిగా వినకుండా ఉన్నావ్!" అన్నాడు హరిహరుడు.

"చెయ్యి తాకితే దురద పుడుతుంది నాన్నా?"

"ఎందుకు దురద పుడుతుందీ! విషం! విషం! దురదగొండి ఎక్కడైనా ముట్టుకుంటూరట్రా! ఆ నూగు తగిలిందంటే చాలు కంపరమెత్తుతుంది. అక్కడితో ఇహ నువ్వు ఏమపు లంకించుకుంటావ్!"

ఊళ్లోకి వచ్చాక హరిహరుడు పిల్లవాణ్ని వెంటపెట్టుకుని, దొడ్డిగుమ్మాన ఇంట్లోకి వచ్చాడు. దొడ్డివాకిలితలుపు చప్పుడయే సరికల్లా సర్వజయ బయటికి వచ్చి—"ఎప్పుడనగా ప్రొద్దున్నకుంకిరదీ! ఇప్పుడారావటం" పిల్లవాణ్నికూడా తీసుకు వెడితిరి, వాడి ఒంటిని మొద్దుబొక్కా అయినా లేదాయె!" అన్నది.

"ఆ! తీసుకెళ్లాను 'కుమ్మరాం'! ఇటు పోను, అటుపోను-వాడిని పట్టటం నాచేత కాకపోయింది! దురద గొండికాయలు కోసుకో బోయాడు!" అని కుర్రవాడికేసి తిరిగి, నీలిమైదానంచూస్తా, నీలిమైదానం చూస్తా—చూశావుగా! ఎలా ఉందిరా?" అన్నాడు హరిహరుడు.

8

ప్రొద్దున ఎనిమిదో, తొమ్మిదో అయి ఉంటుంది. హరిహరుని కొడుకు ఒక్కడూ వసారాలో ఆడుకుంటూ కూర్చున్నాడు. వాడిదగ్గిర పైమూత ఊడిపోయిన సీనారేకు పెట్టె ఒకటుంది. దాన్నికింద బోర్లించాడు. రంగుపోయిన కొయ్యగుర్రం, అర్ధణాపెట్టి కొన్న రేకుబూరా, కొన్ని రాగిడబ్బులు- అవి లక్ష్మీదేవి పటం ముందుండే డబ్బీలోంచి వాళ్లమ్మ చూడకుండా తెచ్చుకున్నవి. వాటిని ఎవరు చూసిపోతారో అని ఎప్పుడూ భద్రంగా దాచుకుంటూ ఉంటాడు-, అణో బేడో పెట్టి కొన్న పిస్తోలు, కొన్ని గానుగుకాయలు - ఈ కాయలు అంచక్కగా ఉంటాయని, వాళ్ల అక్క ఎక్కడినుంచో ఎండిపోయిన కాయలు ఇన్ని ఏరుకొచ్చి, కొన్ని వాడికిచ్చి, మిగిలినవి తన బొమ్మలపెట్టెలో దాచుకుంది- గచ్చకాయల్లా గుండ్రంగా ఉండే గులక రాళ్లు కొన్ని. 'గంగా యమునా' ఆట ఆడుకునేప్పుడు ఈరాళ్లు నూటిగాపోయి తగులుతాయనే నమ్మకంకొద్దీ, వాటిని పదిలంగా దాచుకున్నాడు - ఈ వస్తుసముదాయమే వాడియావత్తు సంపదా. వీటిల్లోంచి ముందు ఆ రేకుబూరా తీసి, అయిదారుసార్లు ఊది, ఆ మనసు తీరటంతో ఇహ దాన్ని అవతల పెట్టేశాడు. ఆ కొయ్యగుర్రాన్ని కాసేపు అటూ ఇటూ నడిపించి, దాన్నిహ ఎందుకూ పనికిరానిదానికింద జమకట్టి అవతలికి నెట్టాడు. ప్రస్తుతం 'గంగా యమునా' ఆడటానికై రాళ్లు చేతపుచ్చుకుని, వసారాలో 'గంగా యమునా' బొమ్మరిళ్లు వేసిఉన్నచోట భావించుకుని, కళ్లు మూసుకుని, రాళ్లు నూటిగాపోయి తగులుతాయా లేదా అని విసిరి చూస్తున్నాడు. ఇంతలో వాళ్లఅక్క దుర్గ నుంగిలిలోఉన్న పనసచెట్టు కింది నుంచి "అపూ! ఒరే అపూ!" అని పిలిచింది. ఆ పిల్ల ఇంతసేపట్నుంచీ ఇంట్లో లేదు. ఇప్పుడే వచ్చింది ఎక్కడినుంచో. ఆ అమ్మాయి కంఠం కొంత బెరుకు బెరుకుగా ఉంది. మనిషిగొంతు విన్పించే సరికల్లా అపూ యంత్రపుబొమ్మలా చటుక్కున ఆ రాగిడబ్బులు కొన్నీ దాచేశాడు. తర్వాత "ఏమిటే అక్కా?" అని అడిగాడు.

★ పథేర్ పాంచాలీ ★

"ఇలా రా, మాట" అని చెయ్యి ఊపింది దుర్గ.

దుర్గకి పది పదకొండేళ్లు వచ్చాయి. చిన్నగా వుంటుంది, అపూ అంత తెల్లగా ఉండదు. వాడికంటె ఒకచాయ తక్కువ. చేతులకు రెండుజతలు మామూలు గాజులు. మాసిపోయిన బట్టలు - జుట్టంతా రేగిపోయి వుంది. కళాకాంతుల్లేని ముఖం మాత్రం కాదు—అపూకళ్లలాగానే దుర్గవి కూడా అలిచిప్పలంతేసి కళ్లు. అపూ వసారా దిగి, దగ్గరకు వచ్చి "ఏమిటే?" అని అడిగాడు.

దుర్గ చేతిలో కొంకాయచిప్ప ఉన్నది. దాన్ని కొంచెం కిందికి వంచి చూపించింది. అందులో కొసిని పచ్చి మామిడికాయ ముక్కలున్నాయి. గొంతు తగ్గించి "అమ్మ ఏటినుంచి రాలేదుగా ఇంకా?" అని అడిగింది.

"ఉహూఁ" అంటూ తల ఊగించాడు అపూ.

"కాస్త నూనె, ఉప్పు తీసుకురాగలవుట్రా?" మామిడికాయ ముక్కలతో మజా అయిన తాయిలం చేసిపెడతా" అన్నది దుర్గ మెల్లిగా.

"ఎక్కడ దొరికాయ్ అక్కా?" అని అడిగాడు అపూ ఠొక్కడలేని సంబరంతో.

"అదే—వాళ్ల తోటలో వావిలి చెట్టు కుదుట్లో పడిఉన్నాయిలే—మరి కాస్త ఉప్పూ-నూనె తీసుకొస్తావా?"

అపూ అక్కకేసి చూసి, "నూనెజాడీ ముట్టుకుంటే అమ్మ కొడుతుందే. పాచి గుడ్డలు నావి" అన్నాడు.

"నువ్వు దబ్బున వెళ్ళి తీసుకొద్దూ. అమ్మ అప్పుడే ఎక్కడొచ్చింది. గుడ్డలు ఉతుక్కొటాని కెళ్లింది. దబ్బున వెళ్లు."

"ఆ కొంకాయచిప్ప ఇలా ఇయ్యి. అందులో వంచుకుని వస్తాను - నువ్వు దొడ్డి గుమ్మంలో కెళ్లి అమ్మ వస్తోందో లేదో చూస్తూ నుంచో." అన్నాడు అపూ.

దుర్గ గొంతు తగ్గించి, "నూనె-గీనె కింద పడనీకు. జాగ్రత్తగా వంచు. లేకపోతే అమ్మ కనిపెట్టేస్తుంది. ఒట్టి చవటవు నువ్వసలు—" అన్నది.

అపూ ఇంట్లోకి వెళ్ళి మళ్లీ రాగానే దుర్గ వాడి చేతుల్లోంచి కొంకాయచిప్ప అందుకుని, మామిడికాయ ముక్కలు అందులో వేసి బాగా పిసికి, "ఏదీ చెయ్యిచాపు" అన్నది.

"మరి ఇకూ అదంతా నీకేనా అమ్మా!" అన్నాడు అపూ.

"ఎంత ఏమిటి మహా! ఇదేగా భాగ్యం! సరే, పోని ఇంకా స్త తీసుకో, ఇంద-వాహ్! భలే బాగుందిరా,... ఓ మిరపకాయ కూడా తీసుకొస్తావ్? ఇంకాస్త పెడతా మరి?"

"మిరపకాయలు శాకెలా అందుతాయి అక్కా? అమ్మ పై బల్లమీదెక్కడో పెడుతుంది. నేను అందుకోగలనా?"

"అయితే వద్దులే, పోనియ్. మళ్ళీ సాయంత్రం తెచ్చుకోవచ్చులే. పటీవాళ్ల దొరువు ఒడ్డున మామిడిచెట్టుందే - దాని పిందెలు మధ్యాహ్నం ఎండవేళ రాలుతూ ఉంటాయిలే-"

దుర్గావాళ్ళ ఇంటిచుట్టూ అంతా అడివి. హరిహరరాయ్ జ్ఞాతి సోదరుడు నీలమణిరాయ్ చనిపోయాడు. అతడి భార్య కొడుకునూ కూతుర్నీ తీసుకుని పుట్టింటికి వెళ్లి ఉంటోంది, అంచేత ప్రక్కనున్న నివేశనస్థలం కూడా అడవిలా తయారయింది. దగ్గిరలో ఇంకెవరి ఇళ్ళూ లేవు - ఫర్లాంగు దూరంలో భువనముఖర్జీగారిల్లు తప్ప.

హరిహరుని ఇల్లు చాలా రోజుల్నుంచి మరమ్మతులు లేకుండా ఉంది. ముందు వైపు వసారా కూలిపోయేట్లుంది. గోడపగుళ్ళలో గచ్చుమొక్కలు పిచ్చిమొక్కలూ మొలిచాయి. కిటికీల కొయ్యచువ్వలు విరిగిపోతే కొబ్బరిమట్టల బద్దలు అడ్డం పెట్టుకోవలసి వచ్చింది.


పెరటి గుమ్మం తలుపు కిర్రుమని చప్పుడయి 'దురా! దుర్గా!' అన్న సర్వజయ పిలుపు విన్పించింది.

"అమ్మ పిలుస్తోంది. వెళ్లి చూసిరా, నోట్లో ఉన్నది కాస్తా తిని వెళ్లు. మూతికి అంటుకున్నదంతా శుభ్రంగా తుడుచుకు వెళ్లు" అన్నది దుర్గ.

తల్లి మరోకసారి పిలిచేసరికి పలకటానికి వీల్లేకపోయింది దుర్గకి. నోటినిండా మామిడిముక్కలున్నాయి. వాటిని గబగబా నమలసాగింది. నోట్లోవి ఇంకా అయిపోలేదు. అంచేత పనసచెట్టు మొదలుచాటుకు వెళ్లి, కచ్చాపచ్చాగా నమిలిన ముక్కల్ని అలాగే మింగటానికి ప్రయత్నిస్తూ నుంచుంది. అపూ కూడా అక్కడే ప్రక్కన నుంచుని తన వంతు ముక్కల్ని బలవంతంగా మింగుతున్నాడు. నమిలి మింగటానికి తగిన వ్యవధి లేదు మరి. అలా మింగుతూనే అక్క చేసిన నేరాన్ని వెల్లడిస్తున్నట్లు నవ్వసాగాడు. దుర్గ చేతిలోని కొంకాయ చిప్పను గిరవాటేసి, దడికట్టినట్టున్న ఆముదపు మొక్కల్ని దాటుకుని, నీలమణిరాయ్ గారి దొడ్డివైపుకి పరుగుతీసింది-తమ్ముడికేసి తిరిగి, "ఆ మూతిన అంటుకున్నదంతా తుడుచుకోవేరా కోతివెధవా" అన్నది వెళిపోతూ.

తర్వాత దుర్గ ఏమీ ఎరగనిదానిలా అటు వైపునించి ఇంట్లోకి వచ్చి, "ఏమిటమ్మా" అని అడిగింది.

"ఎక్కడికి వెళ్లావే ఇంతసేపు? ఒక్కదాన్ని నేను ఎన్నని చూసుకునేది? ప్రొద్దుట్నుంచి గుడ్డలు తికిఉతికి కాళ్లు పడిపోతున్నాయి. ఒక పనిలో కాకపోతే ఒక పనిలోనయినా నీ సాయము నేది లేకపోయె! ఇన్నేళ్లొచ్చాయి ఎందుకు! కాస్త కూరా-నారా తరగటమన్నా లేదు-ఊరికే ఇంటింటికీ పెత్తనాలకి తిరిగిరావటానికయితే తయారు-ఒట్టి కొరివినైపోతున్నావెక్కడో" అన్నది తల్లి.



ఇంతలో అప్పూ దగ్గరకొచ్చి "ఆకలేస్తోం దమ్మా!" అన్నాడు.

"ఆగు, ఆగు. ఒక్క క్షణం ఆగరా బాబూ! రవంత ఊపిరి తీసుకోనియ్. నీకు రాత్రింబగళ్లు ఎప్పుడూ ఒకటే ఆకలి. ఎక్కడలేని ధాష్టీకం నీది మరీ!...దుర్గా! ఆ దూడ ఎందుకో రొప్పుతున్నట్టుంది చూడవే కాస్త..."

కాసేపయ్యాక సర్వజయ వంటయింటి వసారాలో కత్తిపీట ముందు వేసుకుని దోస కాయలు చెక్కు తీసుకుంటూ కూర్చుంది. అప్పూ దగ్గరకు వచ్చి కూచుని, "కాసిని వేపుడుబియ్యం పెట్టవే అమ్మా! కమ్మగా ఉంటాయి" అని అడిగాడు.

దుర్గ తానుకూడా చెయ్యి చాచి, "అటుకులన్నీ అయిపోయాయా?" అన్నది.

అప్పూ ఆ బియ్యం నములబోయి, "ఉస్: అబ్బా! పళ్లునమలనియ్యటం లేదు-పులిశాయి" అన్నాడు.

దుర్గ కళ్లు చిట్లించి వారించటంతో వాడి నోట్లోమాట నోట్లోనే ఆగిపోయింది. "మామిడికాయ ఎక్కడిదిరా నీకు?" అని అడిగింది తల్లి.

నిజం చెప్పటానికి గుండె చాలక అప్పూ అక్కకేసి ప్రశ్నార్థకంగా చూశాడు. "ఎక్కడనుంచి తీసుకొచ్చావు నువ్వుమళ్లీ?" అని అడిగింది సర్వజయ దుర్గను.

దుర్గ కొంచెం బిక్కమొహంవేసి-"వాడినే అడగరాదూ ఆమాట: నేనిప్పటిదాకా ఇక్కడే ఈ పనసచెట్టుకిందనే ఉన్నానుగా. నీ పిలుపు వినబడేసరికల్లా-"

స్వర్ణపాలు పితకటానికి రావటంతో ఆ విషయం అక్కడితో ఆగిపోయింది. వాళ్ల అమ్మ-"వెళు-వెళ్లి కాస్త దూడనువిడు, అరిచి అరిచి అవటిల్లిపోతోంది. లేగదూడ, ఇంత పొద్దెక్కువస్తే అదెక్కడ నిలవగలుగుతుంది? కాస్త పెందరాళే రాకపోతే ఇప్పటిదాకా దూడని అలాకట్టేసి-" అంటూ మొదలెట్టింది. అక్క వెనుకే అప్పూకూడా పాలుపితకటం చూడటానికి వెళ్లాడు. వాడు అక్కడినుంచి మెల్లాలో అడుగు పెట్టగానే- 'వాలిముచ్చువధవా,' అంటూ దుర్గ వాడి నొక గిల్లుగిల్లి-, "పళ్లు పులిశాయేం దొరగారికి! ఇహ నెప్పుడైనా పెడతానేమో చూడు. ఆనక మళ్లీ వెళ్లి వాళ్ల అంటు మామిడిచెట్టుకింద రాలిన పిందెలు తెచ్చుకుంటాగా! ఇంతంత ముక్కలు తిరుక్కుంటా. తియ్యగా బెల్లమే అనుకో అవి: నీకు పెడతాననుకున్నావా? ఆఁ. తిండిపుగాని పాపం! ఒట్టిమొద్దువి నువ్వు. తెలివితేటలేమయినా అఘోరిస్తేగా!" అంది.

నెత్తిమీది పొద్దు తిరిగిపోతున్న వేళకి హరిహరుడింటికి వచ్చాడు. అతడిప్పుడు ఊళ్లో అన్నదా రాయ్‌గారింట్లో గుమాస్తాగా ఉంటున్నాడు. "అప్పూ ఏడీ? కనబడడేం ఎక్కడా?" అని అడిగాడు. "వాడు నిద్దరోతున్నాడు గదిలో" అంది సర్వజయ.

"దుర్గో?"

"అది గొంతులో మెతుకులు గొంతులో ఉండగానే ఎటో జారుకుంది. దానికింట్లో కాలునిలుస్తేనా ఎప్పుడైనా! తిండివేళకి గుర్తొస్తుంది ఇల్లు దానికి. ఆ రెండు మెతుకులూ నోట్లో వేసుకుని చక్కాపోతుంది మళ్లీ. ఎవరితోటలోనో, ఏ మామిడిచెట్టు కిందో, ఏ జామచెట్టుకిందో తిరుగుతూ ఉంటుంది. ఈ చైత్రమాసం ఎండలు. మళ్లీ ఏ జ్వరమైనా ఏమయినావస్తే ఏంకాను! అన్నేళ్లొచ్చాయి, ఇంకా ఎన్నివిధాలని చెప్పేది: దానికి తెలియాలికాని. అసలది నామాట వినటం, చెవినిపెట్టించుకోవటం అంటూ ఉంటేగా."

తర్వాత కాసేపటికి హరిహరుడు భోజనం ముందు కూర్చుని, "ఇవాళొక తొంపరపని ఉండి వెళ్లాను ఆవూరు. ఓ పెద్దమనిషి-చాలా నమ్మకస్థుడులే, ఇంటిముందు అయిదారు ధాన్యంపురులూ అవీ, చాలాడబ్బున్నవాళ్లు-నన్ను చూడగానే సాగిలపడి, 'నన్ను గుర్తుపట్టారా స్వామిగారూ!' అని అడిగాడు. 'ఉహూఁ. నాకెక్కడా చూసిన గుర్తులేదే'- అన్నాను. 'తమ తండ్రిగారుండగా పూజాపురస్కారాదులేవి వచ్చినా వారే స్వయంగా దయచేసేవారు మా ఇంటికి. తమరు మాగురుపరంపరలోని వారండీ; ఈ తఫా మా ఇంట్లో అందరం ఉపదేశం అవాలని ఉంది. కనుక తమరే వెం చేసి, ఆ మంత్రోపదేశం కాస్తా చేసెయ్యండి' అన్నాడు. 'ఆ తతంగమంతా ఇప్పుడు తెచ్చిపెట్టకు. నాలుగు రోజులు పోయాక చెప్తాను నీ సంగతి'- అన్నాను తెలుసా?" అని చెప్పాడు.

సర్వజయ చేతిలోఉన్న పప్పుగిన్నె అక్కడపెట్టేసి, ఎదురుగా కూర్చుని," "తప్పేముందండీ? అలాగేతే అనక పోయారా? ఇంతకీ ఏవర్ణస్థులేమిటి?" అని అడిగింది. హరిహరుడు గొంతుతగ్గించి, "మళ్లీ ఎవరితోనన్నా అనేవ్: 'సద్గోపులు.' నోట్లో నువ్వుగింజ నానదు నీకసలు—" అన్నాడు.

"ఇంకానయం, నేనెవరితో అంటానండీ! సద్గోపులయితే అయారు. వెళ్లి ఉపదేశమివ్వండి. ఎన్ని ఇక్కట్లు పడుతున్నాం ఇక్కడ! ఆ రాయ్‌గారింట్లో ఇచ్చే ఎనిమిది రూపాయలేగా ఉన్న ఆధారమల్లా. అదైనా ఏ రెణ్ణెల్లకో మూణ్ణెల్లకో గాని వస్తూ ఉండదాయె చేతిలోకి. ఎటుచూసినా తలమునిగే అప్పులాయె! నిన్న నేను నీళ్లకెడుతూంటే ఆవీథిబామ్మగారు- 'తాకట్టు పెట్టించుకోకుండా నేనసలెవరికీ ఎర్రని ఏగానీ అప్పు ఇవ్వను అమ్మాయీ! ఏదో నువ్వు మరీ లకాయి లేస్తున్నావని ఇచ్చాను. అయిదు నెలలయిపోయినా తీర్చకపోతే ఎట్లా?' అంటూ నిలవేసింది. ఇహ-ఈ సాతాని రాధమ్మ పూటపూటా నా ప్రాణం తోడేస్తోంది...పిల్లవాణ్ణి చూద్దామా-ఒంటికి గట్టి చొక్కా అంటూ ఒక్కటైనా లేదు వాడికి. పాపం, వాడా మాసికలేసిన చొక్కా తొడుక్కుని మహాసంబరంగా వెడతాడు ఆడుకోటానికి. ఇవన్నీ చూస్తున్నకొద్దీ ఇంట్లోంచి ఎక్కడికైనా పారిపోతే బాగుండునురా భగవంతుడా అనిపిస్తూ ఉంటుందొకొక్కప్పుడు."

★ పథేర్ పాంచాలీ ★

"వాళ్లు మరోసంగతి కూడా చెప్పారు- 'మా ఊళ్లో బ్రాహ్మల ఇల్లు నేది లేదు. మీరు ఇక్కడికి వచ్చి ఉంటామనేట్లయితే ఇల్లూ అదీ వేయించి ఇచ్చి గ్రాసానికి లోటు రాకుండా ఏర్పాటు చేస్తాం. ఊళ్లోకి ఓ బ్రాహ్మణకుటుంబం తెచ్చి పెట్టుకుందామని ఎన్నాళ్లనుంచో ఉంది మాకు' అన్నారు. గట్టిగా అడిగితే కాస్త కొండ్ర రాసి యివ్వటానిక్కూడా సిద్ధపడేట్లున్నారు-వాళ్లకేం కొదువ: ఈ రోజుల్లో అలాంటివాళ్లయిళ్లలోనే కాపురముంటోంది కలిమి. పైకులాల వాళ్లకే ఎక్కడలేని పొట్టతిప్పలు-"

సర్వజయ ఎక్కడలేని ఆత్రంతో-"తక్షణం-మీరెందుకు తల ఊపలేదండీ? సరే, అలాగే వస్తాం అని చెపితే సరిపోయేదిగా: ఈ ఊళ్లో ఏ ముందని మనకు? ఈ కొంప పట్టుకుని వేళ్లాడటమే కాని-" అన్నది.

హరిహరుడు నవ్వుతూ-"పిచ్చిదానా! వెంటనే ఒప్పుకుంటారా ఎక్కడైనా! అలా ఒప్పుకుంటే ఈ బ్రాహ్మడెక్కడో ఉట్టి నాలుగుచేర్లూ తెగినవాడనుకుంటారు. దానివల్ల వాళ్లదృష్టిలో లోకువ అయిపోతాం. అదికూడదు. ముజుందార్ గారితో కూడా రహస్యంగా ముచ్చటించి చూద్దాం ఒకసారి. అదీకాక వెళ్లాలనుకోగానే వెళ్లగలమా? అప్పులవాళ్లంతా 'మా డబ్బు ఇవ్వందే కదలటానికివీల్లే దిక్కడనుంచి' అంటూ వచ్చి కూచుంటారు. అడిగితే ముజుందార్ గారేం సలహా చెప్తారో అదీ చూద్దాం-" అన్నాడు.

ఇంతలో దుర్గ ఎక్కడినుంచో అడుగులు సవ్వడికాకుండా పిల్లిలాగా వచ్చి గుమ్మం చాటున నుంచుని లోపలికి ఓసారి తొంగి చూసింది. ఇంట్లో వీళ్లు పరాకుగా లేరని గమనించి, అటువైపు వసారాలోంచి మెల్లిగా తప్పుకుని, ముందు వసారాలోకి వెళ్లింది. చావడిలోకి వెళ్లే గుమ్మం తలుపు త్రోసిచూస్తే అదీ లోపల గొళ్లెం వేసి ఉంది. ఇక్కడ వసారాముందు నుంచోటం సాధ్యం కానిపని. ఎండ, కాళ్లు అంటుకుపోయేట్లుంది. అంచేత అక్కడినుంచి నెమ్మదిగా పనసచెట్టుకిందికి వెళ్లి నుంచుంది. ఎండలో తిరిగి తిరిగి రావటం మూలంగా మొహమంతా కందిపోయింది. ఓణీకొంగున మాత్రం ఏమిటో మూటకట్టుకుని వచ్చింది. బయటి తలుపుతీసి ఉండి, అమ్మ కనుక లోపల నిద్దరోతూ ఉన్నట్లయితే తాను కూడా మెల్లిగా లోపలికి వెళ్లి కాస్త పడుకుందామనుకుని వచ్చింది. కాని తండ్రి-ముఖ్యంగా తల్లిముందరనుంచి ఆ గుమ్మాన ఇంట్లోకి వెళ్లటానికి ధైర్యం లేకపోయింది ఆ పిల్లకి.

ఇంటిముందు ఉన్న పనసచెట్టు నీడని నుంచుని, ఏం చెయ్యటానికి పాలుపోక, దిగాలుపడి అటూ యిటూ చూస్తూ ఊరుకుంది కాసేపు. తర్వాత ఇహ అక్కడే చతికిలపడి, కొంగున మూటవిప్పి, ఎండిపోయిన ఎలుకజీడిగింజలు కాసిని పైకితీసింది. వాటిని కాసేపు అలాగే చూసుకుంటూ కూర్చుని, ఒకటి, రెండు అంటూ లెక్క పెట్టింది వాటిని. ఇరవైనాలుగు ఉన్నాయి. తర్వాత వాటిలోంచి ఓ అయిదుగింజలు తీసుకుని గచ్చకాయల్లా ఆడుకుంటూ-'ఈ కాస్తని అపూ చేతి కిస్తా. ఇవి బొమ్మలపెట్టెలో దాచుకుంటా. ఎంచక్కగా ఉన్నాయో నిగనిగలాడుతూ. ఇవాళే చెట్టునుంచి రాలి ఉంటాయి. ఇంకా నయం, అదృష్టం బాగుండి పెందరాళే వెళ్లాను కనుక సరిపోయింది. లేకపోతే అన్నీ ఏ ఆవో తినేసేది. వాళ్లకర్రిఆవు మరీ ఒట్టి రాకుసి ఎక్కడో! ఎక్కడికి పడితే అక్కడికలా వెళ్లి అన్నీ పొట్టను పెట్టుకుంటుంది. అప్పుడొకసారి కాసిని తీసుకొచ్చాగా, అవీ-యివీ కలిపితే చాలా అవుతాయి' అనుకోవటం మొదలెట్టింది...

ఆడుతున్న ఆట కాస్తా కట్టిపెట్టి, మళ్ళీ అన్నీ కొంగున మూటకట్టుకుంది. అంతలో మళ్లీ ఏంబుద్ధి పుట్టిందో, గాలికి జుట్టు రేగిపోతూంటే వీధిగుమ్మం దాటి సూటిగా ఎక్కడికో వెళ్లిపోయింది దుర్గ. ★

—ఇంకా వుంది

విశాలామురళీయం

వాసమూర్తి

1

అనగనగా ఒక కథానాయిక కాదు. ఈ మధ్యనే ఒకకథానాయిక. కథానాయిక అయినా పేరుమాత్రం ఏ మోహిని అనో రాగిణిఅనో చక్కగా తేలికగా ఉండక శ్రీలక్ష్మీ సరస్వతీ కామేశ్వరీ విశాలాక్షీదేవి అని తెగబారెడుంది. ఉత్తపూర్వకాలపు పేరు. అందుకే ఆపేరంటే కథానాయికకు తగని అసహ్యం. అటువంటిపేరు పెట్టినందుకు తరుచు తల్లిదండ్రుల్ని తిట్టుకుంటూ వుంటుంది ఆమె. తల్లిదండ్రులయితేమాత్రం పిల్లలవిషయంలో సర్వస్వేచ్ఛ తీసుకోవడమేమిటి? కొంచెం ముందూవెనకా ఆలోచించవద్దూ? ఆ మ్రొక్కంటూ, ఈ మ్రొక్కంటూ, ఆ అమ్మమ్మ పేరనీ, ఈ నాయనమ్మపేరనీ, పేచీలుపడి చివరికి రాజీకి వచ్చి ఒక అతుకులబొంత నామధేయం తయారుచేసి, తగిలిస్తారు. అంతే, ఆపేరు చచ్చినాపోదు. ఆపేరుగలవారు పడేబాధ తల్లిదండ్రులేమైనా ఆలోచిస్తారా అని? అందులోనూ కథానాయిక పడేబాధ వర్ణించాలా? అయినా తెలివైనది కాబట్టి కథానాయిక తనపేరు చెక్కి చెక్కి చిన్నదిచేసుకుని విశాల అని వ్రాసుకుంటుంది. విశాల అంటేనే పలుకుతుంది. ఎవరైనా పొరపాటున చివరివరకూవచ్చి 'క్షి' అని నోరుజారారంటే వారినెత్తిన అక్షతలు పడ్డాయన్నమాటే.

కథానాయికకు సినిమాలంటే-ముఖ్యంగా హిందీ ఇంగ్లీషు సినిమాలంటే-అపరిమితమైన ఇష్టమని వేరే చెప్పనక్కరలేదు. వాటిలోను కథానాయకుడు కథానాయికను గుర్రంమీద ఎక్కించుకునిపోయే దృశ్యాలున్నవి మరీని. ఇంటర్మీడియేట్ రెండో సంవత్సరం చదువుతోందికాని ఎన్నడు కాలేజిపుస్తకాలు ముట్టినపాపానపోదు ఆమె. ఒకవేళ ఎప్పుడైనా కాలేజీ పుస్తకం చేతిలోకి తీసిందంటే దానిలో ఒక చక్కనినవల దాచడానికి మాత్రమే. ఆమె కొనవలా ఈనవలా అంటూ పెద్దవిచక్షణలేదు. ఒకకథానాయిక ఒక కథానాయకుడూ ఉండాలి. ప్రేమ ప్రతిపేజీలోనుంచీ తొణకాలి. అంతే ఆ లక్షణాలున్న ఏనవలఅయినా అవశ్యపఠనీయమే ఆమెదృష్టిలో. సినిమాలు తప్పకుండా చూడడం, నవలలు శ్రద్ధగా పఠించడం ఫలితంగా పగలే కలలుకనే అద్భుత ప్రజ్ఞ అలవడిందామెకు. చుక్కలరేడువంటి సుందరాకారుడొకడు తనప్రేమకోసం తపిస్తున్నట్లూ, తన ఆకర్షణశక్తికి తన సహాధ్యాయినులందరూ ఈర్ష్యతో కుమిలిపోతున్నట్లూ ఒక విలన్ కూడా-విలన్ లేనిదే రొమాన్సు రక్తికట్టదుమరి!-తనను ప్రేమించినట్లూ, ఆప్రయత్నంలో విఫలుడై పగబూని దుర్మార్గానికి దిగినట్లూ, కథానాయకుడు సమయానికడ్డుకొని, అనేక కష్టపరిస్థితులలో విలన్ నెదుర్కొని, పోరాడి, ఓడించి, తనను 'డ్యూక్ శేజెస్ మోడల్' కారులో ఎక్కించుకుని 'నైన్టీమైల్స్ స్పీడు' తో వెళ్లిపోతున్నట్లూ-అప్పుడు-అప్పుడు ఆ అనుభూతి ఆమెకే తెలియాలికాని వర్ణింపశక్యంమాత్రంకాదు. సమయానుకూలంగా సన్నివేశాలు మారుతూఉంటాయి. కథానాయకుని ఆమె ఒకమారు చిత్రకారునిగా ఊహించుకుంటే, మరొకమారు కవికిశోరుని గానూ, ఒకమారు 'ఎయిర్ ఫోర్సు పైలట్' గానైతే ఇంకొకమారు 'నేషనల్ లెఫ్టినెంటు' గానూ, ఒకపర్యాయం నటశేఖరుని గానైతే, వేరొకపర్యాయం ఆటలలో మేటిగానూ ఊహించుకుంటూ ఉంటుంది వైవిధ్యంకోసం. కథానాయకుడెవరైనా మన్మథాకారులుగా ఉండడంఖాయం. ప్రతి కథా సుఖాంతంకావడంకూడా ఖాయం.-విశాలకు విషాదాంతాలలో నమ్మకంలేదు కాబట్టి.

ఏమైనా స్వప్నసీమలలో సంచరించే ఆమెకు ఇంటిపని అంటే ఇష్టమేముంటుంది చెప్పండి. అయినా తల్లి ఛాదస్తురాలు. కన్నకూతురు కదా అనే చనువుతో ఆపని చేసిపెట్టు అని అన్నిపనులూ తనే చేసుకోలేక చిన్నచిన్న పనులే చేయమని చెపుతుంది. కాని విశాల ఖచ్చితంగా వీలులేదని చెపుతుంది. ఎప్పుడో కాళ్లావేళ్లాపడి ఈ వేళకు మాత్రం కాస్త అన్నం వండిపెట్టు, అవతల నాకు తలమున్కలుగా పని ఉంది. తల్లీ అని బ్రతిమాలితే విశాల వంటసాల్లో విసుగుకుంటూ వెళ్ళి పొయ్యి విసురుగావిసురుతూ కూర్చుంటుంది. పొయ్యిలో నుంచి వచ్చేపొగ చూసేటప్పటికి ఆమెకు మేఘాలు జ్ఞాపకం వచ్చి ఆమె వాటి మీద తేలిపోతుంది. ఇవతల అన్నం ఉడికి మాడి బొగ్గై అవతల ఇంటివారికి వాసన కొట్టినా విశాలమాత్రం ఇంకా విసురుతూనే కూర్చుంటుంది. తల్లి పరుగెత్తుకు వచ్చి నెత్తి మొత్తుకుంటూ తనే చచ్చినట్లూ మళ్ళీ మొదటినుంచీ వంట చేసుకోవలసి వచ్చేది. ఒకసారి ఎవరో "ఏమే విశాలా, ఎలా చదువుతున్నావు? నీ పరీక్ష ఏమవుతుంది ఈయేడు?" అని అడిగేటప్పటికి విశాల పరధ్యానంగా "పోతుంది"అని చెప్పేసింది. వెంటనే నాలుక కరుచుకొని "ఎవరిది అడిగావు?-మా యింటి వెనకాలవారి అమ్మాయిదేమో ననుకున్నాను. నా పరీక్ష విషయంలో ఏమీ అనుమానం లేదు'' అని సర్దుకుంది. అనుమానం లేక పోవడం ఫెయిల్ అవడంలోనా, పాసవడంలోనా, అనేది తేల్చకుండా. కూతురి ఈవరస ఏమీ నచ్చక తల్లి ఒకరోజు విశాల నవలలన్నీ దాచివేసింది. కాని ఆవిడ వెన్ను తిప్పిందో లేదో ఇటు విశాల ఏ తలగడా క్రిందనుంచో, బీరువా సందులోనుంచో కొత్త నవలొకటితీసి కాలక్షేపానికి స్థిరపడేది. ఆమె పరధ్యానం శ్రుతిమించి రాగానపడి, అప్పుడు చెప్పినమాట అప్పుడే మరచిపోవడం, అన్నం తింటూనే ఏమి తిన్నదీ జ్ఞాపకం లేక పోవడం, తాళంచెవులు పెట్టెలోపెట్టి తాళం నొక్క-

★ విశాలా మురళీయం ★

చేయడం, ఒకరికి చెప్పవలసినమాట ఇంకొకరికి చెప్పడం మొదలైన లక్షణాలన్నీ ప్రారంభ మయ్యేసరికి తల్లి బెంగపెట్టుకు పోయి ఆ అమ్మనీ ఈ అక్కనీ అందరినీ అడగడం మొదలు పెట్టింది. నూట ఒక్కరు నూట ఒక్క సలహాలు చెప్పారు. ఆఖరికి తల్లి తన కందుబాటులో ఉండే తెలుగు వైద్యుణ్ణి పిలిపించింది. ఆయన అరవైయేళ్ళ ఆచారి. కనకాంబరం పూవు ముడిచిన పిలకా, నెలకోమారు క్షవరం చేయించుకునే అలవాటును బట్టి పెరిగినగడ్డమూ, బోసినోరూ, ఒకవైపు తాడుతో కట్టుకున్న తెల్లఫ్రేములో చవాలు, తెల్లకోటు తెల్లకోటుమీదనస్యం మరకలూ ఆయనా. పిలుపందిందే తడవుగా ప్రత్యక్షమవుతాడు. ఆ తెల్లకోటు ఏ ఇరవై ఏళ్ళనుంచో వాడుకుంటూ వస్తున్నాడు. వైద్యానికి వెళ్ళేటప్పుడే తొడుక్కుతాడు. కోటుంటేనే కాని తగిన కీర్తిరాదని ఆయన నమ్మకం. లోపల అడుగు పెట్టగానే మందుల సంచీ విప్పి కొప్పులూ, పొట్లాలూ తీసి, "అమ్మాయి కేమిటండీ పిలిపించారు. అన్నట్లు ఆ మధ్య మీ ఒంట్లో ఏదో నలతగా ఉండేదనుకుంటాను, నేను మందిచ్చాను గదూ వెంటనే పని చేసిందా, ఇప్పుడేమీ లేదు గదా-" అంటూ ఇంట్లో అందరిని గురించీ విపులంగా అడగడం మొదలు పెట్టే సరికి "అందరం కులాసాగానే ఉన్నాం ముందు అమ్మాయి చెయిచూసి చెప్పండి" అంది తల్లి. "ఆఁ ఆఁ అందుకే కదమ్మా వచ్చింది. ఏదమ్మా చిలకతల్లీ, ఇటురా, నీ కేమొచ్చిం దమ్మా, బంగారు బొమ్మలాంటి దానివంటూ విశాలచేయిచూసి కొంచెం సేపు కళ్ళుమూసుకొని తెరచి పెద్ద దోషం ఏమీ లేదమ్మా కొంచెం పైత్యం మాత్రం ఉంది. దానికి మందిస్తాను" అని పొట్లాలు విప్పి పొడుములన్నీ కలుపుతూ, నేటి వారు నాటు వైద్యాన్ని ఎలా చిన్న చూపు చూస్తున్నదీ, నాటు వైద్యంలో ఎంత గొప్ప ఉన్నదీ, తన తాత ముత్తాత లెలా చికిత్స చేసింది, తా నెవరెవరికి ఎప్పుడెప్పు డేమి మందు లిచ్చినదీ, వాడవాడంతా తన కెంత పలుకుబడి ఉండేది, తనమాత్ర లెంత తక్షణ ప్రభావం చూపేదీ మొదలైన వాటిని గురించి బ్రహ్మాండమైన ప్రసంగం ప్రారంభించే సరికి అమ్మాయి పైత్యం మాట ఎలా ఉన్నా ఆచారిగారి పైత్యం మాత్రం భరింప రాకుండా ఉండడంచేత ఆయన చేతిలో ఒక అర్ధ రూపాయి పెట్టి ఎలాగో త్వరగా పంపించి వేయవలసివచ్చింది. ఆచారి మందు పట్టిచ్చిందో లేదో చెప్ప పనిలేదు కదా. ఇక తరువాత వంతు గ్రహవైద్యుడిది. అతడువచ్చి ఇంట్లో అందరికీకూడా రక్షరేకులు కట్టించుకోవడం మంచిదని చెప్పి విభూతి ఉచితంగా యిచ్చి తన దక్షిణ తాను ముట్టజెప్పించుకొని చక్కా పోయాడు. ఈలోపుగా రాజమండ్రీ నుంచి తమ్ముడు రాగా, తల్లి తన తోబుట్టువు ముందు తన బాధవంతా వెళ్ళబుచ్చుకుంది. తమ్ముడు "అయితే ఒక సారి నీరు మారితే ఏమైనా బాగుపడుతుందేమో, నాతో బాటు రాజమండ్రీ పంపించు" అని చెప్పేసరికి అలాగే పంపించింది తల్లి.

రాజమండ్రీకి వచ్చిందే తడవుగా విశాల బీరువాలూ, అలమారాలూ అన్నీ వెతికేసి దొరికిన నవలలన్నిటిని ఏరి పెట్టుంది. సాయంత్రం చక్కగా అలంకరించుకొని షికార్లకు పోతోంది. ఆ వేళ కూడా మామూలుగానే ఒక స్నేహితురాలింటికి వెళ్ళింది. కబుర్లు చెపుతూంటే కాలం ఎలా గడచిపోయిందో తెలియలేదు. అకస్మాత్తుగా ఆమె దృష్టి వాచీమీద పడింది. ఎనిమిదైందని చూసి కంగారుగా లేచి ఇంటికి బయలు దేరింది. సన్నని సందుగుండా పోతోంది. జన సంచారం అట్టే లేని చీకటిసందు. కాని విశాల అదేమీ గమనించకుండా హాండ్ బాగ్ ఊపుకుంటూ, ఆలోచనలతో తేలి పోతోంది. కొద్దిసేపటికి తన వెనకే ఏదో మరోనీడ వస్తున్నట్లయి తిరిగి చూసింది. గుండె ఆగిపోయింది ఏదో ఎత్తైన నల్లని విగ్రహం. నిశ్శబ్దంగా నడిచివస్తోంది. విశాల గుండె దడదడ కొట్టుకోసాగింది. త్వర త్వరగా ముందుకు నడిచింది కాని వెనకాల నీడలాగే వస్తోంది నల్లని విగ్రహం. అటువంటి పరిస్థితులే ఇదివర కెన్నో మార్లు కథల్లో చదివింది, కల్పనలలో ఊహించింది. కాని ఇప్పుడు వాస్తవంగా ఎదుర్కొవలసి వచ్చినప్పుడు మాత్రం కథలు చదివేటప్పుడుండే ఉత్సాహం, ఉత్తేజం ఏమీ కనిపించలేదు. ముందు ఈ నల్లనివిగ్రహం బారి నుంచి బయటపడితే చాలు ననిపించింది. త్వరగా ఇంకొక సందులోకి నడచింది. అది అంతకన్న చీకటిసందు. కాని ఆ సందు దాటితే మెయిన్‌రోడ్డు. నల్లవిగ్రహం బాగా దగ్గరకు వచ్చివేసింది.

2

రాజమండ్రిలోనే ఒక కథానాయకు డున్నాడు. కాని తాను కథానాయకుడని అతనికి తెలియదు. కథానాయక లక్షణాలు కూడా పూర్తిగా పట్టలేదప్పటికి. ఇంకా చదువూ సంధ్యల్లో చాలా శ్రద్ధగలిగి ఉంటున్నాడు. పేరు మురళీ మోహనరావు బి. ఏ. రెండో సంవత్సరం చదువుకున్నాడు. అందగాడు. పూర్వకాలపు నాయకులకు విదూషకులు చెలికాళ్ళుగా ఉన్నట్లే మురళీకికూడా ఒక చెలికాడున్నాడు. విదూషకులు భోజనప్రియులైతే మురళీ చెలికాడికి ఇడ్లీలంటే మిక్కిలి ఇష్టం. గుండ్రంగా పెరిగిన నిండైన విగ్రహమతనిది. అడ్డుకొలతలో అర్థవ్యాసం అరగజ



సింహళంలో మత్స్యపరిశ్రమ.




సింహళంలో మత్స్యపరిశ్రమను నవీన పద్ధతులలో అభివృద్ధిచేయడానికి ఐక్యరాజ్య సమితి ఆహార, వ్యవసాయ సంఘంవారు సహాయం చేస్తున్నారు. ఈ సంఘంనుంచి, కొలంబోపథకంనుంచి సింహళానికి 20 లక్షల డాలర్ల ఖరీదుచేసే పరికరాల సహాయం, నిపుణులసహాయం అందుతున్నది. పై చిత్రం: బెస్తవారు వలలు ఒడ్డుకు లాగుతుండగా ఆహార, వ్యవసాయ సంఘ నిపుణుడు అజ్మాయిషీ చేస్తున్నారు. దిగువ చిత్రం: వలలో పడిన చేపలను బెస్తవారు పరీక్షిస్తున్నారు.

మైనా ఉండవచ్చు. పేరుమాత్రం బుల్లబ్బాయి. మరళీ ఊరువాడే. తల్లిదండ్రుల కొక్కడే కొడుకు. గారాబంతో పెరగడం వల్ల పాతికేళ్లు వచ్చినా పెద్దవాడు కాలేదు. తల్లిదండ్రులు ధనవంతులు కాబట్టి 'మనకు చదువు లెందుకు నాయనా, హాయిగా ఇంటి దగ్గర తింటూ కూర్చోక' అని ఎంతగానో చెప్పారు. కాని బుల్లబ్బాయికి బి. ఏ. అనిపించుకోవాలని అభిలాష గాఢంగా ఉంది. అయితే బ్రహ్మదేవుడి పక్షపాతబుద్ధి కారణంగా అతనికా అభిలాషకు తగ్గ సామర్థ్యం లేకపోయింది. స్కూలులో చదువుతున్నంత కాలం. మాష్టర్లను భక్తితో సేవించి వాళ్ళ ఇళ్ళచుట్టూ ప్రదక్షిణంచేసి, పనసపండూ, మామిడిపళ్ళ బుట్టలూ పంపించి రెండో ఏడైనా ప్యాసు చేయించుకుంటూ పైకి వచ్చాడు. స్కూలు ఫైనలులో నాలుగేళ్లు తిష్ఠ వేశాడు. నాలుగోయేడు ఎగ్జామినర్లందరినీ సందర్శించి, అష్ట దిగ్బంధనం చేసి పరీక్షా మహాభూతాన్ని ఓడించి వేసి కాలేజీలోకి వచ్చిపడ్డాడు. మురళిని పట్టుకున్నాడు 'నీవే నేను పాసయ్యే ఉపాయమేదో చేయాల'ని. ఇద్దరూ ఒక గదిలోనే ఉంటూ చదువుకున్నారు. మురళీ చదువు నూరినూరి బుల్లబ్బాయి బుర్రలో పోయడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని అది వృధా అని తెలియడానికెంతో కాలం పట్టలేదు. అయినా పట్టు విడిచేవాడు కాడు మురళీ. బుల్లబ్బాయి ఎందుకైనా మంచిదని యీ మధ్య అంజనేయస్వామి ఆలయానికి కూడా వెళ్ళి వస్తున్నాడు. స్వామికి వేయి కొబ్బరికాయ లాకిపెట్టి వచ్చాడు. 'లక్కీ' ఉంగరం తెప్పించుకొని వ్రేలికి పెట్టుకున్నాడు. మిత్రులిద్దరూ రోజూ గోదావరి ఒడ్డుకు పోయి చీకటిపడే వరకూ ఏ శ్రద్ధానందఘాట్ లోనో కూర్చొని లేచి, హోటలులో భోజనం చేసి, బసకు చేరుకుని చదువుల్లో పడుతూ ఉంటారు. ఆవేళ కూడా గోదావరిమీద పిల్ల తెమ్మెరలకు మనస్సులు చల్లార్చుకొని, తరువాత హోటలులో తృప్తిగా భోజనంచేసి ఇంటి దారి పట్టారు. కొద్ది దూరం నడిచేసరికి కెవ్వుమని కేక వినిపించింది. కేక విన్నాడంతే. మురళీ కథానాయకుడై పోయాడు. సందులోకి పరుగెత్తాడు. ఒక యువతి వణుకుతూ నిలబడిఉంది. ముందెవరో ముసుగు మనిషి 'హుం' అంటున్నాడు భీకరంగా. యువతి మెడలో చేయిపెట్టుకుంది గొలుసు తీయడానికి కాబోలు. మురళీ వెంటనే గ్రహించి వేశాడు పరిస్థితి. వెళ్ళి నల్లని విగ్రహం మీద పడ్డాడు. ఆ నల్లని వ్యక్తి మురళీని ఒక్క విదుల్పు విదిల్చి మళ్ళీ యువతిని బెదరిస్తున్నాడు. "ఊఁ త్వరగా" అంటున్నాడు. కథానాయకుడు మళ్ళీ విజృంభించాడు. మళ్ళీ వెనక్కి నెట్టివేయబడ్డాడు. అయినా కథానాయకు డూరుకోగలడా, ఒక యువతి ప్రమాద పరిస్థితిలో ఉండగా. మళ్ళీ ఉరికాడు ముందుకు. నల్ల విగ్రహం కదలక తప్పిందికాదు. ఇద్దరూ కుస్తీకి దిగారు. కథానాయకుడి పని సంకటంలో పడింది. బుల్లబ్బాయి పంట్లాము పైకి పట్టుకొని సందు చివరకు పరుగెత్తాడు ఎందుకేనా మంచిదని. కాని మురళీ ఇప్పుడు, కథాకాయకుడు కాబట్టి అతనిలో ఆవేశం, రోషం పొంగి పోతుండడం వల్ల పెనుభూతంలా పోరాడి ఎలాగో ఆ నల్లని వ్యక్తిని తరిమివేసి తన కథానాయకత్వం ఋజువు పరచుకున్నాడు. భేష్ భేష్ అంటూ బుల్లబ్బాయి తిరిగి వచ్చాడు. కథానాయికా, కథానాయకుడూ ఒరిక నొకరు పరిచయం చేసుకున్నారు. 'విశాల' ముచ్చటగ్గా మూడే అక్షరాలతో ఎంత ముద్దుగా ఉంది పేరు; 'మురళీ మోహనరావు' 'ఎంత చక్కని పేరుః మురళీ అన్నా, మోహన్ అన్నా, రావుఅన్నా, మురళీ మోహన్ అన్నా ఏ విధంగానైనా ఎంత అకర్షకంగా ఉంది. బి. ఏ. రెండో సంవత్సరం చదువుతున్నవాడు. అందగాడు. నల్లని వ్యక్తిని తరిమివేసిన సాహసి! ఇంకే ముంది. కథానాయికకు కథానాయకుడూ, కథానాయకుడికి కథానాయికా దొరికారు. బుల్లబ్బాయికూడా తన్నుతాను కథానాయకుడి చెలికాడుగా పరిచయం చేసుకున్నాడు. ముగ్గురూ ముందుకు నడిచారు.

కథానాయకుడు కథానాయికను ఆమె మేనమామ యింటి వరకూ సాగనంపి వచ్చాడు. పుస్తకం తీశాడు. అక్షరాలు కనిపించలేదు. విశాల విశాలనేత్రాలూ, లే.గులాబి పెదవులే కనిపిస్తున్నాయి. చెవిలో ఆమె తీయని కంఠమే వినిపిస్తోంది. మురళీ హృదయంలో నుంచి కవితాధార ఒక్కమారుగా పైకి చిమ్మింది. బుల్లబ్బాయిని కాగితం కలం తీయమన్నాడతను వెంటనే. ఎందుకన్నాడు బుల్లబ్బాయి. 'ఎదురు ప్రశ్న వేయక నేను చెప్పినది వ్రాయ'మని శాసించాడు మురళీ. 'ఓ విశాలా, నా విశాలా, అంటూ మొదలుపెట్టాడు. బుల్లబ్బాయి హడలిపోయాడు. "అయ్యో ఇదేమిటెరా బాబూ అది తగిన వాళ్ళకేగాని నీకూ నాకూ పడదురా బాబూ ఈ కవిత్వం" అని ఎంతో బ్రతిమాలాడు కాని మురళీ వింటేగా. ఇంకా క్రొత్త కవిత్వం కాబట్టి ప్రతిపాదంలోనూ విశాల పేరే పునర్చరణ కాసాగింది. ఎలాగో కొంతసేపటికి లైటార్పివేసి మురళీని పండుకోజేశాడు బుల్లబ్బాయి. కాని రాత్రి మురళీ పలవరింతలలో ముప్ఫై సార్లేనా లెక్కపెట్టాడు విశాల పేరు. ఎలాగో తెల్లవారింది. విశాల వర్ణనతో చెవులు తడకలు కట్టడం మొదలుపెట్టాయి. విశాలా జ్వరం వచ్చినప్పటినుంచీ మురళీ మళ్ళీ పుస్తకం ముట్టలేదు. "ఒకే పెద్ద పరీక్ష

రాజకీయ నాయకుడు ఉపన్యసిస్తూ "మనం ప్రారంభించిన పంచవర్ష ప్రణాళిక అద్భుతంగా విజయంపొందింది. ఈ ప్రణాళికవలన మనం ఆహార ధాన్యాలు బాగా పండించుకోగలిగాం. వరిపంట ఇదివరకటికంటె పెరిగింది..." అని చెబుతుండగా శ్రోతల్లో ఒకడు "గడ్డి?" అని వేళాకోళంగా అడిగాడు.

"నేను ఇప్పుడు మనుషులకు అవసరమైన పదార్థాల్ని గురించి మాట్లాడుతున్నాను. దీనితర్వాత మీకు సంబంధించిన విషయానికి వస్తాను," అని ఆయన సమాధానం చెప్పాడు.


LIFEBUOY
SOAP
LIFEBUOY
SOAP
LIFEBUOY
SOAP

విశాలా మురళీయం

లురా ముంగున్నవి. దగ్గర పడుతున్నా యిరా" అని బుల్లబ్బాయి మొత్తుకున్నా మురళీ మెదడుకెక్కడం లేదు. కిటికీలో కూర్చొని "శూన్యం" కేసి చూస్తున్నాడు. "అయితే నన్ను గోదావరిలో దింపావన్న మాటే" అని బుల్లబ్బాయి దిగులుతో చతికిల బడ్డాడు. సాయంత్రం మురళీ బులబ్బాయిని తీసుకొని బయలు దేరాడు విశాల దర్శనం కోసం. ఇదేనయం. కాసేపు చెవులు తడికలు కట్టడం తగ్గుతుందని ఉత్సాహంతో నేబయలు దేరాడు బుల్లబ్బాయి. ఎక్కడా విశాల తటస్థపడలేదు. విశాలను చూడకుండా ఉండలేక ఆమె ఇంటికి నడిచాడు మురళీ, లొొప్పతున్న బుల్లబ్బాయిని వద్దన్నా కూడా లాగుకుపోతూ. ఇంటికి పోయేసరికి విశాల మేనమామే కాబోలు వీధిగుమ్మంలో నిలబడి ఉన్నాడు. అందువల్ల దూరంనుంచే వెనక్కు తిప్పుకొని ఆనాటికి నిరాశతో తమగదికి మరలవలసి వచ్చింది. మురళీ ఆరాత్రి సరిగా భోజనమేనా చేయ లేక పోయాడు. మర్నాడు ప్రొద్దున్న "ఎమైనాసరే ఈ వేళ విశాలనొక్కమారు చూడనిదే మరలిరానని" ఒట్టు వేసుకొనిపోయి మురళీ విశాల మేన మామగారి యిల్లు కాపలా కాశాడు. తపస్సు ఫలించి దేవతాదర్శనం అయింది. తృప్తితో తిరిగివచ్చాడు. సాయంత్రం మళ్లా కలుసుకున్నారు కథానాయికా నాయకులు. మళ్లీ మళ్లీ కలుసుకుంటున్నారు కూడా. మురళీ మంచి హుషారుమీద ఉంటున్నాడు. పరీక్షలకు నీళ్లు వదలుకున్నాడు బుల్లబ్బాయి. పైపెచ్చు మురళీ కవిత్వం "రికార్డు" చేయడంలో మతిపోయేటట్లుంది అతనికి. కాని ఏం చేస్తాడు. ప్రాణస్నేహితుడు ప్రేమ ప్రవాహంలోపడి కొట్టుకుపోతూంటే బాధ పడుతూ అతనినే పట్టుకు వ్రేలాడుతున్నాడు ఎప్పటికైనా దరిచేర్చలేక పోతామా అని. ఇటు నాయికా నాయకుల మధ్య మీటింగులు మోతాదు దాటుతున్నాయి. కాని కొన్ని కొత్త పరిస్థితులు వచ్చాయి. గాలీవానా వస్తే కథే లేదంటారు కాని అంతా సాఫీగా నడచిపోయినా కథే లేదని చెప్పాలి. నాయికా నాయకులు కలుసుకోవడానికి ఇప్పుడు చిక్కులు బయలుదేరుతున్నాయి "అదుగో, విశాల వెళ్ళి మాట్లాడుదాం" అని మురళీ దగ్గరకు పోయేసరికి విశాల అతనికేసి చూడకుండా వెళ్లిపోతోంది. కారణ మేమిటా అని ఆలోచిస్తూ చూసేసరికి విశాల ప్రక్కన తెల్ల ముసుగని తేలింది.

ఇంతలో దుష్టపాత్ర రంగంమీదికి దుమికాడు. దుష్టపాత్ర ఎవడో కాదు విశాల మేనత్తకొడుకు లక్ష్మీనారాయణ. ఆ ఊళ్లోనే ఉంటున్నాడు. ఎస్. ఎస్. ఎల్. సి. పాసయ్యేందుకే తలప్రాణం తోకకు వచ్చినట్లయి అక్కడితో చదువు చాలించి ప్లీడరు గుమాస్తాగా చేరాడు, పెద్దసితివాడు కాదు కాబట్టి. అతనికి చూపంతా విశాలమీదే ఉంది. తన తక్కువస్థితి కారణంగా మేనమామ అయినప్పటికీ విశాల తండ్రి ఆమెను తనకివ్వడమనేది కలలోనిమాట అని అతనికి తెలుసును. అయినా విశాలకనక ఒప్పుకుంటే ఆమె తల్లిదండ్రులచేతకూడా ఒప్పించవచ్చని అతని ఆలోచన. పైగా తన రక్త సంబంధంవల్ల విశాలమీద తనకు దేవుడిచ్చిన అధికారముందని అతనికొక ధీమా. విశాలను వెన్నంటి వేధించడం మొదలు పెట్టాడు బజారుకుపోతే బజారుకు సిద్ధం. సినిమాకుపోతే సినిమాకు తయారు. పదే పదే పలురకాల ప్రకటనలతో ప్రజల మనస్సుల్ని వశం చేసుకొనే నేటి 'అడ్వర్ టైజర్ల' పద్ధతు లవలంబించ సాగాడు. విశాలకోసం పువ్వులు కొని తెస్తున్నాడు. పాఠశాలలో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. కూల్ డ్రింకు లిప్పిస్తున్నాడు. వీలు చిక్కినప్పుడల్లా ప్రేమ ప్రకటిస్తున్నాడు. విశాల తన 'ప్రెషర్ టాక్టిక్స్'కు లొంగిపోతుందని అతనివిశ్వాసం. ఆ విశ్వాసంలో అతి చనువుకూడా తీసుకున్నాడు. తెలియనట్లుగా చేయి తాకుతున్నాడు. చూడనట్లుగా మీదకు వస్తున్నాడు. ఆవేళ సినిమానుంచి లేస్తూంటే జనం దూరంగా ఉండడం చూసి చేయిపట్టుకున్నాడు. విశాల విదిలించుకోబోయింది. కాని గట్టిగా పట్టుకొని తననూ కనికరించమన్నాడు. ప్రేమించమన్నాడు పెళ్లి చేసుకోమన్నాడు. విశాల చేయివదలకపోతే గట్టిగా అరుస్తానంది, ఏమైనా వినన్నాడు లక్ష్మీనారాయణ అదేసమయంలో కథానాయకుడు మురళీ చెలికాడు బులబ్బాయితో అటు వచ్చాడు. తన కళ్ళయెదుటే తన ప్రేయసిని ఎవడో గుప్తుడు బలాత్కారం చేయబోతే కథానాయకుడూరుకోగలడా? వెంటనే వెళి మెడబట్టుకున్నాడు. లక్ష్మీనారాయణ మొదట్లో కొవ్వుమని కేక వేసి కథానాయకుడివైపు తిరిగి "నువ్వెవడివిరా, రాస్కెల్ నన్ను పట్టుకోవడానికి, వదులు" అని అరిచాడు. "నువ్వెవడివిరా ఆ అమ్మాయి చేయి పట్టుకుంటావు" అని గర్జించాడు కథానాయకుడు. "నువ్వెవడివిరా ఆ అమ్మాయి విషయం పట్టించుకుంటావు" కన్నాడు దుష్టనాయకుడు లక్ష్మీనారాయణ ఇద్దరూ ఒకరి చొక్కా కాలర్లు ఒకరు పట్టుకున్నారు. విశాల తెల్లబోయి చూస్తోంది. కాని వెంటనే తేరుకొని అంతకుముందు వల్లని వ్యక్తిని తరిమివేసిన మురళి ఇప్పుడు లక్ష్మీనారాయణను లక్ష్మీనారాయణగా ఉంచు

వాడో ఉండడో అని భయంవేసి "వసులు, మురళీ, అతను మా మేనత్త కొడుకు లక్ష్మీనారాయణ" అంది దానితో కథానాయకుడికి గుండె ఆగిపోయినంత అయింది. లక్ష్మీనారాయణను వదిలి వెర్రిమొగం వేసుకొని చూస్తూ నిలబడ్డాడు లక్ష్మీనారాయణకు ఊపిరి అంది ధైర్యం తిరిగి విజృంభించింది. "రారా, రాస్కెల్ నిన్ను చిత్రహింస చేయకపోతే నా పేరు లక్ష్మీనారాయణ కాదు. రారా దమ్ములుంటే" అంటున్నాడు బుల్లబ్బాయి మురళీని వెనక్కిలాగడం మొదలుపెట్టాడు మురళీ అలాగే మాట్లాడకుండా వెనక్కి తిరిగి తలవంచుకుని నడవసాగాడు లక్ష్మీనారాయణ విశాల వైపుకు తిరిగి "వీడితో నీకేం ఉందన్న మాట ఉండు నీ సంగతి మీ మామయ్యతో చెప్పకపోతే" అన్నాడు. "నువ్వు చేయబోయింది కూడా మా మామయ్యతో చెపుతానం'ది విశాల దుష్టనాయకుడిని ధైర్యంగా ఎదుర్కొనే కథానాయికలా. ఇద్దరూ మాట్లాడకుండా ఇంటికి చేరారు దుష్టనాయకుడి దుర్బుద్ధి ఎక్కడకు పోతుంది మర్నాడు ప్రొద్దున్న రహస్యంగా విశాల మేనమామతో విశాల ఎవడితోనో చనువుగా ఉంటోందని చెప్పాడు దానితో ఆయన హడలిపోయి, ఏమైనావస్తే తన నెత్తిమీద పడుతుందనుకుని అప్పటికప్పుడు విశాలను కాకినాడ బండి ఎక్కించి వచ్చాడు.

3

మర్నాటినుంచి కథానాయకుడికి ప్రేయసి దర్శనం కాలేదు విశాల వెళ్ళిపోయిందని తెలిసింది. మురళీ పూర్తిగా నిరాశలో మునిగిపోయాడు ఇక విశాల తనకు కాదనుకున్నాడు. విశాల లేనిదే ఈ ప్రపంచంలో బ్రతకడ మెలా? ఒకటి రెండుసార్లు గోదావరిమీద అతని దృష్టి పడింది కాని బులబ్బాయి జాగ్రత్తగా అతని నిరాశనంతా కవిత్వంలోకి మళ్లింపజేశాడు.

పరీక్షలు వచ్చాయి మురళీ 'ప్రేయసి లేనిదే బ్రతుకెందుకు? బ్రతుకెందుకనుకున్నప్పుడు పరీక్షలెందు'కని వైరాగ్యంలో పడ్డాడు కానిఎలాగో దిటవు తెచ్చుకుని పరీక్షల ముందుకొంచెం చదివి పరీక్షలకు కూర్చున్నాడు బుల్లబ్బాయికి తన పరీక్షా ఫలితం ముందే తెలుసు. కాబట్టి పరీక్షల రోజుల్లో జ్వరం తెప్పించుకుని పడుకున్నాడుట—ఎవడేనా అడిగితే 'జ్వరం వచ్చి మానివేయవలసి వచ్చింది. లేకపోతే ఫస్టుగా పాసైఉండును' అని చెప్పుకోవచ్చు కాబట్టి పరీక్షలవగానే వైరాగ్యంలో పడిపోయిన మురళీని తీసుకొని స్వగ్రామం చేరాడు బుల్లబ్బాయి.

4

విశాల వైఖరి ఎప్పటిలాగే ఉండడం మాని తల్లి పూర్తిగా బెంగపెట్టుకుంది. భర్తను బ్రతిమాలింది "త్వరగా ఏవైనా సంబంధాలు చూడండి. దీని వరస చూస్తే రేపెవడూ పెళ్ళి చేసుకోకపోవచ్చు. నలుగురిలోనూ అప్రతిష్ఠగా కూడా ఉంటుంది. త్వరగా పెళ్ళి చేసేస్తేనేకాని దీని వరస బాగుపడేటట్లు లేదు" అని. ఆయన అలాగేనని సంబంధాలు చూడడం ప్రారంభించాడు కాని ఏ సంబంధం తీసుకువచ్చినా "నాకీ సంబంధం నచ్చలేదు, నేను చేసుకోను" అని తోసివేస్తోంది విశాల సంబంధాల వారిని చూపులకని ఇంటికి పిలిచి చెప్పి పంపిస్తే బాగుండదని, పెళ్ళికొడుకుల ఫోటోలు ముందు తెప్పించి కూతురుని చూసి చెప్పమంటున్నారు విశాల తండ్రి. విశాల ఆ ఫోటోలకేసి చూడడం లేదు. చూడకుండానే నచ్చలేదని చెప్పేస్తోంది ఈ సమయంలో లక్ష్మీనారాయణ అక్కడకు చేరాడు. మేనమామతో తన ప్రస్తావన తెచ్చాడు. ఆయన పెద్దగా నవ్వివేసి ఊరుకున్నారు.


ఎలాగైనా దుష్టనాయకుడు తనకు కాకపోతే పోనీ, మరొకరికేనా కాకుండా చేయాలనే దుర్బుద్ధితో విశాలకు వచ్చే సంబంధాలను చెడగొట్టాలని తలపెట్టాడు లక్ష్మీనారాయణ కాని తన ప్రయత్నం అవసరం లేకుండానే విశాలే అన్ని సంబంధాలను తిప్పివేస్తోంది. ఆమె మనస్సు వాడెవడిమీదో ఉంది కాబోలు, వాడి విషయమే చూడాలనుకున్నాడు. అలాగే అతనుండగానే మురళీ ఫోటో తీసుకువచ్చారు విశాల తండ్రి, ఎవరో మురళీ సంబంధం మంచిదని చెపితే అతని ఫోటో తెప్పించి కూతురుని చూడమని బల్లమీద పెట్టి వెళ్ళారు. అది మురళీ ఫోటో అయిఉంటుందని విశాల కలలోనైనా ఊహించలేదు. కాబట్టి ఆఫోటో కేసే చూడకుండా ఊరుకుంది. కాని ఫోటోను చూసి గుర్తించాడు లక్ష్మీనారాయణ పొరబాటునైనా విశాలదృష్టిలో అది పడితే ప్రమాదమని లక్ష్మీనారాయణ మెల్లగా ఆ ఫోటో దాచివేసి మరొక అనాకారుడిఫోటో పెట్టాడు తల్లి "ఫోటోలు చూడడానికేమే? చూడకుండానే నచ్చలేదంటే ఎలాగే అమ్మాయి! చూడు, నచ్చకపోతే చేసుకోమని ఎవరంటారు" అని చెప్పగా విశాల వచ్చి బల్లమీద ఫోటో చూచి మూతిముడుచుకొని, కళ్లుమూసుకొని చక్కాపోయింది. మేనమామ తీసుకునే సమయానికి మాత్రం మామూలు ఫోటో పెట్టివేశాడు లక్ష్మీనారాయణ "ఏం అమ్మాయి ఈ పిల్లవాడేనా నచ్చాడా?" అని తండ్రి అడగగా "నచ్చలేదని ప్రత్యేకంగా చెప్పాలేమిటి" అని విసుగ్గా సమాధాన మిచ్చింది విశాల. తండ్రి కోపంతో "నీకు భూమిమీద సంబంధాలేవి నచ్చేటట్టు లేవు. ఆఖరికి నాకు ఒళ్ళుమండుతువస్తే ఈ లక్ష్మీనారాయణకే ఇచ్చివేస్తాను" అని కేకలు పెట్టారు. తన రొట్టె నేతిలో పడిందనుకున్నాడు లక్ష్మీనారాయణ విశాల తనకు నచ్చినవాడిని తప్ప మరొకడిని చేసుకోదు. ఇప్పుడు ఆవచ్చిన వాడి సంబంధం కూడా పోగొట్టుకుంది ఇక విశాలకు వేరేవిధంగా పెళ్లి కాదు చివరికి తనదగ్గరకే రావలసివస్తుంది అని ఊహించుకుని, తన పథకం పారింది కాబట్టి తానక్కడ ఉండవలసిన పనిలేదని వెనక్కి వెళ్ళిపోయాడు.

విశాల మెల్లగా తల్లిదగ్గరకు చేరి "అమ్మా నాన్నతో చెప్పి ఈ సంబంధాలకోసం వెతకవద్దనవే" అని చెప్పి తానొక కుర్రవాడిని ప్రేమించాననీ, అతనినే పెళ్ళిచేసుకోవాలనుందని గొణిగింది. తల్లి నోరు తెరచుకొని, బుగ్గలు పొడుచుకొని, ఉండిపోయింది. తరువాత కూతురుని తియ్యగా చీవాట్లు పెట్టింది. కాని కూతురు కన్నీరు చూసి కరిగిపోయి భర్తతో సిఫార్సుచేయడానికి ఒప్పుకుంది. విశాలతండ్రి విషయం తెలుసుకోగానే నిలువెత్తున లేచారు. ఆయన కేకలతో పెంకులు లేచిపడ్డాయి. విశాలకూడా పిల్లికూన అయిపోయింది "చివరికా లక్ష్మీనారాయణ గాడికే ఇచ్చిచేసేస్తాను దానితో రోగం కుదురుతుంది" అని మళ్లీ బెదరించి కండువా వేసుకోకుండానే వీధిలోకి వెళ్ళిపోయాడు. ★

(మిగతాకథ పైవారం)



రాజశ్రీ వారి 'జయం మనదే' లో జానకి, ఎన్. టి. రామారావు.




జూపిటర్ వారి 'ఉమాసుందరి'లో సురభి బాలసరస్వతి, రేలంగి

★ ★ ★

గోకుల్ పిక్చర్స్ వారి "కనకతార"లో ఎస్. వరలక్ష్మి, మాస్టర్ వర్మ.






రా జ శ్రీ



కృష్ణ నిర్మిస్తున్న 'జయం మనదే' లో అంజలీదేవి



రత్నదీప్ పిక్చర్స్‌వారి 'జయశ్రీ' లో నిమ్మీ.



జూపిటర్ వారి 'ఉమాసుందరి' లో శ్రీరంజని.



శ్రీ రాజరాజేశ్వరీ ఫిలింకంపెనీవారి "నాగపంచమి" (తెలుగు) లో నాగయ్యా, కన్నాంబ.

బొంబాయి సినిమా లేఖ

మొన్న నీమధ్యనే, మీరట్ నించి ఒక యువకుడు బొంబాయి వచ్చాడు. రైల్వే స్టేషన్‌లో దిగీదిగగానే, జనం అతణ్ణి చుట్టుముట్టారు. అతని పేరు కమల్ దీన్. క్రైస్తవుడు ఆగ్రా విశ్వవిద్యాలయంలో పట్టభద్రుడై, సినిమాలో అవకాశంకోసం బొంబాయి వచ్చాడు. దిగీదిగగానే ఇంత స్వాగతం లభించింది. విస్తుపోయాడు. స్టేషన్‌లోనే కాదు ఆ తరవాత స్టుడియోలకు వెళ్లినా అతణ్ణి అంతా పలకరించి మాటాడుతూ వచ్చారు. అసలు సంగతేమిటంటే ఈ కమల్ దీన్‌కు, ప్రఖ్యాత నటుడు రాజ్ కపూర్‌కు బాగా పోలిక ఉంది. చాలాచోట్ల ఇతణ్ణి చూడగానే రాజకపూరే అని భ్రమించి జనం చుట్టుముట్టేవారు. ఈ పోలిక పుణ్యమా అని కమల్ దీన్‌కు సినిమాలో అవకాశం అతి త్వరగా లభించింది బస్'డా థియేటర్స్ 'బాఘీ సర్దార్'లోను ఫిలిం ఆర్ట్స 'హమ్ జోర్ తుమ్'లోనూ, ఆస్పీఫిలింస్ 'మరిన్ ఫర్ హౌస్'లోనూ బుక్ అయిపోయాడు. ఒక రోజున నరీస్‌ను చూచి వద్దామని మెరీన్ డ్రైవ్‌కు బయల్దేరివస్తే సరికి, అక్కడ పిన్నా పెద్దా చాలమంది ఇతణ్ణి చూసి రాజ్ కపూర్ అనే భ్రమించి చుట్టూ మూగయ్యారు. తన పేరూ ఊరూ చెప్పి కమల్ దీన్ అతి కష్టంమీద వాళ్ళను నమ్మించి సాగనంపాడు. ఈ సంఘటన ఫలితంగా ఆర్. కె స్టుడియోలో ఒక చిత్రంలో అతను బుక్ అయ్యాడు అందులో రాజ్ కపూర్ కూడా నటిస్తున్నాడు. అతనే దర్శకుడు కూడా.

* * *

మార్చి 22న ఇక్కడ జరిగే 'ఫిలింఫేర్' బహుమతి ప్రదానోత్సవాలలో పాల్గొనే నిమిత్తం మధురగాయని నూర్జహాన్ ఈ నెలలో బొంబాయి వస్తోంది. దేశ విభజనానంతరం, ఆమె పాకిస్తాన్ తరలివెళ్ళి స్థిరపడిపోయింది. ఆమె తన భర్త షౌకత్ హుసేన్ రజ్వీకి (లాహోర్‌లోని షానూర్ స్టుడియో అధిపతి) ఇటీవలే విడాకు లిచ్చింది. నూర్జహాన్ వెంట, సంగీత దర్శకుడు ఖుర్షీద్ అన్వర్ కూడా వస్తున్నాడనీ, వాళ్ళిద్దరూ ఇక్కడ వీలైతే కొన్ని చిత్రాలలో పనిచేయడం జరుగవచ్చనీ తెలుస్తోంది.

* * *

నటి యశోధరా కట్జూ, భారత నౌకాదళానికి చెందిన లెఫ్టినెంట్ దిలీప్ భండారీలు వివాహం చేసుకో నిశ్చయించుకున్నారు. మొన్న 'బసంత్ పంచమి'నాడు ప్రధానం జరిగింది. వివాహ ముహూర్తం మాత్రం, డిసెంబరులో పెట్టుకుందట. అప్పటి వరకూ, శాస్త్రరీత్యా తగిన ముహూర్తాలు లేవట.

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)

చలన చిత్రాల నిర్మాణం

లైసెన్సు పద్ధతి ప్రవేశపెట్టే సంకల్పం

దేశంలో చలనచిత్రాలు నిర్మించదలచే వారంతా ముందుగా ప్రభుత్వం అనుమతి తీసుకోవాలన్న నియమం ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖమంత్రి డా|| బి. వి. కేస్కర్ మార్చి 1వ తేదీన రాజ్యసభలో చెప్పారు. ఈ లైసెన్సు పద్ధతి కనక అమలులోకి వచ్చేటయితే, అప్పుడు మనదేశంలో చిత్రాలు నిర్మించే విదేశీయ నిర్మాతలుకూడా దీనికి లోబడి కంపెనీలను రిజిస్టరు చేయించుకుని లైసెన్సు తీసుకోవలసి ఉంటుందని, ప్రస్తుతానికిమాత్రం విదేశీయులు ఇక్కడ చిత్రాలు నిర్మించడానికి నియమనిబంధనలు ఏవీ లేవని మంత్రి తెలియజేశారు.

విదేశీయులు మనదేశం వచ్చి, అభ్యంతరకరమైన చిత్రాలు నిర్మించడాన్ని నివారించడానికి ప్రభుత్వం కట్టుదిట్టాలు చేస్తుందా అని ఈ సందర్భంలో కొందరు సభ్యులు అడిగారు.

విదేశీయులు ఇక్కడ చిత్రాలు నిర్మించడానికి అభ్యంతరాలు ఏవీ లేవుకాని, వాటిని ఇక్కడ విడుదలచేయదలచినప్పుడు మాత్రం ప్రభుత్వం అనుమతి తీసుకోవలసి ఉందని, డా|| కేస్కర్ జవాబిచ్చారు. ఇక, అసలు నిర్మాణానికే అనుమతి ఇవ్వాలా కూడదా అన్న సంగతి, అక్కడితో పరిమితం కాదని, అది విదేశీయులకు సంబంధించిన అనేక ఇతర విషయాలు — ఇంతకన్న ముఖ్యమైన వాటిలో అంతర్భాగం కాబట్టి పెద్దప్రశ్న అని ఆయన విశదం చేశారు

ఎటొచ్చీ, విదేశీయ నిర్మాతలు, చిత్రనిర్మాణ వ్యవహారాలకు సంబంధించిన విషయంలో ప్రభుత్వం సహాయం కోరినప్పుడు మాత్రం, వారు తీసే చిత్రాల స్వరూప స్వభావాలను ప్రభుత్వం పరిశీలించి, తగువిధంగా వ్యవహరిస్తుందని డా|| కేస్కర్ పార్లమెంటరీ కార్యదర్శి శ్రీ రాజగోపాలన్ ఒక ప్రశ్నకు సమాధానంగా తెలియజేశారు.

గత సంవత్సరం ఒక విదేశీయ సంస్థ "భవానీ జంక్షన్" అనే చిత్రం నిర్మించడానికి ప్రభుత్వాన్ని కొన్ని వసతులు కల్పించ కోరడం, ఆ కథలో అభ్యంతరం పెట్టదగిన విషయాలు ఉన్నందువల్ల ప్రభుత్వం అనుమతి నిరాకరించడం తెలిసినదే. ఈ విషయం అప్పట్లో పార్లమెంటులో కూడా ప్రస్తావనకు వచ్చింది. దరిమిలా, పాకిస్తాన్ ప్రభుత్వం ఆ సంస్థకు అనుమతినిచ్చి వసతులు కల్పించడం జరిగింది.

* * *

"పథేర్ పాంచాలీ"

కేన్సు చలనచిత్రోత్సవానికి పంపే నిర్ణయం

వచ్చేనెల కేన్సులో జరుగనున్న అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రదర్శించే నిమిత్తం భారతదేశం పేరిట బెంగాలీ చిత్రం "పథేర్ పాంచాలీ"ని పంపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విభూతిభూషణ్ బెనర్జీ నవల ఆధారంగా, శ్రీ సత్యజిత్ రాయ్ తీర్చి దిద్దిన ఈ చిత్రంలో 'వాస్తవికత' అన్న మాటకి అనుగుణంగా అర్థం కనబడుతుంది. ఎక్కడా మెలోడ్రామాకు అవకాశం ఇవ్వకుండా, నిర్దాక్షిణ్యమైన వాస్తవికతను చూపించే ఈ చిత్రం యావద్భారతం గర్వించదగ్గ స్థాయిని అందుకుంది.

తెలుగులో కూడా...

ఇటువంటి చిత్రాన్ని దేశంలో అందరూ చూసే అవకాశం కలుగచేయడం చాలా అవసరం. మద్రాసులో, ఏ. వి. ఎం. స్టుడియో అధిపతి శ్రీ మెయ్యప్ప చెట్టియార్ దీన్ని తమిళంలోకి డబ్ చేసిగాని, తమిళ వ్యాఖ్యానంతో గాని తమిళ దేశంలో విడుదలచేయ సంకల్పించారు. అలాగే ఇతర భాషలలో కూడా దీన్ని విడుదల చేయడం సముచితం. ముఖ్యంగా వంగ సాహిత్యానికి బహుళ జనాదరణగల ఆంధ్ర దేశంలో ఈ చిత్రం విడుదలను సర్వత్రా హర్షిస్తారు.

అసలు బెంగాలీ చిత్రం పూర్తి అయి బయటకు రావడానికి సహాయం చేసింది బెంగాల్ ప్రభుత్వం. ఇప్పుడు ప్రయివేటు నిర్మాతలు ఎవరూ ముందుకు రాని పక్షంలో ఈ సారి కేంద్ర ప్రభుత్వమే ఇందుకు పూనుకొని, ఫిలింస్ డివిజన్ ద్వారా దీనిని విడుదల చేయడం వాంఛనీయం.

* * *


హిచ్‌కాక్ కొత్తచిత్రం

"టు కాచ్ ఎ థీఫ్"

దొంగని దొంగే పట్టాలి. మంచిదారిని పడి బాగుపడదలచుకొన్న దొంగ తనపేరుకి పట్టిన మచ్చ వదిలించుకోడానికి అటువంటి సత్కార్యానికి పూనుకొన్నప్పుడు, అతగాడి చిత్తశుద్ధి మీద పోలీసువాళ్ళకి గురి కుదరక పోవచ్చు. అందుకని వాళ్ళు, ఈ దొంగ ప్రయత్నాలను సాగనివ్వక పోవచ్చు. మరో ప్రక్కన కిరాయి దొంగలతో వ్యాపారం సాగించే పెద్దమనుషులు, పైకి ప్రేమ ఒలకబోస్తూనే, వెనకనుంచి గోతులు త్రవ్వ



చేతన ఆనంద్ చిత్రం 'అంజలి'లో బౌద్ధసన్యాసినిగా సింధీ సుందరి, శీలా రామాని



నరసూ వారి 'భలేరాముడు'లో సావిత్రి, దొరస్వామి.

హిచ్‌కాక్ కొత్తచిత్రం

టూంటారు హిచ్‌కాక్ కథలో జాన్‌రాబీ అదృష్టవంతుడు కాబట్టి, చూసి చక్కని చిన్నది, బోలెడు డబ్బు, అమెరికన్ హీరో యిన్‌కు ఉండే సాహసం ఉన్నది అతనికి సహాయం చేస్తుంది

నానాటికీ పెరిగే దొంగతనాలతోపాటు దుస్సాహసాల మొత్తంకూడా పెరుగుతున్నందు వల్ల ఒక భీమాకంపెనీ ఏజంటుకూడా యథాశక్తి సాయం చేస్తాడు.

మొత్తానికి జాన్ రాబీ, (కారీగ్రాంట్) తనపేరుకి వచ్చిన కళంకం తుడిచేసుకుని, మంచితనం ఋజువు చేసుకుని, ఆ పైన, ఆ పిల్లని (గ్రేస్ కెలీ) పెళ్ళాడుతాడు చిన్న కథలో ఇమిడిపోయే ఈ ఇతివృత్తాన్ని హిచ్‌కాక్ తమ సహజ ప్రతిభతో చక్కగా చిత్రించారు. అయితే ఈసారి తీరు వేరు ఇదివరలో వచ్చిన రోప్, స్ట్రేంజర్స్ ఆన్ ఎ ట్రెయిన్, అండర్ కేప్రికారన్, రియర్ విండో వంటి చిత్రాలలోవలె ఇందులో నిలకడగామయిన పాత్రలు లేవు పోతే, నరాలు పిండే తరహా సన్నివేశాలు కాదు హఠాత్తుగా కనబడి హడలగొట్టే దృశ్యాలు కూడా లేవు అయితే కథగా అక్కడక్కడ మెలికలు వెదజల్లబడ్డాయి రెండు సంఘటనలకు సంబంధించిన వాటికి అప్పటి కప్పుడే జవాబు చెప్పేస్తారు పోతే, కథ పొడుగునా సున్నితమయిన హాస్యం ఉంది

విస్టావిజన్ ఫొటోగ్రఫీ విలాసవిహార కేంద్రవిశేషాకర్షణ. ఫ్రెంచి రెవియేరా, అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతంగా సద్వినియోగం చేశారు. టెక్నికలర్ వల్ల ఇది మరింత శోభించింది

వీటన్నిటికీ తోడు, మాజీదొంగ జాన్ రాబీగా కారీగ్రాంట్ నటన, మనోహరముగా ఉంది.

మొత్తంమీద ఈ చిత్రం చూచిన మీదట ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ కొంతవరకూ కొత్త పంథా అవలంబించారన్న సంగతి విశదం అవుతోంది

* * *

ఇటాలియన్ ఫిలిం పరిశ్రమ

విదేశీయుల కరవడికి లోబడాలని రావడం, మరోవంక మతం పేరిట చర్చిచేసే శాసనాలు, ఉన్న పరిస్థితులను యథాప్రకారం చిత్రించడానికి ప్రభుత్వం పెడుతున్న ఆటంకాలు మొదలైన కారణాలవల్ల ఇటలీలో ఫిలింపరిశ్రమ బాగా దెబ్బతిని పోయిందట పరిశ్రమ అప్పులపాలై పోయిందట ఈ పరిస్థితుల ఫలితంగా, ఇటలీలో కల్లా పెద్దదైన సినీసిటా స్టుడియో ఒక అమెరికన్ సంస్థకు అమ్మకం పోబోతున్నదట. నటులు కూడా తొందరాయి పోతున్నారు. ఇటాలి

ఉన్న నటీమణులు అనా మగ్నాని, జినాలో లో బ్రిగేడా వంటివారు ఇతరదేశాలకువెళ్లి పోయారు. వయోవృద్ధులైన అమెరికన్ తారలు గ్లోరియా స్వాన్‌సన్, మెర్లిన్ డీట్రిచ్, కొందరు ఫ్రెంచితారలు ఇటాలియన్ చిత్రాలలో నటిస్తున్నారు. నేటికీ ఇటాలియన్ చిత్రాలు తయారవుతునే ఉన్నాయికాని, అవి నిజానికి ఇటాలియన్ అనిపించుకో తగవని విమర్శకులు అంటున్నారట.


షూషైన్, బైసికిల్ తీఫ్ వంటి చిత్రాలు నిర్మించి ప్రపంచ ఖ్యాతిగడించిన విటోరియో డిసీకా, రాసెలీనివంటి దర్శకులు కూడా నిరసన, నిస్సహాయత వెలిబుచ్చుతున్నారు. అటువంటి చిత్రాలు తిరిగి రావన్న అభిప్రాయానికి వచ్చారట. 'సంయుక్త నిర్మాణం' పేరిట అమెరికన్ ఇటాలియన్ నిర్మాతలు తీసే చిత్రాలు అటు అమెరికన్లకుగాని, ఇటు ఇటాలియన్లకు గాని తృప్తికలిగించలేక పోతున్నవని ప్రముఖులు అంటున్నారట.

'బైసికిల్ తీఫ్' తీసిన డిసికాయే ఆవిధంగా అన్నారట. తాను తయారుచేసిన ఒక 'ఇటాలియన్' చిత్రం, విజయవంతం కాలేదని, పేరుకి ఇటాలియన్ చిత్రమే అయినా, అమెరికన్ నిర్మాత దానికి వరవడి పెట్టారనీ, చివరకి చిత్రం దెబ్బతిందనీ ఆయన అన్నారట.


ఇటలీలో అమెరికన్ చిత్రాలు ఇప్పటికన్న ఎక్కువగా ప్రదర్శించడానికి వీలు కాటుచేస్తే, అమెరికన్ సినిమాలలో ఇటాలియన్ చిత్రాల ప్రదర్శనకు తాము ఏర్పాట్లు చేస్తామని అమెరికన్ నిర్మాతలు బేరం పెట్టారట. ఆమేరకు, ఇటలీలో పెద్ద నిర్మాతలు అమెరికన్లతో ఒప్పందం వ్రాసుకున్నారట. ఇదే ఈ పరిస్థితులకు కారణమని రాసెలిని, డిసీకా ప్రభృతులు అంటున్నారట. ★

హిందీ చిత్ర వార్తలు

రత్నదీప్ పిక్చర్స్ కాస్ట్యూమ్ చిత్రం "జయశ్రీ" సెన్సారై విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ నెలలోనే దేశవ్యాప్తంగా విడుదల చేయడానికి స్క్రీన్ అండ్ రాజశ్రీ పిక్చర్స్ ఏర్పాట్లు చేస్తున్నారు. "అపకారికి ఉపకారము" అన్న సూక్తిని యీ చిత్రం ప్రబోధిస్తుంది. లలితా పవార్, నిమ్మి, ప్రదీప్‌కుమార్, జీవన్, రూప్‌మాలా, డెయిసీ ఇరానీ నటించారు. దర్శకులు బాలచంద్ర శుక్ల, హర్‌సుఖ్ భట్. మాటలు పండిట్ ముఖ్‌రాం శర్మ, పాటలు 'శేవారీ'. సంగీతం 'చిత్రగుప్త'.



బర్మాషెల్ సంస్థ ఆధ్వర్యాన నిర్మితమైన డాక్యుమెంటరీ చిత్రం "షైందర్గి నేతగాళ్లు"లో ఒక సన్నివేశం. చేనేతపరిశ్రమస్థితిగతులు ఇందులో చక్కగా చిత్రించబడ్డాయి.



సహకార గృహనిర్మాణశాఖ, హరిజన సంక్షేమశాఖల మంత్రి శ్రీ సంజీవయ్యగారికి ఆంధ్ర ఫిలిం వాణిజ్యమండలివారు ఇటీవల సత్కారం చేశారు. సుందరలాల్ నహటా, మంత్రి సంజీవయ్య, రేలంగి, అంజలీదేవి గార్లను ఈ ఫోటోలో చూడవచ్చును.

సినిమా వార్తలు

వైజయంతిమాల, కిశోర్‌కుమార్, గాధా కిషన్, మీర్జా ముషారఫ్ లతో మోహన్ సెగల్ నిర్మిస్తున్న చిత్రం "న్యూ ఢిల్లీ" రూపతార్ స్టుడియోలో రెండు పెద్ద సెట్స్ పై పని పూర్తి అయింది. ఈ చిత్రానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన ఔట్ డోర్ దృశ్యాలను లాల్‌ఖిల్లా, రాష్ట్రపతి భవన్, కుతుబ్ మినార్, కొనాట్ ప్లేస్ మొదలయిన చోట్ల చిత్రిస్తున్నారు. ఈ చిత్రానికి శంకర్ జైకిషన్‌లు సంగీతం సమకూర్చారు. శైలేంద్ర హస్రత్ జైపురీలు పాటలు వ్రాశారు. కెమెరా కె. హెచ్. కపాడియా.

* * *

ఎస్. బి. ఫిలింస్ నిర్మిస్తున్న "మాలిక" చిత్రం పూర్తి అయినట్లే. మార్చి మొదటి వారంలో ఆఖరి పాటలు రెండు రికార్డు చేశారు. షకీలా మహిపాల్, చంద్రశేఖర్, కుంకుం, యశోధరా కట్జూ, ఓంప్రకాశ్‌లు నటించిన ఈ చిత్రానికి మజ్నూ దర్శకుడు. సంగీతం హన్సరాజ్ బెహల్.

* * *

చాప్లిన్ చిత్రానికి నాయిక

చార్లీ చాప్లిన్ తన కొత్త చిత్రం "కింగ్ ఇన్ న్యూయార్క్" లో నాయిక భూమికను సుప్రసిద్ధ బ్రిటిష్ నటి డాన్ ఎడామ్స్‌కు ఇచ్చాడు. లైమ్‌లైట్‌లో చాప్లిన్‌తో నటించిన క్లెర్ బ్లూమ్, చాప్లిన్ ఒకప్పుడు వివాహం చేసుకున్న పాలెట్ గోడార్డ్‌లు కూడా ఈ చిత్రంలో నటిస్తున్నారు.

కొత్త నాయిక డాన్ ఎడామ్స్ వయస్సు 25 సంవత్సరాలు. ఇప్పటికి 16 చిత్రాలలో నటించింది.

వివాహం

సినీ కెమేరామన్ శ్రీ ఈశ్వరబాబును ప్రముఖదర్శకుడు శ్రీ డి. ఎల్. రామచందర్ కుమార్తె సౌ॥ శ్యామాదేవికి (శ్రీ హెచ్. ఎం. రెడ్డి మనుమరాలు) ఫిబ్రవరి 27 వ తేదీ ఉదయం కోడంబాక్కంలో శ్రీ రెడ్డి గారి ఇంట వివాహం జరిగింది. ఆసాయంత్రం జరిగిన విందుకు శ్రీ ఎస్. ఎస్. వాసన్, నటుడు శ్రీ రాజ్ కపూర్, ప్రభృతి ప్రముఖులు పలువురు వచ్చి వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంలో ప్రముఖ గాయకుడు శ్రీ పిఠాపురం నాగేశ్వరరావు గాన సభ జరిగింది.

సొంత ఊరు

జి. వి. ఎస్. ప్రొడక్షన్స్ వారి కొత్త చిత్రం 'సొంత ఊరు' వాహినీ స్టుడియోలో చురుకుగా తయారవుతోంది. రాజసులోచన, జానకి, సూర్యకాంతం, చంద్రకుమారి, రామారావు, అమర్‌నాథ్, రమణారెడ్డి, కుటుంబరావు, వంగర, చంద్రశేఖరం, మోహన్‌దాసు మొదలైనవారు నటిస్తున్న ఈ చిత్రానికి శ్రీ ఇ. ఎస్. ఎన్. మూర్తి దర్శకత్వం నిర్వహిస్తున్నారు. రచయిత - రావూరు. సంగీతం ఘంటసాల సమకూరుస్తున్నారు. నిర్మాత శ్రీ జి. సదాశివుడు.

నరసూవారి కొత్తచిత్రం

నరసూ స్టూడియోస్ అధిపతి శ్రీ వి. ఎల్. నరసు హిందీలో నిర్మిస్తున్న చిత్రం 'సితారోంసే ఆగే'కు జెమిని అధిపతి శ్రీ ఎస్. ఎస్. వాసన్ ఫిబ్రవరి 25 ఉదయం ప్రారంభోత్సవం చేశారు. తొలి సన్నివేశాలలో నాయికా నాయకులు వైజయంతిమాల, అశోక్‌కుమార్ నటించారు. ఈ చిత్రానికి గ్యాన్ ముఖర్జీ దర్శకుడు. సంగీతం శచిన్ దేవ్ బర్మన్. ★

అనవసర ప్రసక్తి

పురుషోత్తంగారికి ఒకేఒక్క కుమారుడు. అతగాడి పేరు రఘుపతి. ఆనర్సు చదువుతున్నాడు.

ఒకనాటి ఉదయం కామేశమనే ఆయన మరొక పెద్దమనిషిని వెంటబెట్టుకుని పురుషోత్తంగారి యింటికి వెళ్ళేరు.

'వీరెవరండీ?' అని ప్రశ్నించారు పురుషోత్తంగారు.

'మీరు కాబోయే వియ్యంకుడుగారు! వీరిది విశాఖపట్నం. మల్యాల వెంకటాచలం గారని మీరు వినే ఉంటారు—సుప్రసిద్ధ న్యాయవాదులు. వీరి అమ్మాయి శశిరేఖని మీ రఘుపతికి స్థిరపరుచుకోవాలన్న అభిప్రాయంతో వచ్చారు' అన్నాడు కామేశం.

'శుభమస్తు. అమ్మాయి జాతకం తెస్తే ఇప్పించమనండి' అన్నారు పురుషోత్తంగారు.

వెంకటాచలంగారు, 'పంపుతానండి. ఈలోగా అమ్మాయిని మీ చిన్నవాడు వచ్చి చూసుకునే ఏర్పాటు చేయించవలసిందని కోరుతున్నాను. పిల్ల చక్కనిదే అనుకోండి. ఐనా వధూవరులు ఒకళ్ళనొకళ్ళు చూసుకోడం మంచిది' అన్నారు.

'అలాగేనండి, జాతకం పంపించండి' అన్నారు పురుషోత్తంగారు మళ్ళీ.

వెంకటాచలంగారు 'ముద్దూ ముచ్చటా తీర్చవాళ్ళమే మేము. కట్నం, కానుకలూ సెలవిస్తే—'

'వాటికేమండీ, తమ ఇష్టానుసారం చెయ్యొచ్చు. జాతకం పంపించండిముందు' అన్నారు పురుషోత్తంగారు.

ఇంక తాము చెప్పవలసినదేమీ కనపడక కామేశంగారూ, వెంకటాచలంగారూ సెలవుపుచ్చుకు వెళ్ళిపోయారు.

లోపలనుంచి మహేశ్వరమ్మగారు వచ్చి భర్తతో 'వారు చెప్పదలచుకున్నదేదో చెప్పనివ్వక' 'జాతకం, జాతకం!' అంటూ మొదలెట్టేరేమిటండీ?' అంది.

'కట్నంకానుక లెక్కడికి పోతాయి? మొదట జాతకం నచ్చితే తక్కినవన్నీ నిర్ణయించుకోడం ఎంతసేపు?' అన్నారు పురుషోత్తంగారు.

వారంరోజులు గడవకుండా శశిరేఖ జాతకం పోస్టులో వచ్చి చేరింది. దాన్ని స్వయంగా పురుషోత్తంగారే పరిశీలించారు. 'ఈ జాతకం మంచిదికాదు' అన్నారు తుదకు.

'ఎంచేతవల్ల?' అంది మహేశ్వరమ్మగారు. అదేసమయంలో సోమేశ్వరశాస్త్రిగారు వీథమ్మటపోతూ కనపడ్డారు. పురుషోత్తంగారు కేకవేసి పిలిచి, రప్పించారు. జాతకం అందించి, 'చిత్తగించండి ఒక్కసారి' అన్నారు.

'మంచికే జాతకం' అన్నారు శాస్త్రిగారు. పురుషోత్తంగారు, 'కాదు సరిగా చూడండి. ఈ జాతకురాలికి ఐదువతనం లేదన్న దోషం కనపడటం లేదా?'

శాస్త్రిగారు నిదానించి, 'గురుడు తులారాశియందు ఉండటంవల్ల కాబోలు మీకీ అనుమానం కలిగింది. కాని—'

ఆయన చెప్పబోయినదేదో వినకుండా పురుషోత్తంగారు దర్చకు దిగి, 'ఈ జాతకురాలికి వైధవ్యయోగం తప్ప'దని నిర్ణయించడానికి హేతువులు చూపించటం ప్రారంభించారు.

శాస్త్రిగారు అంతా విని, 'మీకంత అనుమానంగా ఉన్నప్పుడు, మరొక సంబంధమే చూసుకోండి. పెళ్ళికుమార్తెలకు కొదవ గనుకనా?' అంటూ లేచి వెళ్ళిపోయారు.

విశాఖపట్నంనుంచి వెంకటాచలంగారు మరొక జాబు వ్రాశారు. 'వరకట్నం మూడువేలివ్వదలచుకొన్నాం. వియ్యపరాలకూ, ఆడబడుచులకూ తలకొక నూట పదహార్లూ ఇస్తాం. మీ అభిప్రాయం తెలియపరచండి. మీ అబ్బాయిరాకకై ఎదురుచూస్తున్నాం.'

మహేశ్వరమ్మగారూ, ఆమె ఇద్దరు కుమార్తెలూ కూడా, 'మనం కోరకుండానే వారు ఇంత కట్నం, లాంఛనాలూ ఇస్తామంటూంటే, సందేహించడమేమిటి?' అన్నారు పురుషోత్తంగారితో. ఆయన 'మనకొక్కడే కొడుకు. మూడువేలొస్తున్నాయని మురిసిపోతున్నారేగాని, ఆ పిల్ల తనతో మృత్యుదేవతను వెంటబెట్టుకొస్తోందన్నమాట మరిచిపోతున్నారు!' అన్నాడు.

కామేశంగారు వచ్చి, 'వెంకటాచలం నాకు జాబు రాశాడండీ. మిమ్మల్ని కలుసుకుని మీ అభిప్రాయం తెలుసుకోమన్నాడు.'

పురుషోత్తంగారు, 'మావాడితో సంప్రదించాను. వాడు చదువు పూర్తిఅయి ఉద్యోగంలో ప్రవేశించేవరకూ పెళ్ళిమాట తలపెట్టవద్దు అన్నాడు.'

కామేశంగారు శశిరేఖకు రాజమహేంద్రవరంలోనే మరొక సంబంధం నిశ్చయించేశారు. ఆ కుటుంబంవారు పురుషోత్తంగారికి జ్ఞాతులే. 'ప్రధానం చేసుకుంటున్నాం, తాంబూలానికీ, ఆశీర్వచనానికీ రావలసిం'దంటూ భీమశంకరంగారు పురుషోత్తంగారి కుటుంబాన్ని కూడా పిలిచారు.

పురుషోత్తంగారు సంగతి విని నిర్విణ్ణుడై భార్యతో, "నాకు మన రఘుపతి వేరూ, వాళ్ళ బసవరాజు వేరూ కాదు. 'ఈ పిల్ల జాతకంలో ఈ దోషం ఉంది' అని వాళ్ళకి చెప్పిరావటం మన ధర్మం" అన్నాడు. మహేశ్వరమ్మ, 'చాలు, చాలు! ఎవరైనా వింటే తిట్టిపోస్తారు!' అని నోరు నొక్కింది.

ఏదో సాకుచెప్పి ప్రధానానికి వెళ్ళడం మానేసినా పురుషోత్తంగారి కుటుంబం గృహప్రవేశంనాడు భీమశంకరంగారింటికి వెళ్ళక తప్పిందికాదు. భీమశంకరంగారి భార్య సావిత్రమ్మ, మహేశ్వరమ్మతో, "మా వియ్యాలవారు చాలా మర్యాదస్థులు. అనుకున్నదానికంటె ఎక్కువే చేశారు" అంది. తనకు వారు పెట్టిన బనారసు పట్టుచీరను చూపించింది. ఆడబడుచులకూ తనకూ తలకొక నూటపదార్లే గాక ఒక్కొక్క గుజ్జుపుకాసుకూడా యిచ్చారుట!

మహేశ్వరమ్మ, ఆమె పెద్దకూతురు వెంకటలక్ష్మి, దాని చెల్లెలు శ్యామలా సావిత్రమ్మగారి అదృష్టానికి పైకి మెచ్చుకుంటూ లోలోన కుమిలిపోయారు. ఇంటికి వస్తూ దారిలో ఉండబట్టలేక పురుషోత్తంగారిని తిట్టిపోశారు.

దరిమిలాన రఘుపతికి సంబంధాలు చాలా

పాలంకి వెంకటరామచంద్రమూర్తి

★ అనవసరప్రసక్తి ★

వచ్చాయి. ఒక్క వారంలో పదిమంది కన్యా ప్రదాతలు ఒకరికి తెలియకుండా ఒకరు వచ్చి పురుషోత్తంగారి దర్శనం చేశారు. ఆయన వెంకటాచలానికి చెప్పినట్లే 'పెండ్లి కూతురు జాతకాన్ని పంపించండి' అని అందరినీ కోరేరు.

సోమేశ్వర శాస్త్రి ఆయన కూర్చుని ఒక్కొక్క జాతకమే పరీక్షించారు. అన్నింటిలోకీ రాజేశ్వరి జాతకం ఒకటో రకమైనదని నిశ్చయించారు.

రఘుపతీ, మహేశ్వరమ్మగారూ రాజేశ్వరిని చూచి రావటానికి చీపురుపల్లి వెళ్లేరు. పిల్ల నచ్చింది. "మూడు వేలు వరకట్నం, మూడు నూటపదార్లు లాంఛనాలూ పైవాళ్లు ఇస్తామన్నవే. ఆ ప్రకారం మీరు జరుప దలచుకుంటే మాకు సమ్మతమే" అంది మహేశ్వరమ్మ.

రాజేశ్వరితండ్రి వెంకట్రామయ్య 'అమ్మా నాకంత తాహతు లేదు, కట్నం తప్పనిసరి గనుక వెయ్యినూటపదహార్లు వరునికిద్దామను కున్నాను. నా ఉద్దేశానికీ మీరు చెప్పిన దానికీ చాలా వార ఉంది గనుక, నేను మరొక సంబంధం చూసుకోవలసిందే మరి' అన్నాడు.

పురుషోత్తంగారు సంగతి విని, 'నాకు జాతకం నచ్చింది. మనవాడికి పిల్ల నచ్చింది. కట్నానికేం? చేసేసుకుందాం' అన్నాడు.

'మాకు నచ్చనక్కర్లే దన్నమాట!' అని కరవొచ్చారు వెంకటలక్ష్మి, శ్యామలాను. 'ఆడపిల్లల ముచ్చటలు మాత్రం తీరవద్దుటండీ? ఒకే ఒక్క తమ్ముడాయిరి!' అని వాంగు చేసింది మహేశ్వరమ్మ.

ఆయన వాళ్లిగోడవకి చెముడు నటిస్తో, వెంకట్రామయ్యగారికి జాబు వ్రాశాడు. 'మీకు తోచినంతలో లాంఛనాలు కూడా జరిపించండి' అని ఆఖర్ని ఒక వాక్యం కూడా చేర్చాడు.

పెండ్లి పీటలమీద కూర్చున్న రాజేశ్వరి పురుషోత్తంగారికి కేవలం సౌభాగ్యదేవతలా కనపడింది. ఆమె సువాసినిగా డెబ్బై యేళ్లు బ్రతుకుతుంది? పుత్ర పౌత్రాభివృద్ధీ, దుహిత దౌహిత్రాభివృద్ధీ—అన్నీ పట్టేయి ఆమె జాతకానికి! అదంతా తలుచుకుంటూ ఆయన వెయ్యినూటపదహార్లున్న కట్నపు పళ్లేన్ని అందుకున్నాడు. హృదయం నిండుగా ఉండి, ఆ క్షణంలో ఆయనకు ఆ పళ్లెం మూడు వేల నూటపదార్ల కన్న తూకంగానే కనపడింది.

ఆడపడుచులకూ వియ్యపురాలుకూ కలిపి నూటపదహారు చదివించాడు వెంకట్రామయ్య గారు. పుచ్చుకుందామా వద్దా అనుకుంటూనే చెయ్యిచాపింది మహేశ్వరమ్మ. 'ఆ వెంకటాచలంగారు కుంచాలతో ధాన్యం పోస్తానంటే వడిపట్టక, ఇక్కడకొచ్చి వడ్లగింజలు ఏరుకుంటున్నాం చూశారా?' అన్నట్టుగా ఆమే, కూతుళ్లూ పురుషోత్తంగారికేసి కొరకొరా చూశారు.

గృహప్రవేశాని కొచ్చిన సావిత్రమ్మ 'గుజ్జుపుకాసు లివ్వలేదా?' అని అడిగింది. 'గుజ్జుపుకాసులూ లేవు, గాడిదకాసులూ లేవు!' అంటూ ఆమెతో అని, ఎందుకో ఆవైపువచ్చిన పురుషోత్తంగారికేసి, 'ఇదంతా మీ మూలానే!' అన్నట్టు చూసింది.

శశిరేఖ అత్తవారిఊరూ తన అత్తవారి ఊరూ ఒకటే అవడం రాజేశ్వరికి ప్రాణసంకటంగా పరిణమించింది. శశిరేఖ తెచ్చిన సారెలూ, చీరలూ సావిత్రమ్మగారు మహేశ్వరమ్మకూ, కూతుళ్లకూ చూపించక మానేది కాదు. తాను తెచ్చుకున్న వాటిని శశిరేఖ సారెతో పోల్చడం, 'ఎందుకూ? మాకూ దొరికింది దిక్కుమాలిన సంబంధం!' అని వీళ్ళు పిండుకోషం జరిగి రాజేశ్వరి బాధపడక తప్పేదికాదు.

ఒకనాడు రాజేశ్వరి కాఫీతెచ్చి మామగారి ముందు పెట్టింది. 'ఏమమ్మా, అలాగున్నావు?' అన్నాడాయన.

'ఆ శశిరేఖనే చేసుకోలేకపోయారా మీ అబ్బాయికి?'

'ఏం? నిన్ను మళ్ళీ ఏమైనా అన్నారా?'

'సావిత్రమ్మగారికి పట్టిన అదృష్టం తమకి పట్టలేదని అస్తమానూ బాధపడిపోతున్నారు.'

'సావిత్రమ్మకు పట్టబోయే దురవస్థ మనకు పట్టలేదని తెలిసినప్పుడు, ఇప్పుడన్నవాళ్లే నిన్ను నెత్తిమీద కెక్కించుకుంటారు. చూస్తోండు!' అన్నారు పురుషోత్తంగారు.

పురుషోత్తంగారు భీమశంకరం ఎదురైనప్పుడల్లా బసవరాజు యోగక్షేమాలు వనికట్టుకుని అడిగి తెలుసుకునేవాడు. నాటి సాయంత్రం వాళ్ళవీధినే వెళ్లటం తటస్థించి, గుమ్మంలో ఉన్న భీమశంకరాన్ని, 'మావాడేడోయ్, కనపట్టం లేదు?' అన్నాడు.

'తలనొప్పిగా ఉందని పడుక్కున్నాడు' అన్నాడు భీమశంకరం.

'తలనొప్పి' అన్నమాట చెవిని పడటంతోనే 'అది సత్యవంతునికి వచ్చిన తలనొప్పే!' అనిపించి, పురుషోత్తంగారు బసవరాజు పరుండిఉన్న గదిలోకిపోయి, 'ఏమోయ్, ఎలాగుంది?' అని అడిగేడు.

'ఏమిటండి?' అన్నాడు బసవరాజు.

'తలనొప్పితో బాధపడుతున్నావన్నాడు మీ నాన్న.'

'నిన్నరాత్రి మూడో ఆటకు సినిమాకి వెళ్ళేను. నిద్రచాలక వచ్చింది. అంతేనండి' అన్నాడు బసవరాజు.

'ఎందుకైనా మంచిది. డాక్టరుకి కబురు పెట్టు' అన్నాడు పురుషోత్తంగారు.

రఘుపతికికూడా అప్పుడప్పుడు రుగ్మత చేస్తోం డేది కాని పురుషోత్తంగారికేమీ ఆదుర్దా వుండేది కాదు. కాని బసవరాజు కేమాత్రం ఒళ్లు బాగుండలేదని తెలిసినా, ఆయనకి శశిరేఖ జాతకం కళ్లకు కట్టినట్లయేది.

ఒకనాడు అక్కడకు వెళ్ళివచ్చిన మహేశ్వరమ్మను, 'ఏమే, బసవరాజు ఎలాగున్నాడు?' అని అడిగేడు.

'నిక్షేపంలాగున్నాడు. వాడి భార్యకు నెల తప్పిందిట!'

'ఐతే వాడికి గండంకూడా తప్పిందన్నమాట!'

'తప్పడానికి అసలు గండం అంటూ ఉంటేకదూ? మీ బుర్రలో శని ఉండటం వల్ల నిక్షేపంలాంటి ఆ పిల్ల జాతకంలో మీకు దోషం కనిపించింది! లక్షణమైన పిల్ల! చూస్తే ముచ్చటేస్తుంది! ఎందుకూ? మనకీ ఉంది!'

ఆ మాట వినేసరికి పురుషోత్తంగారు ప్రళయరుద్రుడై 'నోరుముయ్!' అని ఒక గావుకేక పెట్టేడు. పెరట్లో ఉన్న రాజేశ్వరి, 'ఏమిటత్తా?' అంటూ లోనికి పరుగెత్తి వచ్చింది. ఆమెకేసి వేలెట్టి చూపుతో 'ఏం? ఇదిమాత్రం లక్షణమైన పిల్ల కాదూ?' అంటూ గర్జించాడు.

మహేశ్వరమ్మ నోరెత్తకుండా లోపలకి పోయింది. ఆయన పని ఉన్నవాడికిమల్లే చొక్కా తగిలించుకుని కోటిలింగాలవైపు నడిచిపోయాడు.

పోతూ, జరిగినదంతా నెమరుకు తెచ్చుకున్నాడు. 'నిజంగా నా బుర్రలోనేనా, శని ఉంట? శశిరేఖ జాతకంలో కనపడ్డ

దోషం నా మెదడులో దేనా?' అని తర్కించు కుంటూ వెళ్ళేసరికి సోమేశ్వరశాస్త్రి ఎదు రయ్యాడు.

'శాస్త్రిగారూ, మా వాడికి పెళ్ళి సంబం ధాలు వచ్చిన రోజుల్లో మీ కొక జాతకం చూపించాను జ్ఞాపకం ఉందా?'

'అప్పుడు చాలా చూపించారు. దేని మాట?'

'మొదట వచ్చిన జాతక మది. అందులో జాతకురాలికి వైధవ్యయోగం ఉందను కున్నాం'

'ఔను...ఆ సంబంధం మీరు వదులు కున్నారుగా? ఇప్పుడెందుకు?' అన్నాడు శాస్త్రి.

"వదిలేశాం లెండి. కాని ఆ అమ్మాయిని వివాహం చేసుకున్న కుర్రవాణ్ణి నే నెరుగు దును వాడి కా పెళ్ళివల్ల ఏ ఆపదా మూడ లేదని తెలిసి సంతోషిస్తున్నాననుకోండి. కాని 'ఆ అమ్మాయి కా యోగం ఇంతవరకూ ఎలా గ తప్పింది?' అనుకుంటున్నాను." అన్నాడు పురుషోత్తం.

'దోషపరిహారాలకు మార్గాలున్నాయి. వైధవ్యయోగమున్న కన్యను ముందుగా ఒక అరటిచెట్టుకి పెండ్లిచేసి, ఆ చెట్టును నరికేసి తర్వాత నిశ్చయింపబడ్డ వరునికి పెండ్లి చెయ్యడం వినే ఉంటారు' అన్నాడు.

'విన్నాను. కాని ఈ విషయంలో అలాం టిది జరిగినట్టు లేదు.'

'ఒక్కొక్కప్పుడు వరుని జాతకంలో కూడా దోషం ఉండి వధువు జాతకంలోని దోషానికి విరుగుడు కావచ్చు! అన్నారు శాస్త్రిగారు మళ్ళీ.

'అంటే మీరుచెప్పేది, కళత్రనష్ట యోగము ఉన్న వరునికి వైధవ్యయోగం ఉన్న వధువును పెండ్లిచేస్తే, 'ఉష్ణం ఉష్ణేన శీతలం' అన్నట్లౌతుందంటారు.'

'ఔను' అంటూ శాస్త్రిగారు వెళ్ళిపో యారు. పురుషోత్తంగారికి ఆ సంభాషణ మనశ్శాంతిని చేకూర్చింది. బసవరాజుకి జాతకంలో కళత్రనష్టయోగం ఉండి ఉండాలి!

ఆ రాత్రి ఆ విషయమే ఆలోచించు కుంటూ ఆయన నిద్రపోయాడు. మరునాటి ఉదయం, 'రాత్రి కలవచ్చిందర్రా' అన్నాడు. మహేశ్వరమ్మ, కూతుర్లూ 'ఏమి టండీ?' అని చెవులు వప్పగించి విన్నారు.

'వాళ్ళ బసవయ్యకు జబ్బుచేసి ప్రాణం మీదకు వచ్చిందిట. వాడు పరున్న మంచం యొక్క కోళ్ళు ఉన్నట్టుండి యమదూత లుగా మారి ప్రత్యక్షమయారట భర్తకు చావు మూడిందని తెలియడంతోనే శశిరేఖ ఉరకటానికి నూతివద్దకు పరుగెత్తిందిట!—

ఆయనమాటకు అడ్డువచ్చి మహేశ్వరమ్మ, 'ఎలాగైనా శశిరేఖ మహాపతివ్రత' అని మెచ్చుకుంది. ఆయన నవ్వుమండి, "మన కోడలుకంటే ఎక్కువ పతివ్రతేం కాదు! చెప్పేది వినక పానకంలో పుడకలా అడ్డు వస్తావేం?" అన్నాడు.

'చెప్పనాన్నా' అంది వెంకటలక్ష్మి.

"శశిరేఖ నూతిలో ఉరకబోయేసరికి, 'రా, రా! మేం సిద్ధంగా ఉన్నాం!' అన్న కేకలు వినిపించాయి. ఆ కేకలు విని బసవ రాజును చుట్టుముట్టిన యమదూతలు నలు గురూ, 'ఎవరది?' అంటూ వచ్చి నూతి లోకి తొంగిచూశారు. చూస్తోండగా నూతిలోంచి మరో నలుగురు యమువాళ్ళు పైకివచ్చి, 'మీరెందుకువచ్చారంటే, మీ రెందుకు వచ్చా?' రని ప్రశ్నించుకుని, ఒకాళ్ళమాట ఒకాళ్ళు వినిపించుకోకుండా దొమ్మియుద్ధం మొదలెట్టి ఒకాళ్ళనొకాళ్ళు పొడుచుకు చచ్చిపోయారు!" అన్నాడు పురుషోత్తంగారు.

'చిత్రంగా నేవుంది!' అని మెచ్చుకుంది శ్యామల.

'దీని అర్థమేమిటో తెలిసిందా? ఆపిల్లకు వైధవ్యయోగం ఉండటంవల్లనే వాడికి ప్రాణంమీదకు వచ్చింది. వాడికి కళత్ర నష్టయోగం ఉంది గనుకనే ఆమె నూతిలో పడి చావబోయింది. ఈ దుర్యోగాలు ఒక దానొకటి ప్రతిఘటించి, ఆ దంపతు లిద్దరూ బాగా ఉండటం తటస్థించింది' అని పురుషోత్తంగారు తన జ్యోతిషం తప్పగా దన్నట్టు తృప్తిగా చూశాడు.

'మీరు వెయ్యి చెప్పండి, లక్ష చెప్పండి. శశిరేఖను చేసుకోకపోవడమున్నంత తెలివి తక్కువ మరొకటి లేదంటాను. నిజంగా ఆ పిల్లకి అలాంటి దోషమే ఉందనుకున్నా, ఆ బసవరాజు జాతకంలో ఉన్న దోషం లాంటిదే మన రఘుపతికీ ఉండి, వీడూ ఆ పిల్లతో సుఖంగానే ఉండి ఉండును!' అంది మహేశ్వరమ్మ

'ఆసి దౌర్భాగ్యురాలా! ఎంత మాట న్నావు?' అంటూ లేచాడు పురుషోత్తం. అంతలో లోపల వుండి వింటూన్న రాజేశ్వరి ప్రవేశించి, 'ఆ కళత్రనష్టయోగం మీ అబ్బాయి జాతకంలోనే ఉన్నట్లయితే ఇప్పుడు మించిపోయినదేదీ లేదు. నేను చచ్చిన పదమూడవనాడే మీ అబ్బాయికి మళ్ళీ వివాహం చేసి అప్పుడు ముద్దు ముచ్చట లన్నీ తీర్చించుకుందురుగాని!' అని చెప్పి లోపలకు చక్కాపోయింది.

మరుక్షణంలో కూరలసంచీ పుచ్చుకుని గుమ్మం ఎక్కుతూన్న రఘుపతి, లక్క బొమ్మలకు మల్లే నిలబడిపోయిన ఆ నలుగుర్నీ చూసి, 'ఏమిటి?' అన్నాడు. వాళ్ళెవరూ బదులు చెప్పకపోవడంవల్ల లోపలికి వెళ్ళి రాజేశ్వరితో 'ఏమిటే' అన్నాడు.

'వాళ్ళనే అడగండి!' అంది రాజేశ్వరి.

'అదే తెలుస్తుంది' అనుకుని ఊరు కున్నాడు రఘుపతి. కాని వాళ్ళెవరూ మళ్ళీ ఆ ప్రసక్తి తీసుకురావటానికి సాహ సించకపోవడంవల్ల అతగాడికి ఆనాడు ఏమి జరిగిందో తెలియనే లేదు. ★

వనితాలోకం

కస్తూరిబాయిగాంధి స్మారకచిహ్నం

కాలచక్రము ఒకరికొరకు ఆగునదికాదు; అది ఒకరికొరకు పరుగెత్తునదీ కాదు. పూనాలో ఆగాఖాను భవనమున కస్తూరిబాయిగాంధి చెరసాల ననుభవిస్తూ కాలధర్మమొంది 12 సంవత్సరాలు కావచ్చినది. ఈ విశ్వనాటకరంగములో అనేక పాత్రలు ప్రవేశించటము నిష్క్రమించటము జరుగుతూనే ఉంటుంది. ఒకసారి నిష్క్రమించినపాత్ర ఆ వేషముతో తిరిగి రంగస్థల మలంకరించదు. ఈ పాత్రలలో జీవన్మృతులు కొందరు; మృతజీవులు కొందరు. కస్తూరిబాయిగాంధి సందేశము గ్రామస్త్రీల కందజేసే కార్యక్రమము సాగుతున్నంత కాలమూ దానితోపాటు ఆమె సజీవముగా మనకు సాక్షాత్కరిస్తూనే ఉంటుంది.

గాంధిజీ పతితమానవ సేవాపరాయణుడు. గ్రామపునర్నిర్మాణ దీక్షాకంకణబద్ధుడు. ఆయనకు పత్నీవియోగము సంభవించినపుడు ఆమె పేరు భారతదేశములో చిరస్థాయిగా నిలపటానికి ఒక పథకము సిద్ధమైంది. దానిని నిర్వహించటానికి కొన్ని లక్షలధనం సేకరింపబడి మహాత్మునకు సమర్పింపబడింది. ఈ నిధి యావద్భారతమునుండీ ప్రోగుచేయబడినందున, ఏ ప్రాంతమున సేకరింపబడిన సొమ్ము, ఆ ప్రాంతములోని గ్రామసేవకై వినియోగింపబడవలెనని మహాత్ముడు ఆదేశమిచ్చాడు. గ్రామాలలో స్త్రీ శిశుజనాభ్యుదయానికై కృషి సలుపుటకుగాను ఈ నిధిని వెచ్చింపవలెనని ఆయన ఉద్దేశించారు. దీనికిగాను ధర్మవైద్యశాలలు, శిశు ఆరోగ్యకేంద్రాలు, ప్రసూతి వైద్యశాలలు స్థాపించుటకు నిశ్చయింపబడ్డది. వ్యాధులు రాకుండాను, వచ్చి, తగ్గినతరువాత తిరిగి కోలుకోవటానికి తగినసౌకర్యాలతో ఆరోగ్య కేంద్రాలను స్థాపించటము అత్యవసరమని భావింపబడ్డది. కుష్ఠురోగనివారణకై ఒకవైద్యశాల ప్రత్యేకముగా స్థాపించుటకు నిర్ణయము జరిగింది. ఇవన్నీ పట్టణాలలో స్థాపించినట్లయితే గ్రామస్థులకు అందుబాటులో ఉండజాలవు కనుక, గ్రామాలలోనే నిర్మించటానికి యేర్పాట్లు జరిగినవి. అనాథ స్త్రీలకు శిశువులకు శరణాలయాలు స్థాపించుటకు నిర్ణయింప బడ్డది.

'కస్తూరిబాయి స్మారకనిధి గ్రామాలలోని స్త్రీ శిశువులను అనారోగ్యకరమైన పరిస్థితుల నుండి తప్పించి, వారి ఆరోగ్యరక్షణకు తగిన వసతులను కల్పించటానికి వ్యయపరచవలసి వుంటుంది.'

'గ్రామాలలోని స్త్రీలకు బిడ్డలకు ప్రాథమిక విద్య గరపటానికీ, వారికి చేతి పరిశ్రమల లోను, కుటీర పరిశ్రమలలోను, ఇతర కళల లోను నేర్పును కలిగించటానికీ ఈ నిధి ఉపయోగ పరచవలసి వుంటుంది.'

ఈ కార్యక్రమము కొనసాగించటానికి స్త్రీలకు శిక్షణ నివ్వవలసి ఉంటుంది.'

'ఈ పైన నిర్వచింపబడిన కార్యక్రమములో అన్ని అంశాలు గానీ కొన్ని గాని, గ్రామాలలో నిర్వహిస్తున్న సంస్థలకూ వాటిని నిర్వహింపదలచిన సంస్థలకూ ఈ నిధినుండి ఆర్థిక సహాయము లభించగలదు.'

ఈ కార్యక్రమానికి సంబంధించినవి గాని, సన్నిహితమైనవి గాని వీటిలో చేర్చబడును.

ఈ పైనియమాలతో కస్తూరి బాయిగాంధి జాతీయ స్మారకనిధి (నేషనల్ మెమోరియల్ ట్రస్టు) స్థాపిత మయినది. ఆంధ్ర, అస్సాము, బెంగాల్, బీహార్, ఢిల్లీ, పంజాబు, హిమాచల ప్రదేశ్, గుజరాత్, హైదరాబాదు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, మహావిదర్భ, మైసూరు, తమిళనాడు,

ఇల్లిందల సరస్వతీదేవి

★ కస్తూరిబాయిగాంధి స్మారక చిహ్నం ★

ఉత్తరప్రదేశ్, ఒరిస్సాలలో కార్యాలయాలు స్థాపింపబడ్డాయి. ప్రతికార్యాలయానికి ప్రతినిధులు నియమింపబడ్డారు. ఇవన్నీ ప్రధాన కేంద్రకార్యాలయ యాజమాన్యమున నిర్వహింపబడుతున్నాయి. ఇటీవల శివంగతులైన శ్రీ జి. వి. మావలంకరు 1954 పూర్వమే దీనికి చైర్‌మన్‌గా నియమితు లయినారు.

కేంద్రసంఘ సంక్షేమసంఘము 1953లో ఏర్పడిన తరువాత, కస్తూరిబాయి గాంధి స్మారకసంఘ ప్రతినిధులు ఈ సంఘములో కూడా ప్రాతినిధ్యము వహించుతూ వచ్చారు; కార్యకర్తలు సేవికలు కృషి సలుపుతూ వచ్చారు. కేంద్ర సంఘ సంక్షేమ సంఘము కస్తూరిబాయి గాంధి స్మారక సంఘముయొక్క ప్రణాళికను విజయవంతముగా కొనసాగించటానికి ధన సహాయము చేసింది. ఈ విధముగా అన్ని ప్రాంతాలలోని కేంద్రాలు ఇంచుమించుగా ధన సహాయము పొందినాయి. కేంద్ర సంఘ సంక్షేమ సంఘము ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేయటానికిగాను సంఘసేవికలను కొందరిని తయారు చేయుట అవసరమని గుర్తించి, వారికి శిక్షణ నివ్వవలెనని నిశ్చయించుటలో కస్తూరిబాయిగాంధి స్మారక సంఘముతో ఏకీభవించింది. కమ్యూనిటీ ప్రాజెక్టు పరిపాలకసంఘము గ్రామ సేవికల శిక్షణకు నిచ్చు బాధ్యతను కస్తూరిబాయిగాంధి స్మారక సంఘానికి ఒప్పగించింది. గ్రామ సేవికల శిక్షణ తదనుకూలమయిన ప్రాంతాలలో నిర్వహింపబడుతున్నది. 1955లో ఇందూరు లోని కస్తూరిబాయిగ్రామంలో, తొలిసారిగా ఈ కార్యక్రమము నిర్వహించుటకు నిశ్చయించారు. అనుకొన్నట్లుగా ఆ ప్రాంతములో జయప్రదముగా కార్యక్రమము నడుపబడుతున్నది.

ఈ సంఘ యాజమాన్యమున మొత్తము మీద 15 శిక్షణకేంద్రాలు, 155 ప్రసూతి కేంద్రాలు, 220 గ్రామసేవా కేంద్రాలు, 6 వైద్యాలయాలు, ఒక కుష్ఠురోగుల వైద్యాలయము స్థాపింపబడ్డాయి. వాటిలో నిర్ణీతమయిన కార్యక్రమము నిర్వహింప బడుతున్నది.

ఈ కార్యక్రమము విజయవంతముగా నిర్వహింపబడటానికి ట్రస్టీలను, సలహా సంఘమును నియమించారు. వీరితోపాటు ఒక ఆరోగ్య సలహాసంఘము నియామకమయినది. ఈ సంఘ సలహా ననుసరించి, ప్రసూతి కేంద్రాలలో పనిచేసే మంత్రసానులకు తగిన శిక్షణ, పరీక్షలు ఏర్పరచబడ్డాయి.

కార్యకర్తల సంఘ సలహాల ననుసరించి, రాష్ట్ర ప్రతినిధులు కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని పాఠశాలను నిర్వహించుతూ ఉంటారు. ప్రస్తుతము 14మంది ప్రతినిధులు పనిచేస్తున్నారు. వీరందరూ కనీసము ఏడాదికొకసారి సమావేశము కావలసి ఉంటుంది. వీరందరూ తాము నిర్వహించిన కార్యక్రమాలను ప్రధాన కార్యాలయానికి ప్రతి సంవత్సరమూ తెలుపవలసిఉంటుంది.

గ్రామసేవికా శిక్షణ మొత్తము మీద 15 వైద్యాలయాలలో ప్రారంభమైంది. ప్రతివైద్యాలయానికి స్వంతభూమి, భవనము, పశుసంపద ఉన్నాయి. ఈ సౌకర్యాలవల్ల వ్యవసాయానికీ, క్షీరకేంద్రాలు నడపటానికీ తగిన వసతులు ఏర్పడుతాయి. ఈ కేంద్రాలలో అనుకూల పరిస్థితు లేర్పడినప్పుడు తేనెటీగల పరిశ్రమ, సబ్బుపరిశ్రమ, నేత మొదలయినవి ప్రవేశపెడుతున్నారు. ప్రాథమిక చికిత్స, గృహవైద్యములలో కూడా పరీక్షలు ప్రవేశపెట్టబడ్డాయి.

బీహారువంటి కొన్ని ప్రాంతాలలో గ్రామసేవికలు తమ కార్యక్రమాలతోపాటు

విందులో అతిథులందరూ స్వర్గ నరకాల్ని గూర్చి తీవ్రంగా చర్చచేస్తున్నారు. విందుకు హాజరైన మార్క్ ట్వేన్ మాత్రం ఏమీ మాట్లాడకుండా విందారగిస్తున్నాడు. ఆయన ప్రక్కనున్న ఒక మహిళ మెల్లిగా అడిగింది: "మీరేమీ మాట్లాడడం లేదే" మని.

"అమ్మా! ఏం మాట్లాడమంటారు? నాకు ఆ రెండు చోట్లా స్నేహితులున్నారు మరి," అన్నాడు మార్క్ ట్వేన్.

శ్రీ వినోబాభావే భూదాన కార్యక్రమములో పాల్గొని ఆయన సందేశాన్ని ప్రజలలో ప్రచారము చేస్తూ వచ్చారు. గ్రామస్థులవద్దనుండి భూమి సేకరించి భూదానము చేయటములో ఎక్కువగా కృషి చేస్తూ వచ్చారు.

క్రమముగా శిక్షితుల విద్యాస్థాయి కూడా పెరిగింది. ఆదిలో శిక్షణ పొందటానికి వచ్చిన స్త్రీలలో కనీసం 7 వ తరగతి చదివిన వారైనా లేరు. కాని ఒకటి రెండు సంవత్సరాలనుండీ మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులయిన వారు ఈ శిక్షణను పొందుతున్నారు. శిక్షణాలయాలలోని నియమయుతమైన జీవితమూ, సేవాభావములోని పవిత్రలక్ష్యాలూ, ఆ వాతావరణమూ గ్రామసేవికలు నిర్వహించబోయే కార్యక్రమాలకు అనుకూలమయినవి; వారు ఎదుర్కొనబోవు సమస్యలను సులభముగా పరిష్కరించ కలిగినవి.

ప్రతి శిక్షణ కేంద్రానికి ఒక శిశుకేంద్రము, ప్రసూతి కేంద్రమూ అనుబంధముగా ఉంటాయి. వీటివల్ల శిశుసంరక్షణ విద్యాశిక్షణ మొదలయిన అంశాలలో గ్రామసేవికల శిక్షణ సమగ్రమవుతున్నది. మొత్తం మీద 1954 లో 351 మంది గ్రామసేవికలు శిక్షణ పొందారు. శిక్షణకాలము మూడు సంవత్సరాలని నిర్ణయింపబడ్డది.

కస్తూరిబాయి గాంధి జాతీయ స్మారక సంఘ యాజమాన్యమున ఆంధ్రరాష్ట్రములో సీతానగరములోని విద్యాలయములో దాయీ శిక్షణ ప్రవేశపెట్టబడింది. శిక్షితులయిన సేవికలు దారముతీయుట పట్టుపనితో పాటు హిందీ, భూగోళము, గణితము, చేతిపనులు, సాంఘిక మొదలయినవాటిలో కూడా శిక్షణపొందారు. ఆంధ్రరాష్ట్రములో 12 గ్రామసేవాకేంద్రాలు, ప్రసూతి-గ్రామసేవికా శిక్షణ కేంద్రమొకటి, 4 ప్రసూతి కేంద్రాలు పనిచేస్తున్నాయి.

హైదరాబాదులో బహుభాషా ప్రాబల్యము వల్ల, గ్రామసేవికలను శిక్షణకొరకు మైసూరుగాని సీతానగరముగాని పంపవలసి వస్తున్నది. అయినప్పటికీ 8 కేంద్రాలు చురుకుగా పనిచేస్తున్నాయి. వాటిలో 10 మంది గ్రామసేవికలు పనిచేస్తున్నారు. గ్రామస్థులకు వీరిసేవయెడ అభిమానము కృతజ్ఞత ఏర్పడ్డాయి. గ్రామస్థులు కొందరు భూములు, ధనము విరాళముగా యిచ్చి సహకరించుతున్నారు.

జనవరి నెలలో శ్రీ జి. వి. మావ్లంకరు హైదరాబాదులోని కేంద్ర సమావేశములో ప్రసంగిస్తూ 'అయిదు సంవత్సర కాలములో; ఆరువేలమంది గ్రామసేవికలకు శిక్షణనిచ్చి సంఘ సంక్షేమ సంఘానికి పంపు కార్యక్రమము తలపెట్టినాము అని చెప్పారు. 'ఈ విధముగా శిక్షణపొందిన సేవికలు ప్రజాసంస్థలలో గాని, ప్రభుత్వ సంస్థలలోగాని గ్రామసేవ చేయగలరు. దేశములో సంఘసేవికలసంఖ్య తక్కువగా ఉన్నది. ఆలోపము తీర్చటానికి ఈ పథకము సిద్ధము చేయబడ్డది.' శిక్షణ పొందినవారిలో గ్రామాలనుండి వచ్చినవారు పట్టణాలలో పనిచేయటానికి తగిన పరిజ్ఞానములేక వెనుదీయటమువల్లనూ, పట్టణాలనుండి వచ్చినవారు గ్రామాలలో పనిచేయటం న్యూనతగా భావించటము వల్లనూ, ఆదిలో కొన్ని యిబ్బందులు కలుగుతూ వచ్చాయి. ఇటువంటి ఇబ్బందులను ఎదుర్కొనటానికి వీలుగా, గడచిన పది సంవత్సరాలలో, రెండువేలమంది సేవికలకు శిక్షణ నిచ్చినట్లు శ్రీ మావలంకరు తెలిపారు.

'విద్యార్థినులు తమ శిక్షణ కాలములో కక్షలుగా చీలి సంచారము చేస్తూఉంటారు. గ్రామాలలో పరిశుభ్రత, ఆరోగ్యరక్షణ, మూఢాచార నిర్మూలన గురించి ప్రబోధము చేస్తూ వారి జీవితాలలో అభ్యుదయకరమైన మార్పులను కలిగించటానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటారు.'

'ప్రారంభములో వితంతువులకు అనాథ స్త్రీలకు ఈ శిక్షణ నివ్వవలెనని కేంద్రము నిశ్చయించినది; వృద్ధులను గాని వయసులోఉన్న స్త్రీలను గాని చేర్చుకొనదలచలేదు. అనాథ స్త్రీలు ఈ కార్యక్రమాలలో పాల్గొని గ్రామసేవచేస్తూ తమ జీవితాలను సార్థకము చేసుకొని కృతార్థురాండ్రు కావలెనని మహోద్దేశ్యము ఆశయము. కనుక సాధ్యమయినంతవరకు సంతతిలేని వితంతువులను తీసుకొనుటకే కేంద్రము నిశ్చయించింది. పట్టణాలలో, ఆధునిక పద్ధతులలో, శిక్షణపొందిన సేవికలు గ్రామసేవకు అంతగా ఉపకరించవని కారణముచేత, గ్రామాలలోనే కేంద్రాలను స్థాపించవలసి వచ్చినది. ఏ కేంద్రములో గాని గ్రామసేవికలలో తరతమభేదములు ఉండవు. వారిక్రింద నౌకరులు ఉండరు. కులమతభేదములు లేకుండా సమభావముతో మెలగటమూ, వివిధ విషయాలకు సంబంధించిన విజ్ఞానాన్ని సేకరించుకోవటము గ్రామసేవికలు శిక్షణపొందుతూనే అలవరచుకొంటారు.'

'1954 లో కస్తూరిబాయిగాంధి జాతీయ స్మారకసంఘము 130 లక్షలతో పని ప్రారంభించింది. ఈ మొత్తములో ఇంకా 86 లక్షలు మిగిలిఉన్నాయి. ఈ మొత్తాన్ని గ్రామసేవ క్రింద వినియోగించ దలచాము. కేంద్రాలకు ఇంతకాలమునుండీ ఇస్తున్న గ్రాంటు మొత్తాలను క్రమముగా తగ్గిస్తున్నాము. కొంతకాలానికి అవి స్వయం పోషకాలు కావలెనని మా ఆశయము' అని ఆ సందర్భంలోనే కీ. శే. మావలంకరు వెల్లడించారు.

ఈ కేంద్రాలలో శిక్షితులైన గ్రామలక్ష్ములు తండోపతండాలుగా బయలుదేరి, ప్రతిగ్రామములో ఇంటింటా జ్ఞానజ్యోతిని వెలిగించినంతకాలమూ కస్తూరిబాయి గాంధి నామము చిరస్థాయిగా నిలువగలదు. ★

బాలసాహితి:

ఉప్పట్లు

తోట అనేదెప్పుడూ బాగుంటుంది. అందులోను ఆతోట ఆ చాలా బాగుంటుంది. నాయుడు గారి పూరిగడ్డి బంగాళాకూడా ఆ తోటలోనే ఉండటంవల్ల దానికి మరింత కళాకాంతులు వచ్చాయి. ఆ తోటలో పూల మొక్కలున్నాయి. ఫలజాతులున్నాయి! అన్నిటికంటె ఎక్కువగా ప్రతి సాయంత్రం ఆ చుట్టుపట్లకుటుంబాల ఆడపిల్లలందరూ నాయుడు గారికూతుళ్ళతో ఆడుకోటానికి వస్తారు.

తెలుగు పిల్లల్ని తల్చుకుంటేనే ఏదో సంగీతంవిన్నట్టుగా ఉంటుంది. అందులో ఆ పల్లెటూళ్లో అమాయికంగా ఆడపిల్లలు కేరింతాలు కొడుతుంటే నందనవనం అక్కడే ఉంది కాబోలుననిపించేది. ఆ తోటలో ఆడుకునేపిల్లల్లో ఈ అయిదారుగురు పిల్లలూ నాకూ బాగా జ్ఞాపకమున్నారు. వాళ్లొక్కొక్కరిలో ఒక్కొక్క ప్రత్యేకత, ఒక్కొక్క తెలుగుదనం కనిపిస్తుండేది. వాళ్లంతా చాలా చురుకైనవాళ్లు అంచేతే తెలివైనవాళ్లు. ఉత్తి మంచివాళ్లు. అంచేతే కొంచెం తెలివి తక్కువవాళ్లకూడా. వాళ్లు లేతలేతపిల్లలు. వాళ్ళవి లేతలేత మనసులు.

రాజ్యం సుశీలా చక్కగా పాడతారు. సీత సుందరీ బాగా కథలు చెప్తారు. వాళ్లు జ్ఞాపకాని కొస్తే ఎవరికైనా చెప్పాలని బుద్ధి పుడుతుంది. కాని, నిజానికి ఈనాటి ఆడపిల్లలు కొత్త అందాలు కొత్త చందాలు నేరుస్తూంటే కోలాటాలు, గుజ్జనగూళ్ళు, బొమ్మల పెళ్ళిళ్ళు, ఉండ్రాళ్ళతద్ది, అట్లతద్ది జ్ఞాపకం చేసుకోటం తెలివితక్కువేమో నని భయం కలుగుతుంది. ఆ ఆట లెంత బావుంటాయి.

ఆరోజు అట్లతద్ది.

ఆరోజున, అంటే అట్లతద్దినాడు, సుశీల ఇంకా ఆటలో చేరలేదు. సీత చేరనేచేరింది. తెల్లవారు జామునే చద్దిబువ్వ మీగడపెరుగూ తిన్న ఉత్సాహంలో, సుశీల అన్నం తినడం ఆలస్యమైనందుకు వాళ్లకి మా చెడ్డచిరాకెత్తింది. "రండర్రా పంటలు వేసుకుందాం—సుశీలఇంకా ఎంతసేపటి కొస్తుందో. ఈలోగా చంద్రుడు వెళ్లిపోతే." అంది సీత స్వంత కీచుగొంతుకతో ధీమాగా. "చంద్రుడు వెళ్లిపోడులే, వెన్నెలే వెళ్లిపోతుంది" అన్నాను కిటికీలోంచి జడపట్టుకు ఒక్క లాగు లాగి. "ఇదుగో — చూడు" అని ఒక్క కేకపెట్టి విదిలించుకుంది

ఇద్దరు ముగ్గురు కొత్తపిల్లలో సహా ఏడెనిమిదిమందీ ఉప్పట్లు వెయ్యడం మొదలెట్టారు.

ఉప్పట్లు వేయడమంటే ముగ్గురు చేతులుపట్టుకుని ఒక్కసారిగా చప్పట్లువెయ్యాలి. యిద్దరు చేతులు తిరగవేసి ఒకళ్లు బోర్లవేస్తే అలా బోర్లవేసినవాళ్లు పండిపోతారు. అలాకాక ఇద్దరు బోర్లవేసి ఒకళ్లు తిరగవేస్తే ఆ తిరగవేసిన వాళ్లు పండిపోతారు. కాని అంతా చేతులు తిరగవేసినా అంతా బోర్లవేసినా ముగ్గుముగ్గే అని మళ్ళీ వేస్తారు. ముగ్గుముగ్గే అంటే వాళ్లభాషలో ముగ్గురూ ముగ్గురే అని కాబోలు. ఇలాపంటలు వేస్తుంటే ఒక్కొక్కరే పండిపోతారు. చివరికి ఇద్దరు మిగిలిపోయినప్పుడు పండిపోయినవాళ్లెవరైనావచ్చి వాళ్ళతో పంటలు వేస్తారు. అలా వచ్చినవాళ్ళనే ఒక్కొక్కప్పుడు 'అంబట్లో బుడగ' అంటారు. లేకపోతే 'అట్లో అరటి పండు' అనికూడా ఉంటారు. ఆ పంటలో మిగిలిపోయిన ఇద్దరిలో ఎవరో ఒకరు పండిపోతారు. కనక రెండోవాళ్ళు దొంగ అవుతారు.

ఇంతకీ ఉప్పట్లు వేసినప్పుడు సీత దొంగ అయింది, దొంగైనవాళ్ళను చూసి అంతా ఒక్కసారిగా నవ్వి

సూరంపూడి భాస్కరరావు

బాలగేయం:

మధురగీతి

శ్రీమతి జంధ్యాల స్వర్ణకుమారి

భారతపిత బాపూజీ
భవ్యమూర్తి గురుదేవుని
సందర్శన మొనరింపగ
చనుదెంచిన సమయమ్మది.

మామిడాకు తోరణముల
మంగళమయశోభలతో
ప్రకృతికాంతదరహాస
ప్రభా విజయ కేతనమా
శాంతి కేతనమున సం
క్రాంతి సర్వథా వెలసెను.

అసంఖ్యాకులౌ అతిథుల
ఆగమన మ్మతిశయించె
జనానీక హృదయవీణ
జయగీత మ్మాలపించె.

శాంతమూర్తి బాపూజీ
సరోజినీసహితముగా
అరుగుదేరె! ఎదురువచ్చి
గురుదేవుడు స్వాగతమిడె.

మహాత్మునికి మహాకవి న
మస్కార మ్మాచరించె
బాపూజీ విశ్వకవికి
ప్రతిప్రణామమ్ము జేసె.

కవిచంద్రుడు జాతిపితను
గాఢమ్ముగ కౌగిలించె
మహాకవిని బాపూ ప్రే
మాలింగన మాచరించె.

"సత్యం సౌందర్యాన్ని
శాంతం సౌజన్యాన్ని
కరుణం అనురాగాన్ని
గాఢంగా కౌగిలించె.

బాపూజీ విశ్వకవుల
దివ్యసమావేశమ్మది
రమణీయ మ్మా దృశ్యం
కమనీయ మ్మా కావ్యం."

అని మంజుల కంఠంతో
ఆలపించె 'మధురగీతి'
ప్రసిద్ధాంగ్ల కవయిత్రి
ప్రాచ్యదేశ కోకిలమ్మ.

బాపూజీ ఆమెను రవి
బాబుకు పరిచయము చేసె
"గురుదేవా! ఈమెయె నా
కూర్మితనయ ప్రజ్ఞావతి
సారస్వత రాజేశ్వరి
సర్వప్రియ సరోజిని!"

రవీంద్రకవి ప్రేమమీర
ప్రాచ్యఖండ కోయిల గని
కవీంద్రునకు భక్తితోడ
కవయిత్రి కరాలు మోడ్చె.

అందం ఆనందానికి
ఆశీస్సులు ప్రసాదించె
వినయం విజ్ఞానానికి
వినమ్రమై నిలుచుండెను.

సంగీతం సాహిత్యం
సత్యంతో మేలమాడె
కరుణమూర్తి చిరునవ్వుల
ధరాతలం పులకరించె.

అందరి మానసములలో
హర్షతరంగాలు పొంగె
జనసమూహ కరతాళ
ధ్వనుల దిక్కులెల్ల మ్రోగె.

పూర్వదిశారమారమణి
పుణ్య వదనపద్మంపై
అరుణారుణ బాలభాను
కిరణావళి ప్రసరించెను -
భరతమాత మణిమకుటం
భవ్యకాంతి ప్రభవించెను.

భారతీయ చరితంలో
స్వర్ణాక్షరసంయుతమై
నూత్నఘట్ట మేర్పడె ఆ
రత్నత్రయ రాజితమై!

తారు. సీతలాంటివాళ్ళు దొంగైతే చాలా ఉడుక్కుంటారు. కాగా సీత పంటలు మళ్ళీ వేద్దామని గోల చేసింది. రాజ్యంవాళ్ళు ఒప్పుకో లేదు. ఇంతలోకే కొత్తపిల్ల రవణమ్మ ముందుకొచ్చి నేను ఇంకో మాదిరిగా పంటలు వెయ్యడం చెప్తాను' అంది. చటుక్కున అందరూ ముందుకి వచ్చారు, సరదాపడి.

రవణమ్మ అందరినీ గుండ్రంగా సున్నాలాగ నుంచోపెట్టింది. అందరినీ చేతులు చాపమంది. వాళ్ళు 7 గురుమంది నుంచున్నారు. రాజ్యం, సుందరీ, రవణమ్మ, జానకి, సీత, వజ్రాణీ, అమ్మణ్ణి. రవణమ్మ జానకిదగ్గిర మొదలుపెట్టి ఒక్కొక్క చేతిలోనే ఉడుం, తుడుం, తుతేల్, మతేల్, పాం, పడగ, లుట్మీ, లట్మీ, చల్, దెబ్బ అని కొట్టడం మొదలెట్టింది. దెబ్బ అనే సరికి మొదట వజ్రాణి పండింది. నేను ఈ మాటలన్నీ ఒక్కసారి లెక్కపెట్టాను. 10 చేతుల కొక్కొ

★ ఉష్ణోట్లు ★

క్కరు పండిపోతారు. దీన్నిబట్టి ఒకలెక్క కట్టాను. 7 గురుమంది ఉంటే, పంటలు వెయ్యడం మొదలు పెట్టినవాళ్ళకి నాలుగోవాళ్ళుగా నుంచున్నవాళ్లు, 8 మంది ఉంటే ఆరోవాళ్లుగా నుంచున్న వాళ్ళు దొంగ అవుతారు.

వెంటనేవెళ్ళి జానకిని సీతకి ఎడంవేపున నుంచోపున్నాను. పంటలు ఇంకా సగం అవుతూ ఉండగానే. అందుచేత సీత మళ్ళీ దొంగఅయింది. ఈసారి జానకిని చోటు మారుమనడం గమ నించింది కనక నావంక గుర్రుగిమి చూసింది. పంటలు మళ్ళీ వెయ్యాలని పట్టుపట్టింది. నేనన్నానుకదా "మీరు ఈ ప్రకారంగా పంటలు ఎన్ని మాట్లు వేసుకున్నా సరే, ఎవరిదగ్గర మొదలుపెడతారో చెబితే వెంటనే ఎవరు దొంగ అవుతారో నే చెబు తాను" అన్నాను.

"ఒహోహో! పేకముక్కల టెజిక్కు ఇక్కడకూడా చూపిస్తున్నా వేమిటి?" అంది సీత. ఈలోగా ప్రజరాణి ముందుకొచ్చి "నేను ఇంకోమాదిరిగా పంటలు చెప్తానులే. మామూలుగా చేతులు పట్టండి" అంది. ఇదేమో కొత్తవిధంకాబోలు నని కొంచెం వెనక్కు తగ్గాను.

"అంబళ్ళ, కుంబళ్ళ, కూచ్చి, మురమళ్ల, తాళ్ల, లవ్వెళ్ల, అకోక్క, బికోక్క, లంక, రాజు—పంటా" అంది ప్రజరాణి రాజ్యం చేతులో కొట్టి.

"ఓస్ ఇదేనా? ఇదీ ఇందాకటి మాదిరే. ఈసారి సుందరిదొంగవు తుంది" అంటూండగానే.

"ఒరే రాజూ వాళ్ళ నాయకో నివ్వవేమిరా" అంటూ లోపలనుంచి సుశీలవాళ్ళ అమ్మమ్మ వచ్చింది. చేతులూ మూతీ తుడుచుకుంటూ సుశీలకూడా ప్రవేశించింది. సూర్యో దయాని కింకా గంట పొద్దుంది. ప్రతి అట్లతద్దికీ ఆకాటాడేందుకు పోయేవాడిని స్నేహితులతోపాటు క్షొద్దిగా దూలగుండ ముక్కలూ పల్లేరుకాయలు పట్టుకుని. ఆయేడు మాత్రం వీళ్ళ ఆటలదగ్గిర పహారా

యజమాని :—నా సొరుగులో పెట్టిన పదిరూపాయలు పోయాయి. తాళం చెవులు నీ దగ్గిరా, నాదగ్గిరా తప్ప ఇంకెవరిదగ్గిరా లేవు. ఏమైపోయాయంటావ్?

నౌకరు :—చెరో అయిదు రూపాయిలు వేసుకుని భర్తీ చేద్దాంలెండి. ఎందుకొచ్చిన అప్రతిష్ట?

జవానులా నుంచుండి పోవలసి వచ్చింది.

"ఎవళ్లో ఒహాళ్లు కూచోండర్రా. ఒక్కసారి 'వీని వీనిగుమ్మడిపండు' ఆడితే దొంగెవరో అదే తెలుస్తుంది." అంది అమ్మమ్మ.

"అమ్మమ్మా! అమ్మమ్మా! నేను కూచుంటానమ్మమ్మా" అని గారంగా సుశీల చెల్లెలు రాజ్యం పరుగెత్తుకెళ్ళి అమ్మమ్మవళ్లో చిన్నమ్మమ్మలాగా కూచ్చుంది.

అమ్మమ్మ ఎడంచేతో రాజ్యం కళ్ళు బాగామూసి పట్టుకుని "వీనీ వీనీ గుమ్మడిపండు వీని పేరేవ్వరూ" అని రాజ్యం కుడిచేతివేలిని సుశీల చేతికి తాకించింది. "అమ్మణ్ణి" అంది రాజ్యం. "అమ్మణ్ణి పారిపో" అని పాడి మళ్ళీ యథాప్రకారం "వీనీ వీని గుమ్మడిపండు వీనిపేరేవ్వరు" అని సుందరి చేతులో కొట్టింది. "రాణి" అని రాగం తీసింది రాజ్యం. "రాణిపారిపో" అని మళ్ళీ సాగించింది. ఈ సారి వీనివీని గుమ్మడిపండు అనేప్పుడు చెయ్యి కొంచెం ఒడులుచేసింది అమ్మమ్మ "జానకి" అని చెప్పేసింది రాజ్యం

బజారులో హడావిడిగా పోతున్న స్నేహితుణ్ణి నిలవేసి ఒక ఆసామీ “విన్నావు టోయ్,” అన్నాడు.

“ఏమిటి స్వామీ!” అన్నాడు స్నేహితుడు.

“హార్ని, ఇంకా తెలియ లేదన్న మాట.”

“చెప్పవయ్యా చప్పున.”

“ఏం లేదు. నిన్న రాత్రి మా యింట్లో దొంగపడ్డాడు. ఆ మట్టున వాణ్ణి పట్టుకుని ఎడా పెడా వాయించి ‘నీకు బుద్ధుందా లేదా? దొంగతనం చెయ్యటం పాపమని తెలియదా? కష్టపడి పనిచేసి బతకాలి గాని, దొంగతనం చేస్తావా?’ అమటూ అని రెండు గంటలసేపు ఏక్ దమ్మున ఉపన్యాసం ఇచ్చాను.”

“మంచిపని చేశావు. ఇక వాడికి జైలు శిక్షకూడా అనవసరం,” అన్నాడు స్నేహితుడు వెళ్లిపోతూ.

“ఆఁ, జానకి అవుటు, జానకి అవుటు” అని కేకలు పెట్టారంతా.

ఆట మళ్లీ మొదలెట్టొచ్చింది. జానకి తల్లిదగ్గిర కూర్చునేముందు చెవులో చెప్పాను మొదట్నుంచి చివరదాకా సీత పేరే చెప్ప మన్నాను. “పోదూ నీ సలహా యెవరికీ అక్కరలేదిక్కడ” అంది. చివరికి పేరు చెప్పుకోలేకపోయింది. అందుచేత తనే దొంగయింది. వాళ్ళందరుపోయి దాక్కున్నారు. “ఎక్కడి దొంగ లక్కడే గప్చిప్” అని అమ్మమ్మ. చెయ్యి తీసేసింది జానకి కళ్లు నలుపుకుంటూ బయల్దేరింది.

సీతమాత్రం ఊరుకోక “సరికే” అని గట్టిగా దీర్ఘం తీసింది మల్లి పందిరి వెనకనుంచి. జానకి మాటూ మాటి మల్లిపందిరిదగ్గరికి పరిగెత్తు కెళ్ళింది. సీతకేమీ తోచలేదు. “ఆగు, ఆగు ఉప్పుదారా? పప్పు దారా?” అని అడిగింది. “ఎడంవేపు పప్పుదారి, కుడివేపు ఉప్పుగారీ నబ్బా” అని బెదిరించింది జానకిని న్యాయం పాటించాలని హెచ్చరిస్తూను. జానకి ఒక్కక్షణం ఆగి అయితే పప్పుదారే అనిచెప్పి సీతకి టైమివ్వకుండానే ఉప్పుదారినివెళ్ళి ముట్టుకుంది.

మిగతా అందరూ ఈలోగా తల్లినిముట్టేసుకున్నారు. “నీ సలహా అక్కర్లేకండానే సీతను అవుటు చేశాను చూచావా?” అంది రాజ్యం నా సలహా ఉత్తి దండుగే అన్నట్టు.”

“అవ్వా, అవ్వా, రాజ్యం అన్యాయం చేసింది. పప్పుదారని చెప్పి ఉప్పుదారినొచ్చి ముట్టుకొంది. ఈ ఆట మళ్లీ పట్టద్దూ?” అంది సీత.

“మహా – అర్జునుడు శంఖం ఊదినట్టుగానే – సరికే అన్నావే. పరిగెత్తి తప్పించుకోలేకపోయావా?” అన్నాను సీతను ఎత్తి పొడుస్తూను.

“నీకు తెలియదేమోగాని నేను పరిగెత్తానంటేనా, వీళ్లెవరూ నన్ను ముట్టుకోలేరు. తెలుసా?” అంది ఉత్తరకుమారుణ్ణి చంపి పుట్టిన దానిలా.

“తెలియదులే” అని వెటకారంగా అంటుండగానే “హాఁ” మని లగెత్తుకుంటూ వచ్చేశారొక మగపిల్లలదండు.

నేను ‘అఁయ్’ అంటూ వాళ్ళ మీదికి, – ఆడపిల్లలు అమ్మయ్యో అంటూ లోపలికి పోగానే ఆ ఆటల నాటకంలో ఒక అంకం ముగిసి పోయింది! ★

దుష్టబుద్ధి

కొత్త ప్రపంచంలో కాలుపెట్టిన తరువాత కొలంబసు, అతని అనుచరులు, వాట్లింగ్ ద్వీపంనుండి బయలుదేరి, క్యూబాదీవి చేరారు. క్రొత్తవారిని చూడాలని, శరీరాలకు రకరకాలయిన రంగులుపూసు కొన్న మనుష్యులు ఎంతోమంది, ఎక్కడికెళ్లినా, వారిచుట్టూ గుమిగూడుతున్నారు. ఆ మానవుల నాగరికత రాతియుగపు నాటిదిగా వున్నది. కృత్రిమత్వం వారిలో యేకోశానా లేదు. ఈ స్పెయిను దేశస్థులకు వారు అతి అల్పజీవులుగా కనిపిస్తున్నారు. వారందరికీ కొలంబసు, బూరాలు, చిన్నచిన్న గంటలు, బహుమానంగా యిచ్చాడు. బూరాలు ఊదుతూ, గంటలు నడుముకు కట్టుకొని ఎగురుతూ గంతులేస్తూ, వారందరూ అంతులేని ఆనందాన్ని అనుభవించారు. కొలంబసు, తాను హిందూదేశానికి పశ్చిమప్రాంతంలో దిగాననుకున్నాడు గనుక వారికి పశ్చిమ ఇండియనులని పేరుపెట్టాడు. వారి శరీరాలు ఎర్రగా రాగిలాగా వున్నవి గనుక రెడ్ ఇండియన్లు అనే పేరు గూడా వచ్చింది.

ఆ మనుషుల ముక్కులకు బంగారు ఆభరణాలున్నయ్. ఆ బంగారం కొలంబసుకు, అతని అనుచరులకు, ఆశను అపరిమితంగా కెలెత్తించింది. వెంటనే "ఆ విలువగల లోహం మీ కెక్కడినుంచి వచ్చింది?" అని అడిగారు. కొలంబసు భాష వారికి తెలియదు. వారి భాషలో యేదో చెప్పుతూ తమకు దక్షిణదిశలో వున్నదని చేత్తో సంజ్ఞ చేశారు. కొలంబసు, దక్షిణ దశలోవున్న వారి రాజు, వారికా బంగారాన్ని యిచ్చి వుంటాడని అనుకున్నాడు, వారి భాష తెలీక.

"ద్వారకా"

మార్కోపోలో అనే అతడు హిందూదేశ సంచారంచేసి తన అనుభవాల నన్నిటిని ఒక పుస్తకంలో వ్రాశాడు. హిందూదేశం బంగారంతో తులదూగుతున్నది. ఆ దేశంలోని రాజులు తమ సుందరభవనాలకు బంగారపు పూత వేయించుకొని వున్నారు అని వ్రాశాడు. కొలంబసు ఆ పుస్తకాన్ని చదివాడు. దక్షిణదిశలో వుండే ధనవంతుడయిన వారి రాజు వారందరికీ యీ బంగారాన్ని బహుమతిగా యిచ్చి వుంటాడని అనుకున్నాడు. లోలోపల వారి సౌభాగ్యానికి అసూయపడ్డాడు.

తన రాకను తెలియజేస్తూ ఆ రాజు దగ్గరకు తాను తనదేశంనుండి తీసుకొని వచ్చిన విలువగల కొన్ని వస్తువులను తన మనుష్యులకు యిచ్చి పంపాడు. వారు తిరిగి తిరిగి దారి దొరక్క బయలుదేరినచోటికే చేరారు.

కొలంబసు ఆ ఎర్ర మనుష్యులను మరల అడిగాడు వారి రాజుగారెక్కడుంటారని. వారు సంజ్ఞలు చేస్తూ "దేశం మధ్యలో చాలా దూరంలో వున్నారు" అని చెప్పారు.

కొలంబసు తానే రాజుగారిదగ్గరికి స్వయంగా బయలుదేరాడు. తనతోపాటు ఏడుగురు పశ్చిమఇండియనులను గూడా రమ్మన్నాడు. వారందుకు అంగీకరించి బయలుదేరారు. కొలంబసు ఆ మనుష్యులకు స్పెయినుభాష నేర్పి, తమ అభిప్రాయాలను యితరులకు వ్యక్తంచేయటానికి వుపయోగపరుచుకునేందుకు - తమకు దారి చూపుతూ రాజుగారిదగ్గరకు తీసుక

పోయేందుకు-వీలుగా వారిని వెంట రమ్మన్నాడు.

హిస్పానియోలా రేవులో ఓడలు ప్రయాణమయ్యాయి. కొలంబసు ఎక్కిన ఓడలో సమస్తవస్తుసామగ్రి వున్నది. ఎన్నో విలువగల వస్తువు లున్నవి. ఓడలు ప్రయాణం సాగించిన కొద్దిసేపటిలోనే తూర్పుతీరం నుండి కొన్ని నౌకలు వారినిసమీపించాయి. వాటిలోని నావికులుకొలంబసుకుగౌరవపూర్వకంగాఅభివందనం చేశారు. సంతోష సూచకంగా అరిచారు. వారి నాయకుడు "గువాక నాగరి" కొలంబసుకు ఆహ్వానం పంపించాడు. కొలంబసు వారి ఆహ్వానాన్ని అంగీకరించాడు.

క్రొత్త ప్రపంచంలో ప్రజలు, ఇంకా సాంఘిక జీవనానికి పూర్తిగా అలవాటు పడలేదు. వారిలో చాలా మంది దేశ ద్రిమ్మరులు. చాలా అరుదుగా గ్రామాలు కనిపిస్తయ్. తూర్పుతీరంలో యేర్పడిన గ్రామానికి పెద్ద "గువాకనాగరి" పరదేశీయులు తమ దేశంలోకి అతిథులుగా వచ్చారు. వారిని సత్కరించవలసిన బాధ్యత తమమీద ఉన్నదని అనుకొని గువాకనాగరి కొలంబసుకు ఆహ్వానం పంపించాడు. అంతతో కలిసి తూర్పు దిశలో ప్రయాణం సాగించుతున్నారు.

మార్గమధ్యంలో కొలంబసు ప్రయాణం చేస్తున్న ఓడ ఒక

★ దుష్టబుద్ధి ★

నీటిలో మునిగిన రాతికి తీకొని బద్ధలయింది. ఈ సమాచారం అతిధుల రాకకోసం ఆత్రుతతో ఎదురు చూస్తున్న గువాకనాగరికి తెలిసింది. వెంటనే అతడు తన పరివారాన్నంతటినీ పోగుజేసి ప్రమాదానికి గురయినవారందరినీ రక్షించటానికి పంపించాడు పడవలతో.

కొలంబసును, అతడి పరివారాన్ని, అతడి సమస్తవస్తు సంభారాన్ని, సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. గువాకనాగరి, ఆ గ్రామ ప్రజలు-అందరు, కొలంబసు అనుచరులతో సహా సురక్షితంగా ఒడ్డు చేరినందుకు ఎంతో సంతోషించారు. వారందరిని హృదయపూర్వకంగా ఆహ్వానించి తమ గ్రామంలోకి తీసుకపోయారు.

అతిధులకు, వారి వస్తువులకు, వసతులను యేర్పాటు చెయ్యాలి. అన్నీ సక్రమంగా తయారయేసరికి మూడురోజులు పట్టింది ఆ మూడు రోజులు కొలంబసు తనవెంట తెచ్చిన విలువగల సామగ్రులన్నీ సముద్రతీరంలోనే వుండిపోయినయ్. ఎర్ర ఇండియన్లకు కొలంబసు తెచ్చిన ప్రతివస్తువు ఆశ్చర్యాన్ని కలిగించింది. వారిలో కుతూహలాన్ని రేకెత్తించింది. పనికిరాని ఆ వస్తువులన్నీ ఎంతో విలువగలిగినవిగా వారికి కనిపించినయ్. కాని ఆ వస్తువులను చేత్తో ముట్టుకోను గూడా ముట్టుకోలేదు వారు. దూరం నుండి చూచి ఆనందించారు. పగిలిపోయిన ఓడలోంచి ఆ వస్తువులను మారుస్తున్నప్పుడు సయితం వారు నల్లపూసంతటి వస్తువును గూడా ముట్టుకోలేదు. తమకు తెలిసినంత వరకు-తమ విజ్ఞానమంతా వుపయోగించి అతిధులకు నివాసాల నేర్పరచారు. అన్నివిధాలా వారికి సేవ జేశారు.

ప్రతి రోజూ అతిధుల సంతోషంకోసం నాట్యాలూ విందులూ జరిగినయ్ ఒకరోజు సముద్రతీరంలో అతిధుల వినోదార్థం పెద్ద యేర్పాట్లు చేయించాడు గువాకనాగరి. రకరకాలయిన చేపలు, పండ్లు, బంగారపు వస్తువులు కొలంబసుకు బహూకరించాడు. తమవద్ద వున్న విలువగల వస్తువులనన్నిటిని అతిధులకిచ్చి సత్కారం చేశారు. గువాకనాగరి, చెవులూ, ముక్కు, నోరు వున్న పెద్ద బంగారు నమూనాను గవ్వలతోను ఎముకలతోను అలంకరించి కొలంబసుకు స్వయంగా బహూకరించాడు.

తనకు జరిగిన గౌరవానికి ప్రతిఫలంగా కొలంబసువారందరికి గాజుపూసలు. ఎర్రటోపీలు-పంచిపెట్టాడు. కొలంబసు ఎంత పనికిరాని వస్తువులను తమ కిచ్చినా, వారు ఎంతో భక్తితో వాటిని స్వీకరించి ఆనందించారు. ఆ తెల్ల చర్మాలవారందరూ దేవలోకంలో నుండి దిగివచ్చినవారని వారి అభిప్రాయం.


గువాకనాగరి గ్రామంలో కొలంబసు, అతని అనుచరులు నాలుగు రోజులుండి, ప్రయాణమయినారు. వారిని వదిలిపెట్టటానికి గువాకనాగరి మంచిమనసు ఎంతగానో దుఃఖించింది. అతడు కన్నీరు కార్చాడు. వెళ్ళిపోయే సమయంలో కొలంబసు తలకు కిరీటంలాంటి బంగారపు వస్తువును అలంకరించుకొన్నాడు. మెడకు బంగారువతకాన్ని అమర్చుకొన్నాడు. కళ్ళ వెంట నీరుకారుస్తూ వారందరికీ వీడ్కోలు యిచ్చాడు.

ఆ అనాగరిక ప్రజల ప్రవర్తన కొలంబసును ముగ్ధుణ్ణి చేసింది. ఎంతగానో సంతోషించాడు. తన యీ అనుభవాన్ని గూర్చి తన దేశపు రాణి ఇసబెల్లాకు యీ విధంగా వ్రాశాడు.

"ఈ ప్రజలు ఇంకా రాతియుగంలోనే వున్నారు. పరాయివారిని సయితం తమలాగే చూస్తారు. ప్రేమిస్తారు. వీరి మాటలు ఎంతో మధురంగా వుంటయ్ ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడుతారు. దైవసాక్షిగా చెబుతున్నాను మహారాణీ! ప్రపంచంలో ఇంతకంటె మంచి ప్రదేశం లేదు. ఇంతకంటె మంచి ప్రజలు లేరు. వీరిని మంచి రకం బానిసలనుగా తయారు చెయ్యవచ్చు!" ★

డా॥ జాన్సన్ రచించిన ఆంగ్ల నిఘంటువును చదివిన మీదట ఒక మహిళామణి 'జాన్సన్ తన నిఘంటువులో అశ్లీల పదాలు అనేకం వాడా' డని తీవ్రంగా విమర్శించింది.

ఈ విమర్శ విని జాన్సన్ అన్నాడు: "మీరు ప్రత్యేకం అశ్లీల పదాల్ని చూడడం కోసమే నా నిఘంటువు తిరగవేసినట్టుంది."



11. మాయా? మంత్రమా?

నేను స్కూల్నుంచి వస్తూనే పుస్తకాలు దభీమని పడేసి కాఫీకోసం వంటింట్లోకి అమ్మదగ్గిరకు పరుగెత్తాను.

'ఒరేకిష్టూ, మావయ్యవచ్చాడు చూశావ్?' అంది అమ్మ కాఫీ యిస్తూ. నాకు కాఫీ తాగ బుద్ధిపుట్ట లేదు. అంతనరదా వేసింది. కొందరు మనుషుల్ని చూడగానే వీళ్లు ఎప్పుడు వెళ్లిపోతారా అన్నంత చికాకు వేస్తుంది. మా మావయ్య లాంటి మనుషుల్ని చూడగానే వీళ్లు అప్పుడే వెళ్లిపోతారేమో అని భయం వేస్తుంది! మా మావయ్య పిల్లల పాలిటి ఐస్ క్రీమ్, జూ, సర్కస్! అయిదు నిమిషాలు ఒక్కరూ వదల్రు.

'తమ్ముడూ, జగ్గప్పా, సీతా, చెల్లీ వీళ్ళంతా ఏరీ?' అన్నాను.

'మావయ్యతో వెళ్లేరు...' అని అమ్మ అంటే నాకు కళ్లనీళ్లపర్యంతమయింది.

'...నన్ను తీసుకెళ్ళకుండానా?' అన్నాడు బిక్కమొహం పెట్టి.

'ఎక్కడికీ వెళ్ళిపోలేదురా మరేం బెంగెట్టుకోకు - వంతోచక పోతేనూ, అలా వెళ్ళి షికారు కొనుక్కు వచ్చాం' అన్నాడు మావయ్య.

'ఒరే అన్నగా, మావయ్యేం నాకు బొమ్మల పుస్తకం తెచ్చేడూ' అంది చెల్లీ.

'అవునా?' అని నేను జగ్గప్ప నడిగాను.

'అవును'

'నాకు చూపించవుటే చెల్లీ?

"మొన్న ఒక్కమారు 'తెనాలి రామకృష్ణ' పాటల పుస్తకం యిమ్మంటే అరిగిపోయావేం, యిప్పుడు నేనెందుకిస్తానూ, అబ్బ!' అంది చెల్లి.

'ఇస్తావా, యియ్యవా?' అని దాని రెండు జడలూ ఒక్కసారి పట్టుకు లాగేను.

'మావయ్యా, చూడు మావయ్యా వీడూ! కోతిలా మొహం వీడూను!'

మావయ్య నన్ను కోప్పడ్డాడు.

'వదులు కిష్టూ దాన్ని-ముందు వదలమంటే...' నేను దాన్ని వది లేశాను.

'కుర్రదాన్ని దాన్ని పట్టుకుంటావేం? నువ్వు బుద్ధిగా చదువుకుంటున్నావని మీ అమ్మరాసిందే యిదేనా? మొన్న మా ఆఫీసర్లు అందరూ ఎక్స్‌కర్షన్ వేసుకుని 'కొచ్చిన్' వెళ్లొచ్చాం. అక్కడ ఒహరి దగ్గిర నేను కృషిచేసి 'మళయాళ మంత్రం' నేర్చుకున్నాను. అది నీకు చెప్పొద్దా మరి?'

'అంటే ఏమిటి మావయ్యా?' అని అడిగాను ఆత్రుతగా.

'ఏమిటేమిటి, బ్రహ్మాండమైన మేజిక్కు!' అన్నాడు మావయ్య కళ్లు పెద్దవిచేసి. ఇంతలో మాఅమ్మ పనులు పూర్తిచేసుకుని అక్కడి కొచ్చింది.

'ఏం ఆడిస్తావురా తమ్ముడూ పిల్లల్ని! నువ్వు మళయాళదేశం వెళ్ళి మంత్రం నేర్చుకొచ్చేవా?' అంది నవ్వుతూ.

'ఇదే మీతో వచ్చిన చిక్కు. మీరు కళ్లతో చూసినదాన్నే తప్ప నమ్మరు. మళయాళ మంత్రం నీకు అంతచులాగ్గా కనిపిస్తోందన్నమాట. ఆ మంత్రం చదువుతే వస్తువులు మాయమైపోతాయి తెలుసా?' అన్నాడు గంభీరంగా.

అవసరాల రామకృష్ణరావు

★ సమస్యాతోరణం ★

'చాల్లెద్దూ చెప్పకు పోయావ్, ఎన్నేళ్లువచ్చినా పిక్కలాడుతున్నావ్!' అంది అమ్మ.

'అదేమిటక్కయ్యా, అవితే నమ్మవ్—ఉదాహరణకి ఇవాళ మధ్యాహ్నం ఉల్లిపాయలు తెచ్చి ద్దామని వాడడిగి పావలా పుచ్చుకొని కొంగుని కట్టుకున్నావ్, యిప్పుడదేదీ?

అమ్మ ఆశ్చర్యంతో కొంగు చూసుకుంది. ఏదీ కొంగుని పావలా?

'ఇందాక నాకు దగ్గిరగా కూర్చుని మాట్లాడేవుగా, అప్పుడు విప్పుకున్నావ్ కాబోలు!" అంది అమ్మ. మావయ్య నవ్వేశాడు. అందరం నవ్వేశాం. అమ్మ వెళ్లిపోయింది.

'చాల్లెద్దూ మావయ్యా మా బాగా నేర్చావ్, అన్నీ కోతలు!'



అన్నాను నేను ఉడుక్కుంటూ. మావయ్య మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నాడు.

'బయలుదేరేడు మళ్ళయాళ మాంత్రికుడు! ఆడ మళయాళం దగ్గిరే ఓడిపోయాడు!' అన్నాను మళ్ళీ నేను.

'ఒరే మీకు సైన్సువరు చెబుతున్నారూ? A. R. K. యేనా?' అన్నాడు హఠాత్తుగా.

'అవును. ఏం?'

'ఏం లేదు. నేనూ వాడూ చిన్నప్పట్నుంచీ ఫ్రెండ్సుం. ఓసారి వాడ్ని కలుసుకోవాలి. ఇలా నే వచ్చానని చెప్పు. రేపు మీ 'లేబరేటరీ'కి వస్తా' అన్నాడు. మర్నాడు అనుకున్న ప్రకారం వాళ్ళిద్దరూ కలుసుకుని మాటాడుకున్నారు.

ఆ మరునాడు రాత్రి ఒక విచిత్రం జరిగింది.

మావయ్య దూరంగా కూచుని పిల్లలకి కథలు చెబుతున్నాడు. నాన్న దెబ్బలాడతాడని - నేను వాకా చివర లాంతరు పక్క పుస్తకం తెరిచి పట్టుకున్నా. మావయ్య చెప్పిన ప్రతి అక్షరం వింటున్నాను. నేను ఈ ఎడబాటు యిక భరించలేక జగ్గప్పచేతిలో కాణీ పెట్టి నాన్న పడుకున్నారో మేలుకున్నారో చూసి రమ్మన్నాను. వాడు నాకు ప్రీతికరమైన జవాబే తెచ్చాడు. పుస్తకాలు దూరంగా పడేసి మావయ్య పక్కని చేరిపోయాను.

'ఎందుకూ నాదగ్గిరకి రాకు, నేనేం చేతకానివాణ్ణిగా!' అన్నాడు మావయ్య.

'అలా ఎవరన్నారు మావయ్యా?' అన్నాను నేను చిన్నబుచ్చుకుని.

'వేరే అనాలా ఏమిటి? ఇందాక నాకే మేజిక్కూ రాదన్నావ్ గా'

'నేనంటే నీకు కోపంగాని అన్నీ కోతలెందుకు మావయ్యా? నువ్వు కొచ్చిన్ వెళ్ళి మళయాళమంత్రం నేర్చుకొచ్చేవా? ఎవరేనా నమ్ముతారూ నీమాట?'

'ఆ మంత్రాలు చదువుతే వస్తువులు మాయమైపోతాయి. అంత వరకూ ఎందుకూ, ఓ తెల్లకాగితం మీద నీయిష్టమొచ్చిన అక్షరాలు రాసియ్యి, మాయం చేస్తానో లేదో' ఈమాట అనగానే నాకాశ్చర్యం కలిగి కొంతనమ్మకం ఏర్పడింది.

'ఏమిటీ, నిజంగానా? నా ఎదురుగుండానేనా?'

'ఆఁహాఁ! అయితే మంత్రం పట్టెయ్యడానికి కొంతటైం తీసుకుంటుంది.'

'చాల్లెద్దూ చెప్పేవ్ కబుర్లూ ఈలోగా నువ్ చెరిపేద్దామనా? అబ్బో, నాదగ్గిరా?'

'అదిగో, విద్య తెలిసినవాళ్ల దగ్గిర అటెంకి కబుర్లే వద్దు. తర్వాత విచారిస్తావు. నీకూ నాకూ దూపాయిపందెం. తెల్లకాగితం తీసుకుని నీయిష్టం వచ్చిన అక్షరాలు రాయి. నీ యిష్టమొచ్చిన దగ్గిర ఆకాగితాన్ని దాచుకో. తెల్లారే సరికి అక్షరాలు మాయమయితే రూపాయ్ నాది. లేకపోతే నేనిచ్చుకుంటాను'

నేను పందేనికి ఒప్పుకున్నాను. నా ఇంగ్లీషు నోట్సులోంచి పావు తావు తెల్లకాగితం చించి తీశాను.



సొగసులరాణివంటి చర్మ సౌందర్యము మీకున్నూ గలుగును!
దినదినమున్నూ అతి
మనోహరముగా నుండుడు...
అవును. కాంతివంతమైన సొగసగు చర్మ సౌందర్యమును పొంద
గోరు మీ కల నిజము కాగలదు కూడ! మీరు స్నానముచేయు
నప్పుడున్నూ చేతులు ముఖము కడుగుకొనునప్పుడున్నూ ప్రతి
మాటూ, రెక్సోనాను ఉపయోగించుడు — ఎల్లప్పుడూ
దానియొక్క కేడిల్‌తోగూడిన నురగను మీ
చర్మముమీద మెల్లగా రుద్దుడు. తరువాత
కడిగివేయుడు. దినదినమున్నూ మీ చర్మ
సౌందర్యము ఇంకా క్రొత్త, మరీ మృదు
వైన, మనోహరత్వమును పొందును.
"మిస్ రెక్సోనా."
1955, రెక్సోనా సౌందర్య
పోటీలో మనోహరమైన
గెలుపుదారు.
Rexona
BLENDED WITH CADYL
...సహజరీతిగా రెక్సోనాతో
ఇది ఒక్కటే కేడిల్ తోగూడిన సబ్బు
పెద్ద సైజులోకూడ దొరకును
R.P. 139X52 TL

★ సమస్యలతో రణం ★

పెన్ తీసుకురావడానికి లేచి వెళ్ల బోయాను.

'అక్కర్లేదు. మీ ఫాదర్ లేస్తే మళ్ళీ కష్టం—నాదగ్గర పెన్ ఉంది రాయి'

తెల్ల కాగితం మధ్యగా "చేతనైతే మాయం చెయ్యి—లేకపోతే రూపాయ్ యియ్యి" అని మా మావయ్య పెన్ తో రాశాను. ఆ కాగితం కవర్లో పెట్టి—గాలిపటాలకని తెచ్చిఉంచిన తుమ్మజిగురు దానికి అంటించి—ఆ కవరు మా అమ్మ డబ్బులపెట్టెలో పెట్టి—దానికి 'మాస్టరు లాక్ వేసి ఆ తాళంచెవి జాగ్రత్తగా నా మొలకి కట్టుకుని పడుకున్నాను. లేస్తూనే తాళంచెవి తడిమి చూసుకున్నాను. ఉంది. లేచి పెట్టెతెరచి కవరు చూశాను. అంటించే ఉంది. విప్పి లోపల చూశాను. నాకళ్ళను నమ్మలేక పోయాను. తెల్లకాగితం !!!

'జయ మహాంకాళీ జయ! మళయాళమాంత్రికీ జయ! ఏం బాలకా ఏమైంది?' అని నవ్వుకుంటూ మావయ్య ప్రవేశించాడు. నా చేత గంటన్నర బతిమాలించుకుని 'దీనిలో రహస్యం, నే చెప్పను, పోయి మీ సైన్సు మేష్టారి నడుగు' అన్నాడు ఆ తర్వాత నే నాకిటుకు తెలుసుకున్నా ననుకోండి.

నేనింత కష్టపడి కనుక్కున్న తమాషా ఒకవారం రోజులైనా యిబ్బంది పెట్టకుండా మీకు చెబుతానా?'

అక్షరాలు ఎలా మాయమయ్యాయంటారు? మా మామయ్య తెల్ల కాగితాన్ని మార్చేశాడంటారా? ఏమిటంటారు యిది? మాయా, మంత్రమా? ★

గతవారం సమస్యకు జవాబు

ఒక్క విషయం జాగ్రత్తగా గమనిస్తే ఈ లెక్క సుళువవుతుంది.

పద్మనాభాచారి వెళ్లేసరికి పశువులకి పిల్లలు లేవు.

వెళ్లిన ఏడాదికి ప్రతి పశువూ, అంటే ఒక్కొక్క ఆవు, ఒక్కొక్క దూడను పెట్టింది.

దీని ప్రకారం అంబోతుకూడా ఉండాలని తెలుతోంది.

ఎద్దూ పశువే కదా, పశువు కింద లెక్కేకదా, కాబట్టి దాని బరువూ 1000 పౌన్లే!

మా అన్నయ్య చెప్పినదీ, నేను వెర్రి వెంగళాయినై చెప్పకోలేక పోయిందీ! ఇదే.

కాబట్టి రైతు అన్నరు:

ఒక్కొక్క పశువు బరువు 1000 పౌన్లు.

ఆవులు 8.

వాటి బరువు = 8000 పౌన్లు.

దూడలు ఒక్కొక్కటి 100 పౌన్లు.

దూడలు 8.

వాటి బరువు = 800 పౌన్లు.

అంబోతు ఒకటి దాని బరువు = 1000 పౌన్లు.

పద్మనాభాచారి బరువు = 200 పౌన్లు.

మొత్తం బల్లకట్టు తూగిన బరువు = 10,000 పౌన్లు.

ఏం, సరిపోయిందా? ★

★ దేవదాసి ★

(9- వ పేజీ తరువాయి)

ఎందరెందరో కుచేలురు నాపాదాక్రాంతు లైనారు. అయితే నా జీవితం ఇంతవరకు కొంచమైనా అనురాగజ్యోతి లేక కేవలం అంధకార బంధురమైపోయింది! మీ దర్శనంతో నాలో ఆ వెలుగు మెరిసింది! నా కదే పదివేలు! మీ జీవితాన చేరికి దారికి నన్నుడు వట్టి సుఖాలకోసం లేనిపోని ఈ అవమానాలన్నీ నాకెలా? ఈ యుద్ధప్రళయాని కంతటికీ నేనే కారణమని అవాలగోపాలము నన్నెందు కాడిపోసుకోవాలి? నేని భోగభాగ్యాలతోను, కుమ్మకారవాలతోను ఈ దేవదాసీవృత్తితో సుఖాగావిసిగిపోయాను. మీ పాదదాసిగా నాకింత ఆశ్రయమిస్తే చాలు! నాకదే మహాభాగ్యము! నామాట మన్నించండి!" అని ఆమె గద్గద కారంతో ఇక మాట్లాడలేకపోయింది. ఇక అతనేమన దానికి పోలుపోక ఒక్క నిట్టూర్పు విడిచి పెట్టాడు.

ఆమె అతని ముఖమువైపు గమనించి ఎంతో సంతోషంతో లేచి నిలబడింది.

అతడామె వైపుచూస్తూ మళ్ళీ నిట్టూర్చి "ఏమైతేనేం! చివరికి నీవే జయించావులే! నీ ఇష్ట ప్రకారమే కానీ!" అన్నాడు.

వెంటనే ఆమె ద్వారం దాకా నడిచి పోయి ఎంతో ఆప్యాయంగా జయసేనుని వైపు చూసి—

"అయ్యయ్యో! ఈ క్షణంతో మీ ప్రతిజ్ఞ నెరవేరిపోయింది.!" అన్నది.

"ఏదీ ఇంతవరకు అది నెరవేరలేదు గదా!"

"కళ్యాణదేవి వివాహమైపోగానే ఇక క్రమక్రమంగా గౌడరాజ్యానికి ఉత్తరాధికారులు మీరేగదా!"

"అవును. నీవన్నది చాలావరకు యథార్థమే! అయితే నీ కోరికవల్లనే గౌడరాజ్యం నాకు ప్రాప్తమైనది. ! అందువల్ల గౌడ రాజ్యం జయించినది నీవేకాని నేను కాదేమో!"

"కాని ముమ్మొందుగా నన్ను జయించిన వారు మీరే! అందువల్ల మీరాశ్రితా చిట్ట చివరికి మీ ప్రతిజ్ఞే నెరవేరింది!"

అన్నది నవ్వుతూనే. జయసేను డామె వాక్చాతుర్యంలో అంతరార్థం గ్రహించుకొని తటాలున లేచి ద్వారందగ్గరకు వెళ్ళి ఆమెను కౌగిలించుకున్నాడు. ఆమె కొంతసేపు అతనివద్దు తప్పించుకోబోయినట్లు నటించింది. తరవాత "అదిగో కమల! ఎందుకో ఈవైపు వస్తున్నది.!" అని అవైపు చూపించింది. విజయవర్మ ఆశ్చర్యపోయాడు! అక్కడ కమల కనిపించలేదు! వెనక్కి తిరిగి

"అయితే అన్నావా! ఉత్తుదో" అని చెప్పి అతని కరధార్యం అనరా చూసుకొని తటాలున అతని కౌగిలి విడిపించుకొని తొందర తొందరగా లోపలికి వెళ్ళిపోయింది.

తరవాత జయసేన చక్రవర్తి కళ్యాణదేవిని పట్టమహిషిగా అంగీకరించిన వార్త అంచెలమీద మహోత్సవానికీ, జయంతిపురానికీ చేరిపోయింది. మరునాడు సంధి ప్రకారం జయసేనుని సైన్యాలు పౌండ్రవర్ధన నగరంలో ప్రవేశించాయి. అటు పిమ్మట అచిరకాలంలోనే కళ్యాణదేవీ జయసేనుల వివాహంకూడా జరిగిపోయింది. వివాహానంతరం కొత్తపట్టమహిషి కళ్యాణదేవి దాసదాసీ పరివారంతో భర్తృగృహానికి తరలిపోయింది. వెనువెంటనే నవుకమాలిక కూడా తన పరివారాలతో కొత్తరాజధానికి వెళ్ళిపోయింది.

ఇక కమలకూడా ఆమెతో కలిసి వెళ్ళిపోయిందని వేరే ప్రత్యేకంగా వ్రాయ నక్కరలేదుగదా! —సమాప్తం. ★

వైతరణిలో బంగారు ఇసుక

(10 వ పేజీ తరువాయి)

ఈ స్థలం ఆక్రమించుకొని మరెవరూ కాని లేకుండా చనిపోయున్నారా చెప్పు?" అని యిద్దరూ ఆ సమీపానికి పోయి అక్కడ పొగారు.

పట్టప్రకారము కటుకోకటి కట్టి, వాళ్ళ ద్దర్ని దహనపరిచారు పోలీసులు వెంబాయిటి చేసి, చలికి చచ్చిపోయినారని తీర్మానించి. తరువాత వాళ్ళ ఆ సిపాయి ఎంత సెమకినా ఆ చీపురు, ఆ మండిగ, ఆ చేట తప్ప ఏమీ కనిపించలేదు, వాటినికూడా ఆ యిరువురి యొక్క దహనకార్యంలకు ఆహుతిచేస్తూ పరిపూర్ణ భస్మం కావించారు.

ఇగక్కడ్నుంచి ప్రజానీకం ఆ అవినా చెట్టు పడగొట్టి అదంతా పవిత్రస్థలం చేయ దానికి మొదలు పెట్టారు. క్రింద పడివున్న వాటి నరుకులు వృక్ష్యాన్ని తొలి త్రోసి చూచారు ఒకమారు. దురిపారు ఒక్క వక్కపొడి ఎక్కడ అదుగ్గా అంతలో తొంచి. ఆ వృక్ష్యంలోనుంచి ఒక్క అరా అరా మంచు లేని నుండి నిజారి వర్షిస్తుంది, మొదట ఒక ఇసుకరేణువు, రెండోది యిసుకరేణువే! మూడోది యిసుకరేణువే! మొదట్లో గిటు గీటు పరీక్షిస్తే అవన్నీ బంగారు యిసుకరేణువులు. ఆ బంగారు యిసుకరేణువు లెల్లా వచ్చాయి. ఆ పూలరేకులవా? ఆ కాత్రి గాలిన చిలుకలవా? ఆ చనిపోయిన వాళ్ళ కృషి ఫలితాలవా? ఇది తేలని ప్రశ్నగా మిగిలిపోయింది.

కృష్ణాష్టమి:— ఇదిగో ఈ సుదర్శన చూడు, ఎలా పాడు చేశావో?

చాకలి:— దీని కేముంది నిక్షేపంలాంటి దోవతి. పాడుచేశానంటారేమిటి?

కృష్ణాష్టమి:— దారుణం! ఇది మొన్న నేను కొనుక్కున్న పంచె!

వెళ్ళి రాకపోతే యీ చిలకలు మరెన్నడైనా కొంచెం చెట్టుమీద వున్న అట్టుచేసి చూచారు కాని, మర్నాడు చిలకలు రాల్చిన ఆ పూలు ఆ ప్రజ్ఞ లేకపోయింది. నిన్నటి చిలకలు మరి రావని ఒక నిర్ధారణకు వస్తూ ఆ అవినా చెట్టు అవినా చెట్టు అంతా కూలేలా గొడ్డళ్ళ కొట్టారు కూలీలు! గర్భిణి చెట్టు కూలింది.

కాని వెలుతురుకు బదులు చీకటికమ్మింది, తొందరత. ఆ చీకటిగుండా ఆకాశంకేసి చూస్తే అది అంతా కొంతసేపు అతి నల్లగా కనుపట్టి రెండు తెల్లనిగీతలమధ్య మళ్ళీ నల్లని ప్రవాహంలో కనిపించింది, నల్లని తాచులా మెలికలు తిరిగి నడుస్తూ. పోలిక్కంటే తాచులాగుంది కాని దాని కడుపులో మొసళ్ళు, తేళ్లు, తిమింగిలాలు ఇంకా ఎన్నో ప్రూరతరమైన అగాధనది

బ్రిటిష్ రచయిత రడ్యార్డ్ కిప్లింగ్‌కు ఒక అమెరికన్ ఒకసారి ఇలా వ్రాశాడు: "మీరు మీ రచనల్ని డాలర్‌కు ఒక మాట చొప్పున అమ్ముకుంటున్నారని విన్నాను. ఒక డాలర్ పంపిస్తున్నాను. మచ్చుకి పంపించవలసింది"

కిప్లింగ్ ఆ డాలర్ జేబులో వేసుకుని "థాంక్స్" అని జవాబు వ్రాశాడు.

రెండు వారాల తరవాత ఆ అమెరికన్ మళ్లీ వ్రాశాడు: "మీరిచ్చిన జవాబు సంగతిని రెండు డాలర్లకి అమ్మేశాను. లాభంలో మీ వాటాగా పోస్టేజి మినహా నలభై అయిదు సెంట్లు పంపుతున్నాను. స్వీకరించండి."

వైతరణిలో బంగారు ఇసుక

కృపాలు అన్నీ ఉన్నాయి. బంగారం ఉంది వెండీ ఉంది. లోహాలు అన్నీ వున్నాయి చెప్పొద్దూ! శేలి వెదుతున్నవానిలా కొన్ని, తైలం కళపెళా కాగుతూంటే అందులో కొట్టుమిట్టాడేవానిలా కొన్ని, కోరలు పెంచుకొన్ని, కోరలు సాచుకొన్ని వున్నాయి. ఇన్నింటినీ తప్పించుకు అడ్డంగా అ స్తమానం తెల్లనిగోవు ఒకటి ఈ ఒడ్డునుంచి ఆ వొడ్డుకు ఏ అపాయం ఏ మొగమాటం లేకుండా నిర్మలంగా నడచిపోతూ వుంటుంది. దానితో కట్టుకు ఆత్మలు చచ్చిపోయిన వాళ్ల ఆత్మలు అవతల పారంక నేరు. అల్లాగ అనేక ఆత్మలు దాటుచున్న వ్యవహారకాండ గోచరింపసాగింది. ఆ తోక ఆ పట్టుకోవడంలో ఈ ఆత్మలు చేసే పని ఏమిటా అంటే ఇటూ అటూ చెసకూడదు ఏ జంతువును చూచికొని, ఏ జాతిని చూచికొని, ఏ మోళీ చూచికొని, ఏ జాళువా చూచికొని! ఆ కొట్టుకొచ్చే నీళ్లే వైతరణి! ఆ నీళ్లల్లో మెలికలు తిరిగి కొలికలు తెగి, కోతలువడి ఘాతలు వడి మరుపు అయ్యే బంగారం అంతా యేమవుతుంది?

కొట్టుకు కొట్టుకు వచ్చి వచ్చి చివరకు తనలోక తానులినే పాములా అయిపోయి చుట్టచుట్టలుగా పెద్ద పెద్ద బంగారపుటిసుక మేటలువేస్తూ అదోరకం చిలకలకు నివాసస్థానమై యుంటుందట నది అంతా. నేను మాత్రం చూచానా! పేరు విన్నాను. వైతరణి!

ఆ చిలకలు ఒక్కొక్కప్పుడు తమ పుట్టురెక్కలమీద ఎగిరి నదిని దాటుకొచ్చి ముల్లోకాలు విహరించడం కద్దు కాని కొట్టిపారేసిన చెట్టు మరి మొలవదు. కన్నుకు పటిన కుళ్ళంక మతి తెలవదు. అందరూ కోరేరు వైతరణిలో బంగారు ఇసుక కాని ఆ యిరువురుకే దక్కింది అనేరు. ★

న్యూఢిల్లీ లేఖ

(4-వ పేజీ తరువాయి)

సౌరాష్ట్రలోని సోమనాధ దేవాలయ ప్రాముఖ్యాన్ని కూడా ఎవరూ శంకించగూడదు. సోమనాథాలయాన్ని మరమ్మతు చేయించడము మతిసంబంధమైన చర్య అయితే, అరక్షిత క్షేత్రమైన జుమా మసీదుపై డబ్బు ఖర్చు చేయడం కూడా మతిసంబంధమైన చర్యయే.

జుమా మసీదు చారిత్రక క్షేత్రమే. కాని దాని రక్షణ బాధ్యత మరొక ప్రభుత్వ సంస్థది. ఇక ఆ మసీదు పరిసరాలు ఢిల్లీ నగరానికి సిగ్గుచేటుగా ఉంటాయన్న సంగతి ఎవరూ కాదనరు. జుమా మసీదు యాజమాన్య సంఘం దానిచుట్టూ అసహ్యమైన కట్టడాలు కట్టించింది. ఈకట్టడాలను చిన్న చిన్న అంగడిదార్లకు అద్దెల కిచ్చింది. ఇవి అన్నీ శుభ్రం చేయడం ఒక సమస్య.

కనుక జుమా మసీదుకు సంబంధించి సంతరకూ చేయవలసిన దేమిటంటే అరక్షిత క్షేత్రాల రక్షణ బాధ్యత పురావస్తు శాఖకు అప్పగిస్తూ పూర్వపు శాసనాన్ని సవరించడమే.

*　　*　　*

డా॥ బి. ఆర్. అంబేద్కర్ ఈమధ్య మరొక సంచలనం కలిగించారు. ఆయన ప్రకటించిన కరపత్రం చిన్నదయినా శక్తివంతమైనది. మహారాష్ట్రులు అది చదివి హృదయశోధన చేసుకోదగినది. డా॥ అంబేద్కర్ మహారాష్ట్రులై ఉండికూడా, బొంబాయి నగరం ప్రత్యేక రాష్ట్రంగా ఉండాలని సలహా యివ్వడం ముఖ్యంగా గమనించదగినది. దాన్ని సంయుక్త మహారాష్ట్రలో కలిపి వేయడం ద్వారా, గుజరాతీ, మార్వారీ

మేనేజరు:—"ఏమండీ ఇవ్వాళ ఆఫీసు కింత ఆలస్యంగా వచ్చారేం?"

గుమాస్తా:—"ఏం లేదండీ. ఇవ్వాళ పొద్దున ఎనిమిదింటిదాకా మెలుకువ రాలేదండి. అంచేత......"

మేనేజరు:—"ఏమిటి, మీరు ఇంటిదగ్గిరకూడా నిద్రపోతారా?"

పెట్టుబడి దారులను కూడలగొట్టడం వలన బొంబాయికి నష్టం కలుగుతుందని ఆయన మహారాష్ట్రులను హెచ్చరించారు. బొంబాయిని ప్రత్యేకంగా ఉంచడంవలన అది ఇంకొక మహారాష్ట్ర ప్రాంతంగా ఉండడమే కాక, దానివలన మహారాష్ట్రులకు కూడా లాభం చేకూరుతుందని ఆయనవాదన. దక్షిణ భారతాన్ని ముక్కలు చెక్కలుగా చేసి, ఉత్తర భారతాన్ని ఏకఖండం చేసే రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సంఘం సలహాను కూడా ఆయన విమర్శించారు. డా॥ అంబేద్కర్ మంచి స్వతంత్రాలోచన గలమనిషి. బూజు దులిపినట్లు దులిపివెయ్యడంలో సిద్ధహస్తుడు. ★

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



దొంగచూపులు

—ఫోటో : పి. గురుమూర్తి.